ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

ఒంగోలు
: fb.com/vaartha Digital

నేటి మీ కపిల్‌చిట్స్ తో సభ్యత్వం ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
కపిల్ చిట్స్
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-12-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 307 పేజీలు: 12 వెల: 6.50

# పేద విద్యార్థులకూ నాణ్యమైన విద్య

## ● అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్లలో సౌర విద్యుదుత్పత్తికి చర్యలు ● అన్ని హాస్టళ్లు రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చేందుకు అధ్యయనం ● టీచర్లందరికీ ప్రపంచస్థాయి శిక్షణ ● జనవరిలో స్టూడెంట్ ఇన్నోవేషన్ సమ్మిట్: సిఎం చంద్రబాబు



**విజయవాడ,డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతీ పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనేది తన సంకల్పమని, అధికారులు ఇందుకోసం కృషి చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతంఉన్న అన్ని హాస్టళ్లను రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చేందుకు అధ్యయనం చేయాలని, దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మేరకు ఆయన బీసీ,ఎస్సీ,ఎస్టీ ఇతర సంక్షేమశాఖల అధికారులకు కీలకాదేశాలు జారీ చేసారు.పలువురు ఉన్నతాధికారులతో వర్చువల్‌గాను మాట్లాడారు. హాస్టళ్లను రెసిడెన్షియల్ పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం సాధ్యమవుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో మౌలిక వసతులు, సౌకర్యాల కల్పనతో పాటు ఏడాదిలోగా మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. గురుకులాల్లో హైజీన్ పరిస్థితులు ఉండేలా చూడాలని, విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించారు. నసనకోట, ఆత్మకూరు బిసి బాలికల పాఠశాలను రూ.2.65 కోట్లతో జూనియర్ కాలేజీగా ఉన్నతీకరించేందుకు ముఖ్యమంత్రి అనుమతించారు. అలాగే తల్లికివందనం పథకంనుంచి స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్, టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్‌కు నిధులు ఇస్తామని వెల్లడించారు.

అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్లలో సౌర విద్యుత్ ఉత్పత్తికి చర్యలుతీసుకోవాలన్నారు. దీంతో విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందన్నారు. అత్యాధునిక విద్యను తీసుకొచ్చేందుకు ముందుకెళ్తున్నామని ఆ దిశగా టీచర్లలో నైపుణ్యాలు పెంపొందించేందుకు విదేశాల్లో శిక్షణఇస్తున్నామని సిఎం అన్నారు. దశలవారీగా టీచర్లందరికీ ప్రపంచస్థాయి విద్యపై శిక్షణ ఇస్తామని తెలిపారు. గతంలో ఉపాధ్యాయులను అనేక వేధింపులకు గురిచేశారని కాని కూటమి ప్రభుత్వం టీచర్లను గౌరవించడం ప్రథమ కర్తవ్యంగా పెట్టుకుందని వివరించారు. టీచర్లను గౌరవించడంతో పాటు పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. గతంలో విద్యా >>2



ఆదివారం డల్లాస్‌లో నారా లోకేష్‌కు ఘన స్వాగతం పలుకుతున్న ప్రవాసాంధ్రులు

# ప్రవాసాంధ్రులకు అండగా ఉంటా

## మీ మద్దతుతోనే కూటమి సూపర్ హిట్

### 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

### డల్లాస్ తెలుగు డయాస్పోరా సమావేశంలో మంత్రి లోకేష్

**విజయవాడ, డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతి పక్షంలో అండగా నిలిచిన ప్రవాసాంధ్రులను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం, మా కుటుంబానికి మీరు కొండంత బలం ఇచ్చారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అమెరికా డల్లాస్ లోని కర్టిస్ కల్ వెల్ సెంటర్‌లో నిర్వహించిన తెలుగు డయాస్పోరా సమావేశంలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ముందుగా హరిహర >>2



ఆదివారం జల్లిపల్లి గ్రామవద్ద పిఎబిఆర్ కుడి కాలువకు గండి పడి నీరు పంట పొలాల్లోకి వెలుతున్న దృశ్యం

# పిఎబిఆర్ కుడికాలువకు భారీ గండి

## 20 నుంచి 30 మీటర్ల మేర కోతకు గురైన కాలువ 2లో

## నీట మునిగిన వరి, వేరుశెనగ, కంది, మిరప పొలాలు

# రూ. 610 కోట్లు రిఫండ్

## 95% విమాన సర్వీసుల పునరుద్ధరణ

## కుదుటపడుతున్న ఇండిగో




**న్యూఢిల్లీ, డిసెంబరు 7:** విమానయాన సంస్థ ఇండిగో సంక్షోభంపై కేంద్ర పౌర విమానయాన శాఖ కఠిన చర్యలు కార్యరూపంలోకి వచ్చాయి. రద్దయిన లేదా తీవ్రంగా ఆలస్యమైన విమానాలకు సంబంధించి ప్రయాణికులకు చెల్లించాల్సిన రిఫండ్‌లను ఆదివారం రాత్రి 8 గంటలలోపు పూర్తి చేయాలని విధించిన డెడ్‌లైన్ ప్రకారం ఇండిగో యాజమాన్యం ఇప్పటివరకు సుమారు రూ. 610 కోట్లను ప్రయాణికులకు రిఫండ్ చేసినట్లు మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. విమానాల రద్దు కారణంగా తమ ప్రయాణాలను రీషెడ్యూల్ చేసుకునే వారి నుంచి ఎలాంటి అదనపు రుసుములు వసూలు చేయరాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రయాణికులకు తక్షణమే సహాయం అందించేందుకు, రిఫండ్, రీబుకింగ్ సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరించేందుకు ప్రత్యేక సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడిం >>2

## రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా చిరుధాన్యాలు 2లో

## ఆలయంలో ఇంటి దొంగ చేతివాటం

అమ్మవారి ఆభరణాలు, చీరెలు తస్కరణ 2లో

## 'వందేమాతరం'పై నేడు లోక్‌సభలో చర్చ 9లో



8-12pg2exHMNWJQE 2_8-12pg2exHMNWJQE.qxd 08/Dec/25 12:07 AM Page 1





ఆదివారం గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌తో సిఎం చంద్రబాబు భేటీ దృశ్యం

# మధ్యప్రదేశ్‌లో సిఎం ఎదుట 10మంది మావోయిస్టుల లొంగుబాటు

**భోపాల్, డిసెంబరు 7:** మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఎదుట 10 మంది మావోయిస్టులు లొంగిపోయారు. బాలాఘాట్ జిల్లాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో కన్హా- భోరందియో(కెబి) డివిజన్‌కు చెందిన నలుగురు మహిళలతో సహా 10 మంది మావోయిస్టులు సిఎం ఎదుట తమ ఆయుధాలు సమర్పించి లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో స్పెషల్ ఎంఎంసి జోన్ కార్యదర్శి, మోస్ట్‌వాంటెడ్ కమాండర్ సురేందర్ అలియాస్ కబీర్ కూడా ఉన్నారు. ఐజీపేట ఓ మహిళా మావోయిస్టు నేత లొంగిపోయిన నెల రోజుల్లోనే ఇంతమంది ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి లొంగిపోవడం ఇదే ప్రథమం. 2023 ఆగస్టులో తీసుకొచ్చిన మధ్యప్రదేశ్ ప్రభుత్వం నూతన పునరావాస విధానం ప్రకారం, లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ సహాయం, సహకారాలు అందిస్తుందని సిఎం మోహన్ యాదవ్ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టుల పేరిట దాదాపు రూ.77 లక్షల మేర రివార్డు ఉందని బాలాఘాట్ రేంజ్ ఐజీ తెలిపారు. సురేందర్ అలియాస్ కబీర్ తన వద్ద ఎకె-47 రైఫిల్, వంద రౌండ్ల తూటాలు, రాకేష్ హోడి ఎకె'47, 37 రౌండ్ల తూటాలు, లాలిసింగ్ ఐఎన్ఎస్ఎఎస్ రైఫిల్, 40 రౌండ్ల తూటాలు, శిల్పా, నవీన్, జయషీలా ఎస్‌ఎల్ఆర్, 22 రౌండ్లు, విక్రమ్ రైఫిల్, 7 రౌండ్లు, జరీనా రైఫిల్, 10 రౌండ్లు, సమర్ డిటోనేటర్లు, ఐదు యూనిట్ల తదితర ఆయుధాలు పోలీసులకు అందజేసి లొంగిపోయారని ఐజి వివరించారు.



పిఎబిఆర్ కుడికాలువకు గండిపడటంతో నీట మునిగిన పంట పొలాలు

# పిఎబిఆర్ కుడికాలువకు భారీ గండి

**ఉరవకొండ, డిసెంబరు 7 ప్రభాతవార్త:** ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండలం జల్లిపల్లి గ్రామంవద్ద పిఎబిఆర్ కుడి కాలువకు 4.20 కిలో మీటరువద్ద భారీ గండి పడింది. ఆదివారం తెల్లవారు జామున దాదాపు 2 గంటల సమయంలో కాలువ 20 మీటర్ల మేర తెగిపోవడంతో పక్కనేగల దాదాపు 40 ఎకరాల్లో పంట పొలాల్లోని పంటలు నీటి ఉధృతికి కొట్టుకుపోగా, మరిన్ని పొలాలు నీట మునిగాయి. ఫలితంగా దాదాపు కోటి రూపాయలు మేర రైతులకు ఆస్తినష్టం సంభవించింది. ఇదివరకే ఒకటి రెండు సార్లు గండిపడిన చోటే మరొకమారు గండి పడటం విశేషంగా చెప్పాలి. వివరాల్లోకి వెళితే... కూడేరు మండలంలోని 42 చెరువులను నింపడానికిగాను పిఎబిఆర్ కుడి కాలువకు దాదాపు వారం రోజుల క్రితం నుండి నీటిని విడుదల చేస్తున్నట్లు సమాచారం. అయితే కాలుకు నీటిని విడుదల చేసే గేటు తప్పుపట్టి పోవడంతో దాని నిర్వహణ కష్టతరంగా మారినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఆదివారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో కాలువకు భారీ గండి పడింది. దీంతో కాలువ దాదాపు 20 మీటర్ల మేర కోతకు గురై నీరు మొత్తం కాలువ పక్కనగల బోర్లు, బావుల కింద సాగులోవున్న వరి, వేరుశెనగ, కంది, కొంత మేర మిరప పంట పొలాలను ముంచెత్తింది. ఇదివరకే 20 ఎకరాల్లో వరి పంట కోతలు జరుగగా ఆ పంట మొత్తం కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. నీటి ఉధృతికి పంట భూములు రెండు, మూడు మీటర్ల మేర కోతకు గురై పొలాల్లోకి బంకమట్టి, రాళ్ల గుండ్లు చేరాయి. అంతే కాకుండా బోర్లు మునిగిపోగా పైపులు కొట్టుకుపోయి బావులు పూడిపోయాయి. చేతికందిన పంట నోటి కందకుండా పోయిందని దీంతో దాదాపు కోటి రూపాయల మేర పంట నష్టం జరిగిందని బాధిత రైతులు నరేష్, రామాంజినేయులు, లాలెప్ప, చిన్న ఎర్రిస్వామి, అనీల్ తదితరులు చెబుతున్నారు. కోతకు గురైన పంట పొలాలను బాగు చేసుకోవడానికి కూడా భారీగా మళ్లీ పెట్టుబడి పెట్టుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పుడు గండిపడిన చోటే గత ఏడాది కాలువకు గండిపడినా అధికారులు సరైన రీతిలో గండి పూడ్చివేత చేపట్టలేదని కేవలం ఇసుక బస్తాలు అడ్డుపెట్టి చేతులు దులుపుకున్నారని చెబుతున్నారు. నాడే శాశ్విత ప్రాతిపదిక కాలువకు గండి పూడ్చి ఉంటే నేడు మరొకమారు గండి పడేది కాదని అంటున్నారు.

**గండిను పరిశీలించిన తహాశీల్దార్:**

కాగా గండి పడిన ప్రదేశాన్ని కూడేరు మండల ఇంచార్జ్ తహాశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా సిబ్బందితో కలిసి పరిశీలించారు. గండి పడటంతో పంటలకు జరిగిన నష్టంపై ప్రాథమిక అంచనా వేశారు. గండి పూడ్చివేతపై సంబంధితశాఖ అధికారులతో మాట్లాడారు. ఈ సందర్బంగా తహాశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా మాట్లాడుతూ ఘటనపై సమగ్ర సమాచారంతో కలెక్టర్‌కు నివేదిక అందిస్తామన్నారు.

**పిఎబిఆర్ కుడి కాలువ గండి పూడ్చేందుకు తక్షణం చర్యలు చేపట్టండి: మంత్రి పయ్యావుల కేశవ్**

గండిని పూడ్చివేయడానికి అవసరమైన చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. పిఎబిఆర్ కుడి కాలువకు పడిన గండి విషయం తెలిసిన వెంటనే ఆయన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గండిని పూడ్చడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని, గండి పడిన ప్రాంతంవద్ద శాండ్ బ్యాగులు ఏర్పాటు చేసి నీరు వృథాగా పోకుండా చూడాలని ఆదేశించారు. నీరు వృథా కాకుండా ఉండేందుకు 0.40 కిలో మీటరువద్ద ఎస్కేప్ రెగ్యులేటర్ ద్వారా నీటిని పెన్నా నదిలోకి మళ్లించి ఎంపిఆర్ డ్యాంకు నీరు చేరేలా చర్యలు చేపట్టాలని మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు.

# గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో సిఎం చంద్రబాబు భేటీ

**విజయవాడ,డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అమరావతి రాజధాని నిర్మాణం, క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు,విశాఖలో జరిగిన అంతర్జాతీయ పెట్టుబడుదారుల సదస్సు తదితరాల అనంతర పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌కు వివరించారు, పెట్టుబడుల దిశగా రాష్ట్రానికి వస్తున్న పరిశ్రమలు, విద్యారంగం, వైద్యం తదితరంశాల్లో మౌలిక విషయాలు, సదుపాయాల గురించి ఆయన గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌కు వివరించారు. జిల్లాల పునర్విభజనంశంపై, రాష్ట్రమంతటా సమాంతర ప్రాంతీయాభివృద్ధిని గురించి వివరించారు.గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌తో జాతీయ,ప్రాంతీయాంశాలపైనా ముచ్చటించారు.ఇందుకు సంబంధించి అందుబాటులోకి వచ్చిన కీలక సమాచారాన్ని అనుసరించి సిఎం చంద్రబాబు నిన్న లోక్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో భేటీ అయ్యారు. సిఎం చంద్రబాబుమర్యాద పూర్వకంగా గవర్నర్‌తో సమావేశమయ్యారని సిఎంఒ వర్గాల సమాచారం.

# పేద విద్యార్థులకూ నాణ్యమైన విద్య

>> వ్యవస్థను అస్తవ్యస్తంచేశారు ఇప్పుడు ఆ పరిస్థితిని చక్కదిద్దామని అన్నారు. కూటమి ప్రభుత్వం స్పష్టమైనవిధానంతో ముందుకెళ్తోందని తెలిపారు. కేంద్రంలో వికసిత్ భారత్ తీసుకొస్తే రాష్ట్రంలో స్వర్ణాంధ్ర నినాదంతో ముందుకెళ్తున్నామని సిఎం చంద్రబాబు అన్నారు. ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలిచ్చే స్థాయికి చేరతారని ఆశిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ముస్తాబు కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని అలానే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామని వెల్లడించారు. పిల్లలు వినూత్న ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలు రూపొందిస్తున్నారని సిఎం కొనియాడారు. ఈ ఏడాది జనవరిలో స్టూడెంట్ ఇన్నోవేషన్ సమిట్ నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే విద్యాశాఖలో 29 సంస్కరణలు తీసుకొచ్చామని రాబోయే రోజుల్లో మరిన్ని సంస్కరణలు తెస్తామని సిఎం అన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించాల్సిన రూ.1,700 కోట్లు కాలేజీలకు చెల్లించకపోవడంతో విద్యార్థులే రూ.900 కోట్లు చెల్లించారని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఇంకా యాజమాన్యాలకు సుమారు రూ.800 కోట్ల బకాయిలు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం చెల్లించాల్సి ఉందని వివరించారు. సంక్షేమ శాఖలు 'వన్ ఫ్యామిలీవన్ ఎంట్రప్రెన్యూర్' విధానాన్ని అమలు చేసేబాధ్యత తీసుకోవాలని అధికారులకు సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ లక్ష్యం నెరవేరితే ఆయా వర్గాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు దోహదపడుతుందని చెప్పారు. ఇమామ్‌లు, పాస్టర్లకు బకాయిలు ఏమైనాఉంటే వెంటనే విడుదల చేయాల న్నారు. అలాగే హజ్ యాత్రకు దరఖాస్తుల గడువును పెంచేందుకు అవకాశం కల్పించాలని సిఎం సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో వక్ఫ్ ప్రాపర్టీ ఆడిట్ జరిగింది... అయితే ప్రస్తుతం వాటి ఆస్తుల స్థితిగతులు తెసుకునేందుకు మదింపు జరగాలన్నారు. రజకులకు గ్యాస్‌తో పనిచేసే ఇస్త్రీ పెట్టెలు, సబ్సిడీ సిలిండర్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. వెనుకబడిన వర్గాల ఆదాయార్జనకు కొత్త మార్గాలను అన్వేషించాలని సిఎం అన్నారు. మత్స్యకార వర్గాలు సీవీడ్‌లాంటి నూతన ప్రత్యామ్నాయాలను ఎంచుకునేలా ప్రోత్సహిం చాలన్నారు. వెనుకబడిన వర్గాలను ఉన్నత స్థానానికి తీసుకువెళ్లాలని, ప్రభుత్వం ఈ వర్గాలపై పెద్దఎత్తున వ్యయం చేస్తున్నా ఫలితాలు ఆశించిన స్థాయిలో రావడం లేదన్నారు. కులవృత్తుల్లో ఆధునీకరణతోనే ఆయా వర్గాలు ఎక్కువ ఆదాయాన్ని పొందగలవని చెప్పారు. అన్నివర్గాలకు సమన్యాయం చేసేలా. ఉండాలన్నారు. అందరికీ సంక్షేమ ఫలాలుదక్కేలా... అధికార యంత్రాంగం చూడాలన్నారు., సంతృప్తి పరచాలని సిఎం సూచించారు. స్థానిక సంస్థల్లో బిసి లకు 34 శాతం రిజర్వేషన్లకు సంబంధించి ఎలాంటి న్యాయ పరమైన ఆటంకాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పురోగతిలో ఉన్న నెల్లూరు, ఏలూరు, కర్నూలు బిసి భవనాల నిర్మాణం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలోని 64 కులాల కార్పొరేషన్లలో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాల్ని అధ్యయనం చేసేందుకు అన్ని వర్క్ షాపు నిర్వహించాలని సూచించారు.

# రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా చిరుధాన్యాలు

**విజయవాడ,డిసెంబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక పౌరసరఫరాల శాఖ దుకాణాలద్వారా తృణధాన్యాలను ఉచితంగా అందిం చనున్నది., ప్రజల ఆరోగ్యం, మారుతున్న ఆహార అలవాట్లను దృష్టిలో పెట్టుకుని పేద ప్రజలకు పోషక విలువలు కలిగిన తృణ ధాన్యాలను ఉచితంగానే సరఫరా చేస్తోంది. గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో రేషన్ కార్డుదారులకు రాగులు, రాగిపండిని ప్యాకెట్ల రూపంలో పంపిణీ చేసింది. ఇప్పుడు మళ్లీ టిడిపికూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ సరుకుల్లో తృణ ధాన్యాలను అందించాలని నిర్ణయించింది. రేషన్‌దుకాణాల ద్వారా ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరుజిల్లాల్లో జొన్నల పంపిణీని ప్రారంభించింది. ప్రతి మనిషికి ఐదు కేజీల చొప్పున బియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఈ రేషన్లో కొంతమేర బియ్యానికి బదులుగా గరిష్ఠంగా మూడు కేజీలవరకు రాగులు, జొన్నలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే ప్రతి నెలా 20కేజీల రేషన్ బియ్యం తీసుకునే కుటుంబం.. ఇప్పుడు రెండు కేజీల రాగులు మాత్రమేకావాలనుకుంటే..ఆ మేరకు బియ్యాన్ని మినహాయించుకుని మిగిలిన 18కేజీల బియ్యాన్ని, రెండు కేజీల రాగులను అందిస్తారు. జాతీయ ఆహార భద్రత పథకంలోభాగంగా కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సిఐ ద్వారా రాష్ట్రంలో పీడీఎస్ అవసరాలకు సరిపడా రాగులు,జొన్నలను కేటాయించేది. ఇప్పుడు కేంద్రం కేటాయించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే టెండరు ప్రక్రియ ద్వారా సేకరించి ఉచితంగా సరఫరా చేస్తోంది.

# ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయంలో ఇఒ చేతివాటం

## అమ్మవారి ఆభరణాలు, చీరెలు తస్కరణ

### పట్టుకున్న భక్తులు, గ్రామస్తులు, పోలీసులకు అప్పగింత

**కదిరి, డిసెంబరు 7 ప్రభాతవార్త:** అమ్మవారి ఆభరణాలను కాపాడాల్సిన దేవాలయ ఈవోనే.. అదే ఆభరణాలపై కన్నేసి దొంగతనానికి దిగితే... ఆ దేవత భక్తులు ఎలా వదిలేస్తారు చెప్పండి. అదే ఘటన జరిగింది శ్రీసత్యసాయి జిల్లా కదిరి రూరల్ మండలం ఎర్రదొడ్డి గంగమ్మ గుడి వద్ద. ఆలయానికి రక్షణగా ఉండాల్సిన కార్యనిర్వాహక అధికారియే ఆలయం వద్దకు ఆటోలో వచ్చి చోరీకి పాల్పడి.. అడ్డంగా దొరికిపోయాడు. అసలేం జరిగిందంటే.. ఎర్రదొడ్డి గంగమ్మ గుడి ఇఒ మురళీకృష్ణ.. ఆలయంలోని అమ్మవారికి సంబంధించిన 5 కిలోల వెండి ఆభరణాలు, చీరలు సహా ఇతర విలువైన వస్తువులు చాకచక్యంగా తస్కరించి చేతివాటంప్రదర్శించాడు. ఎవరూ లేరనుకుని దోచుకున్న సామగ్రితో తప్పించుకునేందుకు సిద్ధమయ్యాడు. గమనించిన భక్తులు,స్థానికులు.. అడ్డంగా అతణ్ని పట్టుకున్నారు. అనంతరం.. పోలీసులకు సమాచారం అందించారు. పట్టుబడిన మురళీకృష్ణ సహా అతడి కుటుంబ సభ్యులను ఆటోలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి.. మొత్తం వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులను తీవ్రంగా విమర్శిస్తూ వెంటనే ఇఒను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# రూ. 610 కోట్లు రిఫండ్

>> చింది. ప్రభుత్వ జోక్యంతో ఇండిగో పనితీరు క్రమంగా మెరుగుపడుతోందని, విమానాల షెడ్యూల్స్ సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది. శుక్రవారం 706 విమానాలు నడపగా, శనివారానికి ఆ సంఖ్య 1,565కు పెరిగింది. ఆదివారం 1,650కి చేరుకున్నాయని వెల్లడించింది. ఇతర దేశీయ విమానయాన సంస్థల కార్యకలాపాలు సజావుగా పూర్తి సామర్థ్యంతో నడుస్తున్నాయని తెలిపింది. ఇండిగో విమానాల రద్దుతో పెరిగిన డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని టికెట్ ధరలు అమాంతం పెరగడంతో, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ధరలపై పరిమితి విధించింది. ఈ చర్యతో ప్రభావిత మార్గాల్లో ఛార్జీలు అదుపులోకి వచ్చాయని పేర్కొంది. అదేవిధంగా, ప్రయాణికుల నుంచి వేరుపడిన లగేజీని 48 గంటల్లోగా గుర్తించి అందజేయాలని ఆదేశించగా, శనివారం నాటికి 3,000 బ్యాగులను ఇండిగో డెలివరీ చేసింది. ఢిల్లీ, ముంబై, బెంగళూరు సహా ప్రధాన విమానాశ్రయాల్లో పరిస్థితులు సాధారణంగా ఉన్నాయని, కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయని ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్లు ధృవీకరించారు. ప్రభుత్వ వేగవంతమైన చర్యలతో దేశవ్యాప్తంగా విమానయాన కార్యకలాపాలువేగంగా స్థిరపడుతున్నాయని, పూర్తిస్థాయిలో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు పర్యవేక్షణ కొనసాగుతుందని మంత్రిత్వశాఖ హామీ ఇచ్చింది. దేశీయ విమానయాన సంస్థ ఇండిగోలో కార్యకలాపాలు తీవ్ర గందరగోళంలో పడ్డాయి. పెద్ద ఎత్తున విమానాలు ఆలస్యం కావడం, కొన్ని సర్వీసులు రద్దుకావడంతో వేలాదిమంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సంక్షోభంపై తక్షణమే స్పందించిన ఇండిగో యాజమాన్యం, పరిస్థితిని చక్కదిద్దేందుకు ఒక ఉన్నత స్థాయి సంక్షోభ నిర్వహణ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఇండిగో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో ప్రస్తుత సంక్షోభం, దాని తీవ్రతపై యాజమాన్య బృందం బోర్డు సభ్యులకు సమగ్రంగా వివరించింది. అనంతరం బోర్డు సభ్యులు ప్రత్యేకంగా సమావేశమై, వేగంగా మారుతున్న పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఈ ప్రత్యేక కమిటీని నియమించారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించి, సర్వీసులను సాధారణ స్థితికి తీసుకురావడమే తమ ప్రథమ కర్తవ్యమని పేర్కొంది.

# సిఎం సీరియస్.. ఆలయాల్లో తప్పులు చేస్తే కఠిన చర్యలని హెచ్చరిక

**విజయవాడ,డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** సత్యసాయి జిల్లా కదిరి రూరల్ పరిధిలో గంగమ్మ గుడిలో ఆలయ ఈవోనే చోరీచేసిన ఘటనపై ప్రభుత్వం చర్యలుచేపట్టింది. సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఇఒ మురళీకృష్ణను సస్పెండ్ చేస్తూ దేవాదాయ శాఖ ఆదేశాలు ఇచ్చింది. గుడిలో 5 కిలోల వెండి ఆభరాణలు, చీరలు సహా ఇతర విలువైన వస్తువులను అదే దేవాలయం ఇఒ మురళీ కృష్ణ చోరి చేస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికి పోయాడు. ఆలయ ఇఒనే చోరికి పాల్పడిన ఘటనపై సిఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు.

ఈ ఘటనకు పాల్పడిన ఇఒ మురళీ కృష్ణను సస్పెండ్ చేయాల్సిందిగా దేవదాయ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఇఒ మురళి కృష్ణను సస్పెండ్ చేస్తూ దేవాదాయ శాఖ ఉన్నత అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే చోరికి ప్రయత్నించిన ఇఒ మురళీ కృష్ణపై కేసు నమోదు చేయాలని సిఎం ఆదేశించారు. స్థానిక దేవాదాయ శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు..ప్రాథమిక విచారణలో చోరీ నిర్ధారణ కావడంతో అతన్ని అరెస్ట్ చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బ తీసేలా వ్యవహరించిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# అండగా ఉంటా

>> పీఠం వేదపండితులు మంత్రి లోకేష్‌కు వేదాశీర్వచనాలు అందించారు. అనంతరం ప్రవాసాంధ్రులను ఉద్దేశించి మంత్రి నారా లోకేష్ ప్రసంగిస్తూ.... ఈ సమావేశానికి విచ్చేసిన నాకు ప్రాణసమానమైన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు, జనసేన, బిజెపి కార్యకర్తలకు నా హృదయపూర్వక నమస్కారాలు. నేను అమెరికాలో నాలుగేళ్లు అండర్ గ్రాడ్యుయేషన్ చేశాను, రెండేళ్లు వాషింగ్టన్ డీసీలోని వరల్డ్ బ్యాంక్‌లో పనిచేశాను. మరో రెండేళ్లు స్టాన్‌ఫోర్డ్‌లో ఎంబీయే చేశాను. ఈ దేశంలో సుమారు తొమ్మిదేళ్లు ఉన్నాను. కానీ ఎప్పుడూ జరగని సంఘటన ఈ రోజు జరిగింది. నేను ఎయిర్ పోర్ట్ నుంచి బయటకు వస్తుండగా ఆరుగురు పోలీసులు వచ్చారు. వారు నన్ను ఇక్కడ ఆగండి అని చెప్పారు. బయట చాలా రద్దీగా ఉంది, మీరు బయటకు వెళ్లేందుకు పర్మిషన్ లేదు అని చెప్పారు. డల్లాస్‌లో అడుగుపెట్టిన దగ్గర నుంచి ఈ రోజు ఈ కార్యక్రమం వరకు నాకు ఇంతపెద్ద ఘనస్వాగతం పలికిన మీ అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఇక్కడ చాలామంది నాకు ప్రతిపక్షం రోజుల నుంచి పరిచయం ఉన్నవారు ఉన్నారు. వారిని చూసినప్పుడు ఆ రోజులు గుర్తుకువస్తున్నాయి. మిమ్మల్ని గుండెల్లో పెట్టుకుని కాపాడే బాధ్యత మీ లోకేష్ తీసుకుంటాడు. చంద్రబాబు గారిని 53 రోజులు పాటు అక్రమంగా బంధించినప్పుడు అమెరికాలోని ప్రవాసాంధ్రులు పెద్దఎత్తున బయటకు వచ్చి మాకు అండగా నిలిచారు. డల్లాస్‌లో ఏకంగా మూడు కార్యక్రమాలు నిర్వహించారు. మా కుటుంబానికి మీరు కొండంత బలం ఇచ్చారు. ఈ రాజకీయాలు మనకు అవసరమా ఆనాడు బ్రాహ్మణి అడిగారు. అమెరికాలో, హైదరాబాద్‌లోని స్టేడియంలో నిర్వహించిన గ్రాటిట్యూడ్ కార్యక్రమానికి సుమారు 45వేల మంది వచ్చి మాకు అండగా నిలబడ్డారు. ధైర్యం ఇచ్చారు. ఈ వేదికపై నిల్చొని మాట్లాడుతున్నానంటే మీరు అండగా నిలవడం వల్లే అన్నారు, దేశంలో అనేక రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్‌లు ఉన్నాయి. ఒక్క ఎపిలోనే డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. కేంద్రంలో ప్రధాని మోడీ గారి నాయకత్వం, ఎపిలో చంద్రబాబు గారి నాయకత్వం, మరో వైపు నాకు అన్నసమానమైన పవనన్న నాయకత్వంతో మనం ముందుకు వెళ్తున్నాం. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా నినాదం. అనంతపురం జిల్లాను ఆటోమోటివ్ హబ్‌గా చేశాం, కర్నూలులో పెద్దఎత్తున రెన్యూవబుల్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నాం, అనేక సిమెంట్ ఫ్యాక్టరీలు తీసుకువస్తున్నాం. చిత్తూరు, కడపకు ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్స్, నెల్లూరు జిల్లాకు డైవర్సిఫైడ్ మాన్యుఫ్యాక్చరింగ్, సోలార్ సెల్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలు తీసుకువచ్చాం. ప్రకాశంను సిబిజి హబ్‌గా తయారుచేస్తున్నాం. కృష్ణా, గుంటూరులో రాజధానితో పాటు క్వాంటమ్ కంప్యూటర్ తీసుకువస్తున్నాం. ఉభయ గోదావరి జిల్లాల్లో ఆక్వాను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాం. రిఫైనరీలు, అనేక మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలు తీసుకువస్తున్నాం. ఉత్తరాంధ్రకు వచ్చేసరికి ఐటీ, ఫార్మా, మెడికల్ డివైసెస్ మాన్యుఫ్యాక్చరింగ్ తో పాటు ఆర్సెల్లర్ మిత్తల్ స్టీల్ ప్లాంట్ ను కూటమి ప్రభుత్వం తీసుకువస్తోంది.20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. కూటమి ప్రభుత్వం ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని ఆ రోజే నిర్ణయించుకున్నా. మేం తిరగని దేశాలు లేవు. గత 17 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు, తద్వారా 16 లక్షల మందిగి ఉద్యోగాలు కల్పించేలా ఒప్పందాలు కుదుర్చుకున్నాం. అవన్నీ వచ్చే మూడు నెలల్లో గ్రౌండ్ చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది.

**ఈ మీటింగ్ చూసిన తర్వాత టీమ్ 11కి నిద్ర పట్టదు..**

ఈ మీటింగ్ చూసిన తర్వాత టీమ్ 11కి నిద్ర పట్టదు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి ఎన్టీఆర్ గారు. సంక్షేమాన్ని భారతదేశానికి పరిచయం చేసినవ్యక్తి అన్న ఎన్టీఆర్. గతంలోమనల్ని మదరాసీలు అనేవారు. మదరాసీలు కాదు.. తెలుగువాళ్లం ఉన్నామని దేశానికి చాటిచెప్పిన వ్యక్తి అన్న ఎన్టీఆర్. అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ సిబిఎన్ గారు. అభివృద్ధి చేసి ఎన్నికల్లో గెలవవచ్చని నిరూపించిన వ్యక్తి చంద్రబాబు గారు. ఐటీ చదువుకుంటే ఉద్యోగాలు వస్తాయని చంద్రబాబు గారు చెబితే.. కంప్యూటర్లు అన్నం పెడతాయా అని ఆనాటి ప్రతిపక్ష నేతలు ఎగతాళి చేశారు. ఇప్పుడు మిమ్మల్నందరినీ అడుగుతున్నా.. కంప్యూటర్ అన్నం పెడుతోందా అని. హైదరాబాద్‌కు పెద్దఎత్తున ఐటి కంపెనీలు తీసుకువస్తే విమర్శించారు. మీరొక్కసారి హైటెక్ సిటీకి వెళితే.. గుర్తుపట్టలేని పరిస్థితి.

**చంద్రబాబునాయుడు గారు దార్శనిక నాయకుడు..**

చంద్రబాబు ఐటీని పరిచయం చేసిన తర్వాత ఈ రోజు బెంగళూరుకు హైదరాబాద్ పోటీ ఇస్తోంది. చంద్రబాబు వయసు 75ఏళ్లు. 20 ఏళ్ల కుర్రాడిలా పరిగెడుతున్నారు. గతంలో ఐటీ, ఇప్పుడు క్వాంటం టెక్నాలజీ. ఆయన ముందు చూపు ఉన్న నాయకుడు. తెలుగుజాతికే అది ఒక అదృష్టం. దేశంలో ఏ పార్టీ ప్రకటించని విధంగ కార్యకర్తే మా అధినేత అని ప్రకటించిన పార్టీ తెలుగుదేశం పార్టీ. నాయకులు శాశ్వతంకాదు.. కార్యకర్తలే టిడిపికి బలం. అధికారంతో సంబంధం లేదు. అన్నగారిని చూసినా, ఆ పసుపు జెండా చూసినా మనకు ఎక్కడలేని ఎమోషన్. కూటమిలో విడాకులు ఉండవు, మిస్ ఫైర్‌లు ఉండవు, క్రాస్ ఫైర్‌లు ఉండవు.. ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. గుజరాత్, ఒడిశాలో ఒకే ప్రభుత్వం ఉండటం వల్ల అభివృద్ధి జరిగింది. ఎన్డీయే కూటమి రాబోయే పదేళ్లు రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తుంది. కలలకు రెక్కలు పేరుతో వచ్చే ఏడాది నుంచి విదేశాల్లో చదువుకునే వారికి అండగా నిలవాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ఎపి ఎన్ఆర్టీ మీకు అండగా నిలుబడుతోంది. విదేశాల్లో ఉన్న తెలుగువారికి ఏ కష్టం వచ్చినా ఎపి ఎన్ఆర్టీ మీకు అండగా ఉంటుంది.

**జాబ్ క్రియేటర్స్‌గా తయారు కావాలి..**

ఇక్కడ ఉన్న అందరూ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నారు. చదువుకుని మంచి ఉద్యోగాల కోసం ఇంత దూరంవచ్చాం. ఒక్కో కుటుంబానికి దేవుడు ఒక్కో పరీక్ష పెడతాడు. 2019లో నేను మంగళగిరిలో పోటీచేసి ఓడిపోయాను. కానీ అధైర్యపడలేదు. కసితో పనిచేసి 91వేల మెజార్టీతో విజయం సాధించాను. చిన్న ఎదురుదెబ్బ తగిలిందని బాధపడటం,ఆత్మహత్యలకు పాల్పడటం సరైన మార్గం కాదు. మన తల్లిదండ్రులు ఎంతో కష్టపడ్డారు. అద్భుతంగా పెంచారు. వారి గురించికూడా ఆలోచించాలి. అందుకే అండగా నిలబడతాం. కేవలం జాబ్ సీకర్స్‌గా మాత్రమేకాకుండా జాబ్‌క్రియేటర్స్‌గా మనంతయారుకావాల్సిన అవ సరంఉంది. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ కూడా మీకు అండగా నిలబడు తుంది. అందరం కలిసికట్టుగా పనిచేయాలి. ఒకరికొకరు అండగా నిలవాలి. అప్పుడే మనం అనుకున్నది సాధించగలుగుతాం. చట్టాన్ని ఉల్లంఘించిన ఎవరినీ వదిలిపెట్టేది లేదు. మేంఎలాంటి కక్షసాధింపులకు పాల్పడటంలేదు. నా తల్లిని అవమానించిన వారిని వదిలిపెట్టను. మీ తల్లిని అవమానించినా వదిలిపెట్టను. మా అమ్మ ఏనాడూ రాజకీయాల్లోకి రాలేదు. వారి నాన్న గారు ముఖ్యమంత్రి, భర్త ముఖ్యమంత్రి. కానీ ఒక్క పోస్టింగ్ కానీ, కాంట్రాక్ట్‌లో కానీ ఏనాడూ ఇన్ వాల్వ్ కాలేదు. అలాంటి తల్లిని శాసనసభ సాక్షిగా అవమానిస్తే వదిలిపెట్టే ప్రసక్తే ఉండదు. మీకుఎలాంటి డౌట్‌వద్దు. వారుఅవమానించారని మనం అవమానించ కూడదు. స్త్రీలను గౌరవించాలని మంత్రి నారా లోకేష్ అన్నారు.

## వారం - వర్జ్యం

08-12-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
చవితి సా.4.10
పుష్యమి రా.2.56, జ్యేష్ఠ కార్తె
వర్జ్యం : మ.3.25-5.02
దు.మ.12.33-1.08, 2) మ.3.27-3.22
శుభసమయం : ఉ.10.00-11.00,
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ప్రముఖుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. ఇవి ఆర్థికంగా లభించక పోయినా మానసిక తృప్తి నిస్తాయి.

**వృషభం:** దూరపు బంధువుల నుంచి అందిన సమాచారం కొంత ఊరట కలిగిస్తుంది. ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయి. ధనలాభం.

**మిథునం:** నిరాశ, నిస్పృహల మధ్యకాలం వెళ్ళదీస్తారు. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది.దూర ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**కర్కాటకం:** జీవిత భాగస్వామి సలహాలతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వాహనసౌఖ్యం.ఆర్థిక పరిస్థితి మెరుగవుతుంది.

**సింహం:** సన్నిహితులతో స్వల్ప అభిప్రాయ భేదాలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. జాగ్రత్త వహించండి. ఉద్యోగులకు బదిలీలు.

**కన్య:** తియ్యని మాటలతో మోసగించే వ్యక్తులు తారస పడతారు. అప్రత్తతతో ఉండండి. జీవిత భాగస్వామితో స్పర్ధలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోండి.

**తుల :** అనుకున్నదే తడువుగా పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. ధన లాభం.

**వృశ్చికం:** కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆరోగ్య విషయంలో మెలకువ అవసరం.గృహం కొనుగోలు యత్నాలు చేస్తారు.

**ధనుస్సు:** కుటుంబ సభ్యులతో కలసి ఉల్లాసంగా గడుపుతారు. ఆర్థిక పరిస్థితి కొంత ఇబ్బంది కలిగిస్తుంది. ప్రయాణాలు జాగ్రత్త.

**మకరం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం సంతోషం కలిగిస్తుంది. శుభ కార్యాలలో పాల్గొంటారు. ధనలాభం.

**కుంభం:** దైవబలం ఉంటే అసాధ్యం లేదని నమ్మి భగవంతునిపై భారం వేస్తారు. ఉద్యోగ యత్నాలు.వివాదాలకు దూదంగా వుండండి.

**మీనం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. క్రయ విక్రయాలలో లాభాలు. ఆర్థిక పరిస్థితి మెరుగవుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పై కేసు నమోదు

**వెంకటాచలం (నెల్లూరు), డిసెంబరు 7, ప్రభాతవార్త :** మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పై వెంకటాచలం పోలీస్ స్టేషన్లో కేసు నమోదుచేశారు. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని చవటపాలెం సహకార సంస్థ చైర్మన్ రాధాకృష్ణ నాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

# జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఘటనపై పోలీసు కేసునమోదు

### విద్యార్థుల రక్షణకు ప్రథమ ప్రాధాన్యతనిస్తాం: రిజిస్ట్రార్ ఆర్‌కె శుక్లా

**తిరుపతి,డిసెంబరు 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణకుమార్ విద్యార్థినిపట్ల ప్రవర్తించిన తీరుపై తిరుపతి వెస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రజినీకాంత్‌శుక్లా ఫిర్యాదు మేరకు వెస్ట్ పోలీసులు183/2025 కేసు నమోదైందని ఎస్పీ కార్యాలయం తెలిపింది. దీనిపై విచారణకు తిరుపతి డిఎస్పీ భక్తవత్సలంను దర్యాప్తు అధికారిగా, ఇద్దరు మహిళ ఎస్‌ఐలను సహాయ అధికారులుగా నియమించారు. తిరుపతి జిల్లా పోలీసులు ఈ కేసును పూర్తిస్థాయిలో విచారణచేసి దర్యాప్తు పూర్తయ్యాక సంబంధిత నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. యుజిసి నిబంధనలననుసరించి (ఐసిసి) ఫిర్యాదులపై అంతర్గత విచారణ కమిటీ నియమించబడిందని,ఈ కమిటీ అంతర్గత విచారణ చేపట్టి నివేదికను విశ్వవిద్యాలయంకు అందజేయనుంది. విశ్వవిద్యాలయం ఎప్పుడూ విద్యార్థుల రక్షణకు ప్రథమ ప్రాధాన్యతనిస్తుందని శుక్లాతెలిపారు. కాగా విద్యార్థిని పట్ల లైంగికవేధింపులకు పాల్పడిన అతనిని సస్పెన్షన్ చేసినట్లు, విద్యార్థి గర్భందాల్చిన మాట అవాస్తవమని రిజిస్ట్రార్ ప్రకటనలో తెలిపారు.

8-12Pg3exHMNWJQE 3_8-12Pg3exHMNWJQE.qxd 07/Dec/25 11:44 PM Page 1



# కోర్టు ధిక్కార కేసు..'సుప్రీం'ను ఆశ్రయించనున్న ఎయు మాజీ విసి

**విజయవాడ, డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** కోర్టు దిక్కార కేసులో సుప్రీం కోర్టుకు అప్పీల్‌కు వెళ్ళాలని ఆంధ్రా విశ్వవిద్యాలయం పూర్వ ఉపసంచాలకులు ప్రసాదరెడ్డి ఆశ్రయించనున్నారు. న్యాయవాదుల సమాచారాన్ని అనుసరించి ఆయన హైకోర్టు అప్పీల్‌కు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాదుల సహకారంతో ప్రయత్నిస్తున్నారు. కోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించినందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి (వీసీ) ప్రసాదరెడ్డిపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. కోర్టుధిక్కరణ కేసులో ఆయనకు నెలరోజుల సాధారణ జైలు శిక్ష, రూ.2,000 జరిమానా విధించింది. కోర్టు ఉత్తర్వులు అంటే ప్రసాదరెడ్డికి లెక్కలేదని, విచారణ సందర్భంగా సొంత తెలివితేటలు వాడుతూ, మొండి వైఖరి అవలంభించారని తీవ్రంగా ఆక్షేపించింది. కోర్టు ఆదేశాలను వరుసగా ఉల్లంఘించారని, ఇలాంటి వ్యవహార శైలి న్యాయ పరిపాలనకు తీవ్ర నష్టమని తెలిపింది. కోర్టు ఆదేశాలు అంటే ఆయనకు గౌరవం తక్కువ అని వెల్లడించింది. వీసీ బాధ్యతల నుంచి వైదొలిగేంత వరకు కోర్టు ఉత్తర్వులను అమలు చేయలేదని పేర్కొంది. కొత్త వీసీ వచ్చాక కోర్టు ఉత్తర్వులను అమలు చేశారని తెలిపింది. ఇలాంటి వ్యక్తిపై కనికరం చూపితే న్యాయవ్యవస్థకు నష్టమని వ్యాఖ్యానించింది. జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించాక ప్రసాదరెడ్డి తరఫు న్యాయవాది అప్పీల్ దాఖలు చేసుకునేందుకు వీలుగా తీర్పు అమలును సస్పెండ్ చేయాలని కోరారు. అందుకు న్యాయమూర్తి సానుకూలంగా స్పందిస్తూ 6 వారాలు సస్పెండ్ చేశారు. అప్పీల్ దాఖలు చేయకపోయినా, దాఖలు చేసిన అప్పీల్లో స్టే రాకపోయినా ఈనెల 22న సాయంత్రం 5 గంటలలోపు హైకోర్టు రిజిస్ట్రార్ వద్ద లొంగిపోవాలని ప్రసాదరెడ్డిని ఆదేశించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చారు. ఏయూ సైన్స్, టెక్నాలజీ కళాశాల బోటనీ విభాగంలో భోదనా సిబ్బందిగా నూకన్నదొర 2006 జులైలో నియమితులు అయ్యారు. ఆ తర్వాత అసిస్టెంట్ ప్రొఫెసర్ ఒప్పందం పద్ధతి పై కొనసాగారు. 17 ఏళ్ల పాటు సేవలు అందించారు. నూకన్నదొరను విధుల నుంచి తొలగిస్తూ ఏయూ వీసీ 2022 నవంబర్ 18న ఉత్తర్వులు ఇచ్చారు. 2022 మే నుంచి చెల్లించాల్సిన జీతం బకాయిలను నిలిపేశారు. తనను విధుల నుంచి తొలగించడాన్ని సవాలు చేస్తూ నూకన్నదొర 2023లో హైకోర్టులో పిటిషన్ వేశారు. 2023 మార్చి 7న విచారణ జరిపిన న్యాయమూర్తి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పిటిషనర్‌ను కొనసాగించాలని నిర్దిష్ట కాలానికి మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో అప్పటి వీసీ ప్రసాదరెడ్డిపై నూకన్నదొర హైకోర్టులో కోర్టుధిక్కరణ కేసు దాఖలు చేశారు. ఇటీవల ఇరువైపు వాదనలు విన్న న్యాయమూర్తి ఉద్దేశపూర్వకంగా ప్రసాదరెడ్డి కోర్టు ఉత్తర్వులను అమలు చేయలేదని తేల్చారు. జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ఈ ఏడాది నవంబర్ 20న తీర్పు ఇచ్చారు. తీర్పు ప్రతి తాజాగా అందుబాటులోకి వచ్చింది. ఒకసారి కోర్టు ఉత్తర్వులు ఇచ్చాక దానిని యథాతథంగా అమలు చేయడమే అధికారుల విధి అని న్యాయమూర్తి తీర్పులో స్పష్టం చేశారు. ఉత్తర్వులు చట్ట విరుద్ధంగా ఉన్నాయని భావిస్తే అప్పీల్ దాఖలు చేసుకోవచ్చని, అంతే తప్ప కోర్టు ఉత్తర్వులకు విభిన్న అర్థం చెప్పడానికి వీల్లేదన్నారు. కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు సరైనవా? కాదా? అనే విషయాన్ని కోర్టు ధిక్కరణ వ్యాజ్యంలో తేల్చలేరని, ఆ ఉత్తర్వులకు కట్టుబడి వ్యవహరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ఈ పరిణామాల నడుమ ప్రసాదరెడ్డి సుప్రీం కోర్టుకు అప్పీల్ దాఖలు చేస్తున్నారు.



## ఫార్మా, ఐటీకి హబ్‌గా ఏపీ
### రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**విజయవాడ,డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఫార్మా, ఐటీకి హబ్‌గా ఏపీ మారబోతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. దివంగత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి కార్యక్రమాల కోఆర్డినేషన్‌కు ఒక వార్ రూమ్‌ను ప్రారంభించామని పేర్కొన్నారు. ఆదివారం విజయవాడలో మాధవ్ పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ .వాజ్‌పేయి శతజయంతి కార్యక్రమాలకు మొదటి రోజున మధ్యప్రదేశ్ సీఎం మోహన్ సింగ్, శివరాజ్ సింగ్ చౌహాన్‌లను ఆహ్వానించామని తెలిపారు. వాజ్‌పేయి స్మృతివనం నిర్మిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని తెలిపారు. కూటమి పాలనకు వాజ్‌పేయి ఒక నిదర్శనంగా ఉంటారని చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధికి వాజ్‌పేయి ఆద్యుడని వ్యాఖ్యానించారు. వాజ్‌పేయి శతజయంతి సందర్భగా ఆయన విగ్రహాలను ఏపీ వ్యాప్తంగా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఏపీ పురోగతి చెందడానికి, దేశంలోనే ప్రథమ స్థానానికి రావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని వివరించారు. రాయలసీమను ఒక పవర్ హౌస్‌గా అభివృద్ధి చేయనున్నారని చెప్పుకొచ్చారు. టెలికాం అత్యంత చౌకగా ఉండటానికి కారణం వాజ్‌పేయి అని తెలిపారు. ఈ నెల 11వ తేదీన ధర్మవరంలో ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

## 13యేళ్లు దాటిన వాహనాల ఫిట్‌నెస్ ఫీజు తగ్గించకుంటే రవాణా బంద్

**విజయవాడ,డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం 13 ఏళ్ళు దాటిన వాహనాలకు టెస్టింగ్, ఫిట్‌నెస్ ఫీజులను పెంచుతూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది.ఈ నోటిఫికేషన్ నిలిపివేయాలని ఏపీ లారీ యాజమానుల సంఘం డిమాండ్ చేసింది. లేదంటే ఈ నెల9 తేది అర్ధరాత్రి నుంచి రైల్వే షెడ్లు, షిప్ యార్డుల్లో గూడ్స్ రవాణా నిలిపివేయాలని నిర్ణయించింది.13 ఏళ్ళు దాటిన వాహనాల ఫిట్‌నెస్ ఫీజు కేంద్రం భారీగానే పెంచిందని లారీ యాజమానుల సంఘం నాయకులు వెల్లడించారు. పాత వాహనాలపై టెస్టింగ్, ఫిట్‌నెస్ ఛార్జీలు ఇంత అధిక మొత్తంలో పెంచడం సరికాదన్నారు.ఈ నోటిఫికేషన్ నిలిపివేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. సీఎం వెంటనే ఈ విషయంలో తక్షణం ఒక నిర్ణయం రెండు రోజుల్లో తీసుకోవాలని, లేని పక్షంలో గూడ్స్ వాహనాలకు వీఎల్‌టీడీలు అవసరం లేదన్నారు.మాపై భారం పడకుండా కేంద్రం, రాష్ట్రం చూడాలన్నారు.ఈ విషయం సీఎం సానుకూల రీతిలో స్పందిస్తారని భావిస్తున్నట్లు లారీ యాజమాన్య సంఘం నాయకులు ఆశాభావం వ్యక్తం చేసారు.

# మూడు కోట్లతో భీమవరం, ఆచంటలో డయాలసిస్ సెంటర్లు

### నిర్మాణ పనులను ప్రారంభించిన కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ

### త్వరలో నాలుగు కోట్లతో మొబైల్ క్యాన్సర్ టెస్టింగ్ వ్యాన్ అందుబాటులోకి




డయాలసిస్ కేంద్ర శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

**పశ్చిమ గోదావరి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 7:** పశ్చిమ వాసుల కోరిక ఎట్టకేలకు నెరవేరింది. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చొరవతో భీమవరం, ఆచంటలలో అత్యాధునిక ప్రభుత్వ డయాలసిస్ విభాగాల నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భీమవరంలో ఏర్పాటు చేసిన సభలో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ జిల్లాలో భీమవరం విద్య, వైద్య రంగాల్లో ముందున్నప్పటికీ ప్రభుత్వ రంగంలో డయాలసిస్ సెంటర్ లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స చేయించుకోలేక పేషెంట్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సమస్య తన దృష్టికి వచ్చిందని, అందుకే అత్యవసర వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చి ఈ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సెంటర్ ఆరు నెలల్లో అందుబాటులోకి రానుందని, అత్యాధునిక డయాలసిస్ యంత్రాలతో కూడిన 10 బెడ్‌లను డయాలసిస్ రోగులకు ఉచిత చికిత్స కోసం అందుబాటులోకి వస్తాయని కేంద్రమంత్రి ప్రకటించారు.

అవసరాన్ని బట్టి అదనపు బెడ్‌లను కూడా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. నర్సాపురం పార్లమెంట్ పరిధిలోని డయాలసిస్ సేవలు మరింత అందుబాటులోకి తీసుకువచ్చేందుకు తాడేపల్లిగూడెం డయాలసిస్ సెంటర్‌లో అదనపు బెడ్ల కోసం 2 కోట్లు, ఆచంట డయాలసిస్ సెంటర్ కోసం 1 కోటి,అత్తిలిలో డయాలసిస్ మిషన్లకు 75 లక్షలు సి ఎస్ ఆర్ నిధులను సమకూర్చినట్లు శ్రీనివాస వర్మ తెలిపారు. త్వరలో 4 కోట్ల రూపాయల వ్యయంతో మొబైల్ క్యాన్సర్ టెస్టింగ్ వ్యాన్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా భీమవరం ఎమ్మెల్యే, పి.ఎ.సి. చైర్మన్ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ఈ సమస్య పరిష్కారానికి తాను కూడా పవన్ కళ్యాణ్ పేరు మీద సెంటర్ నిర్మిద్దామని భావిస్తున్న తరుణంలో, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ రెండు కోట్ల సి.ఎస్.ఆర్ నిధులతో అత్యాధునిక డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగరాణి, డి.సి.హెచ్.ఎస్. డాక్టర్ పి. సూర్యనారాయణ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మణ్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, బి.జె.పి. జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి అయినంపూడి శ్రీదేవి, బి.జె.పి. జిల్లా ప్రధాన కార్యదర్శి కలిదిండి వినోద్ వర్మ, జనసేన పార్టీ నాయకులు చంద్రశేఖర్, బండి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పరకామణి కేసు రాజీలో సూత్రధారులు టిటిడి పెద్దలేనా?

**తిరుపతి,డిసెంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు కానుకలు లెక్కించే పరకామణి నుండి విదేశీ కరెన్సీ చోరీ కేసు, తదనంతరం లోక్‌అదాలత్‌లో రాజీజరగడం వంటి కీలక పరిణామాల వెనుక గత టిటిడి పెద్దలు ఉన్నారనే బలమైన ఆరోపణలు ఇప్పుడు గుప్పుమంటున్నాయి. ఇందుకు శనివారం ముద్దాయి రవికుమార్ స్వయంగా ఈ కేసుపై నోరువిప్పి మహాపాపం చేశానని, పెద్దతప్పేనని వీడియో విడుదల చేయడం సంచలనంగా మారింది. ఇప్పటివరకు అన్ని కోణాల్లో అందరినీ విచారణ చేసిన సిఐడి పూర్తిస్థాయిలో దర్యాప్తు వివరాలను హైకోర్టు ధర్మాసనంకు సమర్పించింది. ఈ నివేదికల్లో ఎలాంటి వివరాలు ఇచ్చారనేది అందరిలోనూ ఆందోళనకరమైన అంశం. సిఐడి అధికారులు దర్యాప్తుచేపట్టిన 26రోజుల వరకు అటు రవికుమార్‌గానీ ఇటు కొందరు రాజకీయనేతలు వ్యాఖ్యలు చేయలేదు. కేసు చివరిదశకు చేరుకోవడంతో ఇప్పుడు ఏం జరగనుందనే ఆందోళనతో స్వయం వ్యాఖ్యలు ఎవరికీ నష్టం కలిగిస్తాయనేది మాత్రం చర్చమొదలైంది. పరకామణీలో చోరీ జరగడం తదనంతరం చోటుచేసుకున్న పూర్తి పరిణామాలపై మాజీ టిటిడి పెద్దలతోబాటు టిటిడి మాజీ ఉన్నతాధికారిని, కొందరు పోలీస్ అధికారులను విచారణ చేశారు.ఈ తతంగం మొత్తం గత పెద్దల ఆదేశాలతోనే జరిగిందనేది టిటిడి వర్గాల్లో వాదనలు. రవికుమార్‌కు సంబంధించిన ఆస్తులు ,వాటి అంచనాలు వంటి విషయాలను సిఐడి రాబట్టింది.72వేల రూపాయలు విలువైన దేవుని సొమ్మునుచోరీ చేస్తే 14కోట్ల రూపాయలు విలువైన ఆస్తులను నేరస్తుడి నుండి వేంకటేశ్వ రస్వామికివిరాళంగా స్వీకరించడం ఆషామాషీకాదనేది ఇప్పుడు చర్చకు దారితీసింది. మరీ ఈ కేసులో తదుపరి హైకోర్టు ధర్మాసనం ఆదేశాల మేరకు ఏంజరగనుందనేది ఉత్కంఠగా మారింది.

# అన్ని క్రీడలను ప్రోత్సహించే విధంగా కృషి

### విజయవాడ ఎంపీ, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని



**విజయవాడ,డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్)తో కలిసి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) తరఫున అన్ని క్రీడలను ప్రోత్సహించే విధంగా కృషి చేస్తామని విజయవాడ ఎంపీ, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివానాథ్(చిన్ని)స్పష్టం చేశారు. ఆదివారం విజయవాడలో యోనెక్స్ సన్ రైజ్ 87వ సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ లోగో, పోస్టర్‌ను ఎంపీ కేశినేని శివనాథ్‌తోపాటు శాప్ చైర్మన్ రవినాయుడు, ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్, ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ పి. అంకమ్మ చౌదరి ఆవిష్కరించారు.ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. యువతలో స్ఫూర్తి నింపేందుకు ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో ఇలాంటి నేషనల్ లెవల్ గేమ్స్ కాంపిటేషన్స్ మరెన్నో జరగాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రంలో నలుమూలల క్రీడా పోటీలు నిర్వహించేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని వివరించారు. ఏసీఏ తరఫున మంగళగిరి క్రికెట్ స్టేడియంతో పాటు, ఇంకొన్ని స్టేడియాల్లో అన్ని క్రీడలను ప్రోత్సహించే విధంగా బాడీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించటంలో సీఎం చంద్రబాబు ముందుంటారని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు తెలిపారు. బ్యాడ్మింటన్ అంటే తెలుగు వారు అనే గుర్తింపు రావటానికి కారణం సీఎం చంద్రబాబు నాయుడని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. విజయవాడలో డిసెంబర్ 22 నుంచి 28 వరకు యోనెక్స్ సన్ రైజ్ 87వ సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ జరుగుతుందని శాప్ చైర్మన్ రవినాయుడు వివరించారు.

# సంగీతం సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదం

### విజయవాడలో కృష్ణవేణి సంగీత నీరాజనం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ నజీర్



కృష్ణవేణి సంగీత నీరాజనం ముగింపు కార్యక్రమంలో గవర్నర్ నజీర్‌ను సత్కరిస్తున్న కేంద్ర పర్యాటక శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ వెంకట్రామన్ హెగ్డే

**విజయవాడ, డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** సంగీతం మనోవికాసానికి దోహదం చేస్తుందని ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. మానవీయ సంబంధాలను బలపరుస్తుందన్నారు. మన చుట్టూ ఉన్న ప్రపంచం పట్ల, ప్రకృతిలో మనతో పాటు ఇతర భాగస్వాములపై మక్కువ పెంచుతుంది.భారతీయ సంగీతం విశ్వవిఖ్యాతమన్నారు.కర్ణాటక,హిందుస్తానీ సంగీతాలు ప్రపంచం దృష్టినికి ఆకర్షించాయన్నారు.శ్రమజీవుల్లో నూతన ఉత్తేజాన్ని సంగీతం కలిగిస్తుందన్నారు. స్థానిక తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఆదివారం జరిగిన రెండురోజుల కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమ ముగింపు సభలో రాష్ట్ర గవర్నర్ గౌరవ సయ్యద్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భిన్న సంస్కృతులకు, అభిరుచులకు ప్రతీకగా నిలిచే సంగీత సమ్మేళనం విజయవాడలో జరగడం అభినందనీయ మన్నారు.కేంద్ర పర్యాటక శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ వెంకట్రామన్ హెగ్డే మాట్లా డుతూ రెండు రోజులపాటు నిర్వహించిన కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమంలో ఎంతోమంది ప్రముఖ కళాకారులు ఇచ్చిన ప్రదర్శనలకు ప్రజల నుంచి ఎంతో సహకారం లభించిందన్నారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు ఐదు ఈవెంట్‌లను నిర్వహించగా అందులో మైసూర్‌లో రెండు, విజయవాడలో జరుగుతున్న ఈ కార్యక్రమం మూడవది అన్నారు. కేంద్ర పర్యాటక, సాంస్కృ తిక మంత్రిత్వశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సంగీత నాటక అకాడమీ, స్థానిక సంస్థల సహ కారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. గత సంవత్సరంలో సుమారు ఒక కోటిమంది విదేశీయులు భారతదేశాన్ని సందర్శిం చటం వల్ల 2.93లక్షల కోట్ల ఆదాయం వచ్చిం దన్నారు. కృష్ణవేణి సంగీత నిరంజనం కార్యక్ర మానికి కేరళ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుండి కళాకారులు వచ్చి ప్రదర్శనలు ఇచ్చారన్నారు.కేంద్ర పర్యాటక శాఖ సంచాలకులు (సౌత్) ఆర్. వెంకటేశన్ మాట్లాడుతూ కృష్ణవేణి సంగీత నిరంజనం యొక్క మూడవ ఎడిషన్ ముగింపు కార్యక్ర మానికి స్వాగతం పలకడం ఆనందంగా ఉందన్నారు. భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడడంలో టూరిజం శాఖ నిబద్ధతను ప్రతిబింబించడమే కాక, మన సాంప్రదాయ సంస్కృతి విలువను గుర్తించడానికి కళాకారులు, సంస్థలు మరియు యువతను కూడా ప్రోత్సహిస్తుందన్నారు.జాతీయ సాంస్కృతిక మైలురాయిగా దీని గుర్తింపును బలోపేతంచేసింది. పవిత్రమైన కృష్ణా నది, కనకదుర్గాదేవి దివ్య ఉనికితో ఆశీర్వదించబడిన విజయవాడ నగరం కేవలం ఈ ఉత్సవానికి ఆతిథ్యం ఇవ్వ డమే కాదు, ఇది ఈ నగరానికి గుండె చప్పుడు అని అన్నారు. ఈ నగర చరిత్ర, ఆధ్యాత్మికత, శక్తి, కళాత్మక వారసత్వం ఇలాంటి ఉత్సవాల వేడుకకు పరిపూర్ణ కేంద్రంగా మార్చాయన్నారు. సంగీతం,నృత్యం, కథాకథనం,హస్తకళలు ఇవన్నీ సంస్కృతి యొక్క జీవన స్వరాలన్నారు.ప్రపంచవ్యాప్తంగా, సంగీత ఉత్సవాలు గమ్యస్థాన బ్రాం డింగ్, పర్యాటక అభివృద్ధిలో ఒక పరివర్తనాత్మక పాత్ర పోషిస్తాయని, జీవనోపాధిని సృష్టించి, సాంస్కృతికజ్ఞాపకశక్తిని రూపొందిస్తా యన్నారు.

జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ ఇల క్కియ మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాలు విజయవాడలో ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతం పర్యాట కంగా ఎంతో అభివృద్ధిని సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గవర్నర్ గౌరవ సయ్యద్ అబ్దుల్ నజీర్ రావడం దీనికి మరింత గుర్తింపును ఇస్తుందన్నారు.

# తిరుమల సమాచారం

## ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



**తిరుమల,డిసెంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** గోవింద నామస్మరణలతో ఆపదమొక్కులవాడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు వడ్డిస్తున్న ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాతలు విరాళాలిస్తున్నారు. ఆదివారం ఉదయం ఎన్ఆర్ఐ భక్తుడు శివప్రసాద్ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు10,01,116 రూపాయలు విరాళాల డిడిని ఆలయ పేష్కార్ రామకృష్ణకు అందజేశారు. దాతతోబాటు ఆర్టీసి ఎండి ద్వారకాతిరుమలరావు, టిటిడి బోర్డు సభ్యుడు సదాశివరావు పాల్గొన్నారు.

## అన్నమయ్య కాలిబాటను పునరుద్ధరించాలి: మాజీమంత్రి పేర్నినాని



**తిరుమల,డిసెంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** ప్రాచీన కాలం నుండి పదకవితాపితామహుడు తాళ్ళపాక అన్నమయ్యనడచి తిరుమలకు వచ్చిన అన్నమయ్య మార్గాన్ని మూసివేయడం మంచిదికాదని, భక్తుల మనోభావాలతో ముడిపడిన విషయమని మాజీమంత్రి ,వైసిపి నేత పేర్నినాని అన్నారు. ఎందరో మహానుభావులు నడచివచ్చిన మార్గంలో ఇప్పటికీ భక్తులు భక్తితో, పవిత్రంగా కాలినడకన తిరుమలకు వస్తున్నారన్నారు. కోడూరు, కుక్కలదొడ్డి నుండి వుండే ఈ అటవీప్రాంతంలోని అన్నమయ్య కాలిబాటను టిటిడి అధికారులు అభివృద్ధిచేసి,భక్తులకుఅసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఆదివారం ఉదయం తిరుమలకు వచ్చిన పేర్నినాని కుటుంబసభ్యులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వేంకటేశ్వరస్వామి దర్శనంతో అనుభూతి



**తిరుమల,డిసెంబరు 7ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుంటే మనసు ఆనందంగా ఉందని, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని ప్రముఖులు ఆకాంక్షించారు. తెలంగాణ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఏపి ఎంఎల్‌సి ఆలపాటి రాజేంద్రప్రసాద్ వేర్వేరుగా ఆదివారం ఉదయం శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్ర సాదాలు అందజేశారు. అన్నారు. తిరుమలలో భక్తులకు దర్శన ఏర్పాట్లు బావున్నాయని, భక్తులు సంతోషంగా స్వామివారిని దర్శనం చేసుకోగలుగుతున్నారన్నారు.

## శ్రీవారి ఆశీస్సులతో అంతా శుభాలు



**తిరుమల,డిసెంబరు 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగుప్రజలు సంతోషంగా ఉండాలని దేవుని ప్రార్థించినట్లు రాష్ట్రహైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేశ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం కుటుంబంతో కలసి తిరుమలకు చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికా రులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకున్నాం



**తిరుమల,డిసెంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వర స్వామిని ఆదివారం ఉదయం ఆర్టీసి ఎండి సిహెచ్ ద్వారకాతిరుమలరావు దంపతులు దర్శించుకున్నారు. శ్రీవారిని దర్శిం చుకోవడం సంతోషమని తెలిపారు. ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకుని దేవదేవుని ఆశీస్సులందుకున్నారు. శ్రీవారి ఆశీ స్సులతో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షిం చారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శ నం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 'గోవిందకోటి'పై మరింత విస్తృత ప్రచారం

### కోటినామాలు రాస్తే విఐపి బ్రేక్ దర్శనం



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** హిందూ ధర్మాన్ని చిన్నతనంనుండే యువతలో అవగాహన కల్పించడంతోబాటు భక్తిభావం పెంపొందించే దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. రామకోటి తరహాలో 25ఏళ్ళలోపు యువత "గోవిందకోటి"రాస్తే ఆ భక్తుడితోబాటు ,వారి కుటుంబసభ్యులు ఐదుగురికి విఐపి బ్రేక్ దర్శనం కల్పించే దిశగా కార్యాచరణ రూపొందించారు. ఇప్పటికే ఈ విధానం 2023 సెప్టెంబర్‌లో అప్పటి టిటిడి బోర్డు కూడా మంచినిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని అమలుచేస్తూ అప్పట్లోనే టిటిడి ప్రత్యేక పుస్తకాలు ముద్రించి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆ తరువాత 2024 మేలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, టిటిడి నూతన ట్రస్టుబోర్డు ఏర్పాటుతో కొద్దిరోజులు ఈ విషయంపై తర్జనభర్జనలు పడ్డారు. చివరకు హిందూ సనాతన ధర్మవ్యాప్తికి ఎంతో ఉపయుక్తంగా ఉన్న "గోవిందకోటి" రాయడం వల్ల యువతలో భక్తిభావం పెంపొందింపజేసేందుకు అవకాశం కల్పించేలా ఉంటుందని భావించారు. 25ఏళ్ళ లోపు యువత "గోవిందకోటి"రాస్తే వారి కుటుంబస భ్యు లకు విఐపి బ్రేక్ దర్శనం కల్పించనున్నారు. 10,01,116 సార్లు గోవిందనామాలు రాసిన భక్తు లకుస్వామివారి దర్శనం కల్పించేలా చూస్తున్నారు.





## ఘాట్‌లో హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణించండి

### టిటిడికి ట్రాఫిక్ పోలీసుల విజ్ఞప్తి

**తిరుమల,డిసెంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల ఘాట్‌లో ద్విచక్రవాహనదారులైన టిటిడి ఉద్యోగులు హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని తిరుమల ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్ కోరారు. ఈ మేరకు తిరుమల ఆలయ డిప్యూటీ ఇఒలోకనాథం, అన్నదానం డిప్యూటీ ఇఒ రాజేంద్ర ఇతరులను కలసి ఆయన విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులందరూ విధిగా హెల్మెట్ ధరించాలని, మీ సూచనలు అవసరమనికోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ ఇఒలు ఉద్యోగులు, సిబ్బందికి సూచనలు చేస్తామని తెలిపారు.

## లైంగిక వేధింపు కేసులో జోక్యం చేసుకోండి

### కేంద్ర ప్రభుత్వానికి వైఎస్సార్సీ ఎంపీ గురుమూర్తి లేఖ

**విజయవాడ,డిసెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో బీఈడీ విద్యార్థినిపై అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణ్‌కుమార్ దారుణ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని తిరుపతి ఎంపీ ఎం. గురుమూర్తి ఆరోపించారు. ఇంకా బ్లాక్ మెయిల్ కూడా చేస్తున్నారని, అదే విషయాన్ని ఆమె లిఖిత పూర్వకంగా కూడా ఫిర్యాదు చేసిందని వెల్లడించారు.

అత్యంత దారుణమైన ఈ కేసులో వెంటనే జోక్యం చేసుకుని తగిన చర్య తీసుకోవాలని కోరుతూ ఆయన, కేంద్ర విద్యా శాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పాటు, జాతీయ మహిళా కమిషన్, జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్, జాతీయ మానవ హక్కుల సంఘానికి లేఖలు రాశారు.

వార్త

మీరు నిజాయితీగా ఉండండి. ఈ ప్రపంచంలోని జనాభా నుంచి ఒక దుర్మార్గుడి సంఖ్య తగ్గిందన్న భావన మీకు కలుగుతుంది.

-థామస్ కార్లయిల్

# పొగాకుకు కళ్లెం

సామాజిక రుగ్మతలను రూపుమాపడానికైనా, భయంకరమైన అనారోగ్యకర అలవాట్లను అదుపులో పెట్టేందుకైనా పన్నులు భారమో, జరిమానాల విధింపులతోనో కళ్లెం వేయడం సాధ్యమౌతుందని నమ్ముతుంటాం. ఎటూ కక్కలేక మింగలేక అలవాట్లకు దూరంగా ఉంటారని భావిస్తుంటాము. నిన్న మొన్నటి వరకు ఒక పక్క పొగాకు త్రాగడం ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదంటూనే, పొగాకును విరివిగా పండించే ప్రాంతాల్లోని రైతుల ఉత్పత్తుల రవాణాకు అన్ని సౌకర్యాలను సమకూర్చిపెట్టడం ప్రభుత్వాలకు ఆనవాయితీగా మారింది. పొగాకు ఉత్పత్తుల వినియోగంతో దేశంలో కేన్సర్, గుండె, ఊపిరితిత్తుల రోగాల కారణంగా ఏటా 1.35 మిలియన్ మంది మృత్యువాత పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పొగాకు పండించే రైతులను ప్రత్యేకించి నిరుత్సాహపరచకుండా, అలాఅని ప్రత్యేక ప్రోత్సాహకాలు లేకుండా రైతులు వారంతటవారే ఇతర పంటలకు మారేపరిస్థితి తీసుకురావాలన్నది ప్రభుత్వఆలోచన. ఇలా పొగాకు సాగులో ప్రభుత్వాలు ఎటూ పాలుపోని పరిస్థితులలో సతమతమౌతుంటాయి. ఆ నేపథ్యమే 2018 నుంచి 2022 మధ్య 112లక్షల ఎకరాలకుపైగాభూమిలో పొగాకు సాగు నుండి రైతులు ఇతర పంటలకు మారేలా చేసింది. అందులో భాగంగానే కర్ర విరగకుండా, పాము చావకుండా అన్న ధోరణిలో ప్రభుత్వం పన్ను విధానాల రూపకల్పన చేస్తూ వస్తోంది. కారణాలు ఏవైనా ప్రభుత్వ సంకల్పం మేరకు ప్రజల అనారోగ్యానికి హేతువయ్యే పొగాకు ఉత్పత్తులు పెరగకుండా చూడగలుగుతోంది. దేశంలో పొగాకుపై 60 లక్షల మంది రైతులు రెండు కోట్ల మంది కూలీలు ఆధారపడుతుంటారు. కానీ తాజాగా కేంద్రప్రభుత్వం పొగాకు సంబంధిత ఉత్పత్తులపై అధిక ఎక్సైజ్ సుంకం విధిస్తూ సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు 2020-25ను మూజువాణి ఓటుతో లోక్‌సభలో ఆమోదించింది. సిగరెట్లు, చుట్టలు, హుక్కా, జర్దా నమిలే పొగాకుపై ప్రస్తుతమున్న జిఎస్టీ 28 శాతంతో పాటు పలు విధాలైన సెస్సు ఉంది. ముడి పొగాకుపై 60-70 శాతం ఎక్సైజ్ డ్యూటీ విధించేందుకు రంగం సిద్ధమైంది. ఈ సెస్సు సిగరెట్లు, చుట్టలపై 25 శాతం వరకు ఉంటుంది. కాదంటే ప్రతి వెయ్యి చుట్టలకు రూ. 5వేలు చొప్పున డ్యూటీ చెల్లించాలి. ఫిల్టర్ సిగరెట్లకు ప్రతి వెయ్యికి రూ.2700 నుంచి 11వేల వరకు సుంకం విధించమన్నారు. నమిలే పొగాకుకు మాత్రం కిలోకి 100 రూపాయలుగా నిర్ణయించారు. పరిహార సెస్సుకు ఈ పెంచిన సుంకాలకూ ముడిపెట్టారు. పరిహార సెస్సు పూర్తయ్యాకనే కొత్త సెస్సు మొదలవుతుంది. కోవిడ్ సమయంలో తగ్గిపోయిన ఆదాయ భర్తీకి రాష్ట్రాలు తీసుకున్న రుణాలు తీరిపోయాక పరిహార సెస్సుకు బదులుగా కొత్త విధానంలో సెస్సు వసూలు తప్పదు. తమకు వచ్చే ఆదాయంలో 41 శాతాన్ని రాష్ట్రాలతో పంచుకుంటామని లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇచ్చిన వివరణ ఇది. గరిష్టంగా 40 శాతం చొప్పున జిఎస్టీ విధానం కొనసాగుతుంది. పొగాకు మీద హెచ్చుపన్నుల ద్వారా పొగాకు వాడకం తగ్గించగలిగితే ఒక విధంగా మంచిదే. పరిహార సెస్సు కాలపరిమితి పూర్తయినందున కొత్త సెస్సులు వడ్డించారా? లేదా పొగాకు ఉత్పత్తుల వినియోగం తగ్గించడం ద్వారా జనానికి ఆరోగ్యకర అలవాట్లు వస్తాయని పొగ తాగకుండా చూడాలన్న దృక్పథంతోనే మరో రూపంలో ఈ సెస్సును భర్తీ చేశారన్నది సుస్పష్టం. ఏదిఏమైనా పొగాకు విరివిగా పండించే ప్రాంతాల్లోని లోక్‌సభ సభ్యులు పన్నుల్లో మార్పులు చేసేటప్పుడు రైతుల ప్రయోజనాలనూ దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. అదే సమయంలో ప్రజారోగ్యం కోసం తీసుకునే నిర్ణయాలను రైతులు సుముఖత వ్యక్తం చేశారని భరోసా ఇవ్వడం విశేషం. పొగాకు సాగును పూర్తిగా రద్దు చేయలేని పరిస్థితుల్లో తగ్గించడానికే ప్రభుత్వాలు కృషి చేస్తుంటాయి. తాజాగా వేసిన సుంకంకూడా ఆ కోవలోకే వస్తుంది. దాంతో ఇక ఆ పన్ను వసూలు చేయాల్సిన ఆవశ్యకత కేంద్రానికి లేకపోయింది. అలా అని ఆ పన్ను వసూలు ఆపేస్తే పొగాకు ఉత్పత్తుల ధరలు బాగా తగ్గిపోతాయి. ఇలాంటి పరిస్థితులు సదరు పన్ను తగ్గితే పొగాకు ఉత్పత్తుల అధిక వినియోగానికి దారి తీస్తుంది. ఒకపక్క పొగాకు ఉత్పత్తుల వినియోగం ఆరోగ్యానికి హానికరం అంటూనే ఆ ఉత్పత్తులకు ధర తగ్గే పరిస్థితి కల్పిస్తే వినియోగదారుల సంఖ్య పెరిగిపోతుంది. ఈ నేపథ్యంలోనే తగ్గిన సుంకాన్ని మరో రూపంలో పెంచేందుకు కేంద్రం ఉపక్రమించింది. ఇది సెస్సు కాదని, కేవలం ఎక్సైజ్ సుంకమేనని అది కూడా పొగాకు ఉత్పత్తుల ధరల పెంపు వలన వినియోగం ఎప్పటిలానే ఉంటుందని ఆర్థిక మంత్రి అభిప్రాయం. అందుకే ఈ ప్రతిపాదన జరిగింది. ఒకపక్క పొగాకు రైతుకు ప్రోత్సాహం మరోపక్క వినియోగదారుని ఆరోగ్యరక్షణ వీటి విషయంలో సమతుల్యత పాటించడానికే ఈ పన్ను విధానం నిర్ణయింపబడింది. కొత్తగా వేసిన పన్ను బీడీల ధరను పెంచుతుంది. దానివలన వినియోగం తగ్గి పరోక్షంగా దేశంలోని లక్షలాది మంది బీడీ కార్మికులు ఉపాధి కోల్పోతారని ఎంపీలు ఆవేదన వెలిబుచ్చారు. జాతీయ వ్యవసాయ అభివృద్ధి పథకం కింద పంట వైవిధ్యీకరణ కార్యక్రమం కింద 2015 నుండి దేశంలోని పది రాష్ట్రాలు పొగాకు పండించి ఉత్పత్తి చేస్తున్నాయి. పాన్ మసాలా తయారీ యూనిట్లపై కూడా సెస్ విధించారు. ఈ విధంగా వసూలు అయ్యే మొత్తం జాతీయ భద్రత కోసమే వినియోగించేందుకు నిర్ణయం.

సమకాలికులు ఎప్పుడూ వ్యక్తి ప్రతిభ కన్నా, వ్యక్తినే ఎక్కువగా పొగుడుతారు. ఆ తర్వాత తరంవారే ప్రతిభను గౌరవిస్తారు.



సిసి కోల్టన్

ఇతరులకు సంతోషాన్ని కలిగించకుండా సంతోషాన్ని పొందే అధికారం, ధనాన్ని ఉత్పత్తి చేయకుండా ధనాన్ని వాడుకునే అధికారం మనకు లేవు.



జార్జిబెర్నార్డ్ షా

# ప్రజావాక్కు



### పదో తరగతి పరీక్షలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పదవ తరగతి పరీక్షలు మార్చి 16నుండి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు విద్యాశాఖ ఉన్నతాధికారులు జారీ చేశారు. ఆ ప్రాప్తి మేరకు ఆదివారాలు, ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా పదో తరగతి విద్యార్థులకు, ప్రణాళిక బద్ధంగా పాఠాలు చెప్పడంపరీక్షలు నిర్వహించడం జరపనున్నారు. పాఠశాల పని దినాల్లో పదవ తరగతి టైం టేబుల్ ఈ 100 రోజులు ప్రణాళికల్లో కంప్లీట్‌గా మార్చేశారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు గంటా 50 నిమిషాలు ఒక సబ్జెక్టు చొప్పున నాలుగు సబ్జెక్టులు ఒక రోజులో జరుగుతాయి. మిగతా మూడు సబ్జెక్టులు ఆ రోజులో ఉండవు. అన్ని సబ్జెక్టులు ప్రతిరోజు ప్రతి విద్యార్థి చదవడం జరగడం లేదు. మిగతా తరగతులు అయిన 6 నుండి 9వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు టైం టేబుల్ అస్తవ్యస్తం అవుతుంది.

- వీరగంట భాస్కర్ రావు, విజయవాడ

### మరీ ఇంత దిగజారిపోవాలా!

రోడ్డు మీదపోతున్న వ్యక్తి ఒకడు ఆహారం కోసం చెత్తకుప్పదగ్గరకు వెళ్తున్న కుక్కను చూసి జాలిపడతాడు దాని ముందు ఓ రొట్టె ముక్కను పడేస్తాడు. మరుక్షణం ఎక్కడి నుంచో మూడు నాలుగు కుక్కలు పరిగెత్తుకువసాయి. ఆ రొట్టే ముక్క కోసం ఎగబడతాయి. దాని కోసం నోటి వాటి మధ్యకొట్లాట మొదలవుతుంది. చివరకి వాటిలో ఉన్న ఒక బలమైన కుక్క ఆ రొట్టె ముక్కను నోట కరుచుకుని పోతుంది. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలసందర్భంలో మూడుపార్టీల వారుఇలానే ప్రవర్తించారు. ఉన్న ఒక్క సీటుకోసం విశ్వప్రయత్నం చేశారు.

- రాశి, హైదరాబాద్

### ఓటు చాలా విలువైనది

బిఆర్ఎస్ కారు రెండు సంవత్సరాల నుంచి బయటకి రాక మూలనపడి ఉంది. దాని భాగాలన్నీ తుప్పుపట్టిపోయాయి. ఆ కారు ఇప్పట్లో ఇక ముందుకు కదలదు. అలాంటి కారుకి ఓటు వేస్తే అభివృద్ధి ముందుకి కదలదు. వేసిన ఓటు వేస్ట్ అయిపోతుంది. కనుక ఓటు వేసేటప్పుడు ఆలోచించి వేయాలి.

-మిథునం, హైదరాబాద్

### క్వాంటి టెక్ ప్రపంచానికి నూతన ద్వారం

హైదరాబాద్‌ను క్వాంటమ్ సిటీగా అభివృద్ధి చేసి ప్రపంచ నాయకత్వం వైపు నడిపించాలన్న ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క సంకల్పంతెలంగాణ టెక్నాలజీ రంగానికి కొత్త ఊపును తెస్తోంది. ప్రపంచం క్వాంటమ్ కంప్యూటింగ్, అగ్రశ్రేణి సైబర్ సెక్యూరిటీ, డేటా ప్రాసెసింగ్ వంటి అధునాతన రంగాల్లో విప్లవాత్మక మార్పులను చూస్తున్న ఈ సమయంలో, హైదరాబాదును ఆ దిశగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ దృష్టి ఎంతో దూరదృష్టి కలిగిన నిర్ణయం. ఇప్పటికే హైటెక్ సిటీ, బయోటెక్ పార్కులు, స్టార్టప్ కేంద్రాలతో అంతర్జాతీయ గుర్తింపు పొందిన హైదరాబాద్, అత్యాధునిక పరిశోధనలకు అనువైన మౌలిక వసతులు, నైపుణ్యంకలిగిన మానవ వనరులు కలిగిన నగరం. ఈ నేపథ్యంలో క్వాంటమ్ టెక్నాలజీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక పరిశోధనా కేంద్రాలు, ప్రపంచ ప్రఖ్యాత సంస్థలతో భాగస్వామ్యాలు, పరిశ్రమ-విద్యా సంస్థల మధ్య అనుసంధానాన్ని పెంపొందించడం కీలకం.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### రాష్ట్ర గీతంగా ఆమోదించాలి

తెలంగాణా రాష్ట్రం అందెశ్రీ అందించిన గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రభుత్వం ఆమోదించి అమలు పరచింది. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా ఒక గీతాన్ని ఓ మంచి కవి చేత రాయించాలి లేదా దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు అనేక దేశభక్తి గీతాలు రాసారు. అందులో ఒక దానిని రాష్ట్రానికి అనుకూలంగా ఉండేలా చిన్న చిన్న మార్పులు చేర్పులు చేసి గీతాన్ని శ్రీ చాగంటి కోటేశ్వర రావుగారికి గాని లేక గరికిపాటి వారికి గాని చూపించి అవుననిపిస్తే బాగుంటుంది. రాష్ట్రప్రభుత్వంఆలోచన చేయాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### వృద్ధ నేతలు తప్పుకోవాలి

అపారమైన తెలివితేటలు, శక్తిసామర్థ్యాలు గల యువత మన దేశంలో ఎంతో మంది ఉన్నారని వీరంతా రాజకీయాల్లోకి వచ్చి చురుకైన పాత్రపోషించాలని అత్యున్నత పదవులను అధిష్ఠించాలని మాటల్లోను ఉపన్యాసాల్లోను సెలవిస్తున్నారే కానీ చేతలు ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంటున్నాయి. ఎవరి వయసుకి తగిన పనులు వారు చేస్తేనే బాగుంటుంది. యువతకు కూడాఅవకాశం కల్పించేలా వృద్ధనేతలు ఆలోచించాలి. యువతను ప్రోత్సహించేలా ఉపన్యాసాలు ఇవ్వాలి.

-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# వ్యవస్థపై అవగాహన తప్పనిసరి!

గ్రామ ప్రథమ పౌరుడి విధులలో, గ్రామంలో సుపరిపాలన అందించడం, త్రాగునీటి, పారిశుధ్యం, రోడ్లు, విద్యుదీకరణ వంటి కనీస అవసర సేవలనిర్వహణ, గ్రామసభకు అధ్యక్షత వహించి సభలను విజయవంతం చేయడం, గ్రామసభలో తీసుకున్న నిర్ణయాలను అమలు పర్చడం, పన్నుల సేకరణ, నూతన ఆదాయవనరులను సృష్టించడం, గ్రామ అభివృద్ధి పనుల నిర్వహణ, గ్రామీణ పేదరిక నిర్మూలన, ఉద్యోగ అవకాశాల కల్పన, గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించడం, కేంద్ర, రాష్ట్ర నిధులను గ్రామానికి పన్నులు ఇతరత్రా ఆదాయాన్ని దుర్వినియోగం చేయకుండా గ్రామ అభివృద్ధికి ఉపయోగించడం, ప్రజల సంక్షేమానికి తీసుకోవాల్సిన నిర్ణయాలు, ప్రజల మధ్య స్నేహభావాన్ని పెంపొందించి గ్రామంలో శాంతియుత వాతావరణ నెలకొల్పడం, గ్రామీణ వనరులను, నిధులను సమర్థవంతంగా వాడుకొని గ్రామ అభివృద్ధికి తోడ్పడం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడం, గ్రామ రికార్డులను, లెక్కలను నిర్వహించడం. గ్రామంలో విద్య, వైద్య సదుపాయాలను పర్యవేక్షించడం, పథకాల అమలులో, అభివృద్ధిలో విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులతో సమన్వయంగా ఉండి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడపాలి.

బైరబోయిన వెంకటేశ్వర్లు

తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాల్లో పంచాయితీ ఎన్నికల సమరం ఊపందుకుంది. ఐనవారి మధ్య జరిగే ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. ఇటీవల పంచాయితీ ఎన్నికల్లో లక్షలు వెచ్చించి వేలం వేసి ఏకగ్రీవం అవడం, అమెరికా నుండి వచ్చి సర్పంచ్ పదవికి నామినేషన్ వేయడం, ఒకే పంచాయితీలో తల్లి బిడ్డలు, అన్న చెల్లలు, అత్త, కోడళ్లు పోటీ పడడం, పదవీకాలంలో ఎక్కువ ఆస్తులు సంపాదించినట్లైతే అవి పంచాయితీకే అని బాండ్ పేపర్ రాయడం, ఉన్నత ఉద్యోగాలకు రాజీనామా చేసి పంచాయితీ పోటీల్లో పాల్గొనడం వంటి సంఘటనలు చూస్తున్నాం. పదవిమీద వ్యామోహమో, రాజకీయ రంగంలో తొలిఅడుగులు వేయాలనే ఆసక్తేమో కానీ పంచాయితీ ఎన్నికల పరంపర రసవత్తరంగా సాగుతుంది. కానీ అభ్యర్థులు పోటీపడడమే కాకుండా పంచాయితీరాజ్ వ్యవస్థపై, విధులు, నిధులపై సమగ్ర అవగాహన ఉంటేనే గెలిచాక పాలన సుగమం అవుతుందనేది గమనించాలి. అలాగే అభ్యర్థులు తమ ప్రచారంలో భాగంగా ప్రజలకు కూడా పంచాయితీరాజ్ వ్యవస్థపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గ్రామ ప్రథమ పౌరుడి విధులలో, గ్రామంలో సూపరిపాలన అందించడం, త్రాగునీటి, పారిశుధ్యం, రోడ్లు, విద్యుదీకరణ వంటి కనీస అవసర సేవలనిర్వహణ, గ్రామసభకు అధ్యక్షత వహించి సభలను విజయవంతం చేయడం, గ్రామసభలో తీసుకున్న నిర్ణయాలను అమలు పర్చడం, పన్నుల సేకరణ, నూతన ఆదాయవనరులను సృష్టించడం, గ్రామ అభివృద్ధి పనుల నిర్వహణ, గ్రామీణ పేదరిక నిర్మూలన, ఉద్యోగ అవకాశాల కల్పన, గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించడం, కేంద్ర, రాష్ట్ర నిధులను గ్రామానికి పన్నులు ఇతరత్రా ఆదాయాన్ని దుర్వినియోగం చేయకుండా గ్రామ అభివృద్ధికి ఉపయోగించడం, ప్రజల సంక్షేమానికి తీసుకోవాల్సిన నిర్ణయాలు, ప్రజల మధ్య స్నేహభావాన్ని పెంపొందించి గ్రామంలో శాంతియుత వాతావరణ నెలకొల్పడం, గ్రామీణ వనరులను, నిధులను సమర్థవంతంగా వాడుకొని గ్రామ అభివృద్ధికి తోడ్పడం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడం, గ్రామ రికార్డులను, లెక్కలను నిర్వహించడం. గ్రామంలో విద్య, వైద్య సదుపాయాలను పర్యవేక్షించడం, పథకాల అమలులో, అభివృద్ధిలో విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులతో సమన్వయంగా ఉండి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడపాలి. కేంద్రం గ్రామ పంచాయతీలకు పథకాల ద్వారా జమ అయిన ఖర్చులలో పారదర్శక ప్రదర్శించడానికి ప్రవేశపెట్టిన ఇ గ్రామ్ స్వరాజ్ పోర్టల్, మేరి పంచ యాత్ యాప్‌లపై ప్రజల్లో గ్రామ పంచాయితీ నిధుల విషయానికొస్తే గ్రామపంచాయితీలకు నిధులు ప్రధానంగా గ్రామ పంచాయితీ పన్నుల, ఇతర భవనాలు, మార్కెట్ యార్డు, సంతలు అద్దెకు ఇవ్వడం ద్వారా వచ్చే స్వీయ ఆదాయం. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులనుండి వస్తాయి. 15వ ఆర్థిక సంఘం ప్రకారం కేంద్ర ప్రభుత్వం 2021-22నుండి 2025-26 వరకు ప్రతి సంవత్సరం రెండు విడుతలుగా (మొదటి విడుత జూన్‌లో, రెండవ విడత అక్టోబర్‌లో) పంచాయితీలకు నిధులను విడుదల చేస్తుంది. వీటిలో 85 శాతం గ్రామాలకు, 10 శాతం మండల పంచాయితీలకు, 5



శాతం జిల్లా పంచాయితీలకు వాడుకుంటారు. అందులో జీతభత్యాలు గాక 11వ షెడ్యూల్లో పొందుపరిచిన 29 అంశాల నిర్వహణకు అన్ టైడ్ ఫండ్ రూపంలో అందితే, అత్యవసర అవసరాలకు త్రాగునీటి సరఫరాకు, పారిశుధ్య నిర్వహణకు టైడ్‌ఫండ్ రూపంలో విడుదల చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం15వ ఆర్థిక సంఘం 2021-22నుండి 2025-26 కాలానికి 7201 కోట్లను తెలంగాణ రాష్ట్రానికి కేటాయిస్తే అందులో ఈ ఆర్థిక సంవత్సరానికి 2025-26కుగాను 1477కోట్లుగా కేటాయించింది. రాష్ట్రప్రభుత్వం వార్షిక బడ్జెట్లో నిధులను కేటాయిస్తూ రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు అవసరాలకనుగుణంగా విడుదల చేస్తుంది. వీటితో పాటు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్, జల్ జీవన మిషన్, మహాత్మ గాంధీ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్, నేషనల్ హెల్త్ మిషన్, ప్రధాన మంత్రి గ్రామీణ్ అవాస్ యోజన వంటి పథకాలతో కొన్ని నిధులు అందుతున్నాయి. భారత ప్రభుత్వ పంచాయితీరాజ్ మంత్రిత్వ శాఖ, జాతీయ పంచాయితీ అవార్డులను ఉత్తమ గ్రామాలకు ప్రతి సంవత్సరం ప్రధానం చేస్తుంది. ఇది సూచించిన ముఖ్యమైన అంశాలలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకునే గ్రామపంచాయితీలకు ర్యాంకింగ్ ఇస్తుంది. ఇందులో పేదరిక నిర్మూలన, మెరుగైన జీవన విధానం, ఆరోగ్యకర గ్రామ పంచాయితీ, పిల్లల హక్కులు, విద్య, వైద్యం మహిళల రక్షణ, సాధికారత, త్రాగునీటి పారిశుధ్య నిర్వహణ, స్థిరమైన మౌలిక సదుపాయాలు కల్పన, గ్రామ పంచాయితీల సామాజిక సురక్షిత, ప్రజలకు అందించే సుపరిపాలన అనే 9 అంశాలను ప్రామాణికంగా తీసుకుంటూ మెరుగైన ప్రగతిని సాధించిన గ్రామ పంచాయతీలకు జాతీయ పంచాయతీ అవార్డులను ఇస్తారు. పైన పేర్కొన్న అంశాలలో ప్రతి అంశంలో ప్రథమ స్థానంలో నిలిచిన 3 గ్రామ పంచాయతీలకు దీన్దయాల్ ఉపాధ్యాయ పంచాయత్సతత్ వికాస్ పురస్కార్‌ను అందిస్తుంది. పై 9 అంశాలలో అత్యుత్తమ పనితీరు కనబర్చిన 3 గ్రామ పంచాయితీలకు, 3 మండల పంచాయితీలకు, 3 జిల్లా పంచాయితీలకు నానాజీ దేశముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్‌ను అందిస్తుంది. ఇవేకాక కొన్ని ప్రత్యేక విభాగాలలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి వాడకం, ఎలక్ట్రిక్ వెహికల్స్ వాడకాన్ని ప్రోత్సహిస్తూ పునరుత్పాదక ఇంధన వనరులను వాడి గ్రామాన్ని కర్బన రహితంగా చేయడంలో కృషి చేసిన గ్రామాలకు క్లైమేట్ యాక్షన్ స్పెషల్ పంచాయత్ అవార్డు, సొంత వనరులతో గ్రామ ఆదాయాన్ని పెంచే గ్రామ పంచాయితీలకు ఆత్మనిర్భన్ పంచాయత్ స్పెషల్ అవార్డు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో సంస్థాగత సహకారం అందించే గ్రామ పంచాయితీలకు గ్రామ్ పంచాయత్ క్షమతా నిర్మాన్ సర్వోత్తమ్ సంతాన్ పురస్కార్ అవార్డులు ప్రతి సంవత్సరం జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవం రోజున ప్రధాన చేస్తారు. 2025 సంవత్సరం జాతీయ ప్రత్యేక అవార్డుల విభాగంలో తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాలోని యాచారం మండలం 'మల్' గ్రామపంచాయితీ 67 లక్షలు వారాంతం జరిగే పశువుల సంత నిర్వహణ ద్వారా, 3.75లక్షలు షాపింగ్‌కాంప్లెక్స్ అద్దెల ద్వారా, విద్యుదీకరణ, పారిశుధ్య పన్నుల ద్వారా మొత్తంగా 3200 జనాభాకు తలసరి ఆదాయంగా సుమారు 2954 రూపాయలు స్వీయ ఆదాయాన్ని సమకూర్చి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలుస్తూ ఆత్మనిర్భన్ పంచాయత్ స్పెషల్ అవార్డు 2025కు ఎంపికైంది. ఇదే స్ఫూర్తితో ఎన్నికల్లో గెలుపు కోసం పోటీ పడినట్టుగానే గెలిచిన తరువాత తమ పంచాయితీలను ఉత్తమంగా తీర్చిదిద్ది దేశంలోనే అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడంలో పోటీ పడాలి. ప్రజలు కూడా డబ్బు, మందు వంటి తాత్కాలిక ప్రయోజనాలకు ఆకర్షణ కాకుండా ఐదు సంవత్సరాలు గ్రామ భవిష్యత్తుకు విధులు సక్రమంగా నిర్వర్తించే, నిధులను సమర్థంగా ఉపయోగించే, గ్రామ సమస్యలపై పోరాడే అర్హత గల నాయకత్వాన్ని ఎన్నుకోవాలనే ఆలోచన చేయాలి. అప్పుడే దేశానికి సంపూర్ణ గ్రామీణ స్వరాజ్యం దక్కుతుంది. ●

# పిల్లలపై సాంకేతిక ఉపకరణాల ప్రభావం

డాక్టర్ వి.వి.ఎస్.వి నరసింహం

మా నవ జన్మను ప్రసాదించిన తల్లిదండ్రులు నిత్యంపూజ్యనీయులు. ప్రతీ వ్యక్తికి తల్లిదండ్రులే దైవ స్వరూపాలు. మనల్ని కంటికి రెప్పలా కాపాడుతూ మన ప్రగతికి పరితపిస్తూ, అవిశ్రాంతంగా పనిచేస్తుంటారు. మన అభ్యున్నతి కోసం వారు తమ సమయాన్ని, శ్రమను ధారపోస్తారు. పిల్లలు సంతోషం కోసం ఎన్నో త్యాగాలు చేయడం వారికి పరిపాటి. వారు కోరుకునేది కేవలం మన అభ్యున్నతి మాత్రమే. ప్రతీ వ్యక్తి ప్రగతిలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకం. నేటి తరం సాంకేతికంగా ముందుకెళుతోంది. అదే సమయంలో మారుతున్న సమాజ పోకడలు, సాంకేతిక విస్తృతి పెను సవాళ్లను విసురుతోంది. నిర్మల మనస్సుతో సమాజంలోకి అడుగుపెడుతున్న బుడతలు తమకు తెలియకుండానే విషవలయంలో చిక్కుకుంటున్నారు. మంచి, చెడులను తెలుసుకునే వయస్సులోనే చెడువైపు ఆకర్షితులైపోతున్నారు. కుటుంబాలు చిక్కిపోవడం, తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితులు కూడా దీనికి కారణంగా మారుతున్నాయి. వారు తగినంత సమయం చిన్నారులకు కేటాయించలేని పరిస్థితులు, వృత్తిపరమైన ఇబ్బందులు వారిని కొంత సంకట స్థితిలోకి నెట్టేస్తున్నాయి. అదే సమయంలో చిన్నారులు టెలివిజన్లు, సెల్‌ఫోన్‌లకు అలవాటు పడి, మెల్లగా బానిసలుగా మారిపోతున్నారు. ఆట పాటలకు స్థలం లేకపోవడం, స్నేహితుల సంఖ్య తగ్గిపోవడంతో వీరు తమకు తెలియకుండానే ఎలక్ట్రానిక్ వస్తువుల వలయంలో చిక్కిపోతున్నారు. అదే సమయంలో ఇంటర్నెట్ వినియోగం పెరగడం, ప్రతీ ఇంటిలో స్మార్ట్ ఉపకరణాలు పెరగడం కొంత మేలు చేస్తున్నా తెలియకుండానే ఎంతో విషాన్ని చిన్నారులలో నింపేస్తున్నాయి. కుటుంబంతో సంబంధం లేనంతగా చిన్నారులు వీడియో గేమ్‌లకు అలవాటు పడటం ఇటీవల అధికంగా కనిపిస్తోంది. ఇటువంటి వ్యక్తులలో మానవ సంబంధాలు పూర్తిగా మందగించడం, వివరీత ధోరణులు, క్రోధ ప్రవృత్తి పెరిగిపోతున్నాయి. మరొకవైపు చిన్నారులు తమకు తెలియకుండానే తమ వయసుకు మించిన, చూడకూడని అంశాల



ను చూడటం, తెలుసుకోవడం జరుగుతోంది. వీటిలో వారి ప్రమేయం లేకుండానే సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్ వీడియోలు, రీల్స్ రూపంలో వారిని ఈ విష ప్రపంచంలోకి లాగేస్తున్నాయి. నెమ్మదిగా ఆవి తమ కంటెట్ డోస్‌ని పెంచుతూ వారిని పూర్తిగా వీటికి బానిసలుగా మార్చుతున్నాయి. స్మార్ట్‌ఫోన్‌లో తాము చూసిన విషయాలు బయట చేయాలనే తపన, ఆలోచనలు చిన్నారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వీరు ప్రపంచాన్ని పూర్తిగా తెలుసుకునే సమయంలో వారు తెలియకుండా చెడు మార్గంలోఅడుగులు వేగంగా వేసేస్తున్నారు. వీరిని నిరంతరం గమనించి, మార్గనిర్దేశం చేయాల్సిన తల్లిదండ్రులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నావెనక్కి తీసుకురాలేని నష్టం నేటితరం చిన్నారుల విషయంలో జరిగిపోతోంది. ప్రాథమిక పాఠశాలస్థాయి విద్యార్థులలో సైతం ఇటీవల ఇటువంటి అడల్ట్ కంటెంట్‌కి సంబంధించిన అంశాలను వీక్షించడం, తరచూ వాటిని చూడటం పరిపాటిగా మారిపోతోంది. ఇదివారి మానసిక పరిస్థితిని ప్రభావితం చేయడం, విద్యలో దృష్టి సారించలేక పోవడం వంటి విపరీత చర్యలకు కారణంగా మారిపోతోంది. చిన్నారులను నిరంతరం గమనిస్తూ వారి సమస్యలను వింటూ, వారికి సూచనలు అందించే పెద్దతరం ఎంతోఅవసరం. అటువంటి పెద్ద తరం మన ఇంటిలో లేనప్పుడు తల్లితండ్రులే తమ పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించే విధంగా నడచుకోవాలి. భార్యభర్తలిద్దరూ నిత్యం తమపిల్లలతో కొంత సమయంగడపడం, వారి ఆలోచనలు, ఆకాంక్షలు తెలుసుకునే ప్రయత్నం చేయాలి. అదే సమయంలో వారు చెడు ఆలోచనలు, ధోరణులదిశగా అడుగులు వేయకుండావారికి సున్నితంగా మార్గనిర్దేశం చేయాలి. అప్పటికే వారు చెడుమార్గంలో అడుగులు వేసినా పెద్ద మనసుతో అర్థంచేసుకుని, వారిని సక్రమ మార్గంలో నడిపించాలి. చిన్నారులు సైతం ఒక చిన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. తల్లిదండ్రులకు ధైర్యంగా చెప్పగలిగే పనులను మాత్రమే వారుచేయాలి. తల్లిదండ్రులకు చెప్పుకోలేని పనులు ఎప్పుడూ వారుచేయరాదు. ఏదైనా పని చేయాలనిపిస్తే ముందుగా తల్లిదండ్రులకు ఆ విషయంచెప్పి వారి సలహా, సూచనలు తీసుకోవాలి. అప్పుడు ఎటువంటి నష్టం జరగదు. ఏం జరుగుతుందిలే అనే నిర్లక్ష్య ధోరణితో తల్లిదండ్రులకు చెప్పకుండా పరిపక్వత లేని వయసులో మనసు కు నచ్చినది చేసేద్దామని అడుగేస్తే...భవిష్యత్తును చేజేతులా అంధకారంలో నెట్టేసినట్టే. ●

# ప్రైవేటు టీచర్ల బాధలు పట్టించుకోరా?

గోరంట్ల శివరామకృష్ణ

గురువును దైవంగా భావించే సమాజం మనది. విద్యార్థులకు అక్షర భిక్షను పెట్టి వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా మలచే పవిత్రమైన ఉపాధ్యాయులంటే అందుకే అందరికీ ఎనలేని గౌరవం. తెలుగు రాష్ట్రాలలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే టీచర్ల కంటే 38శాతం ఎక్కువటీచర్లు ప్రైవేటు స్కూళ్లలో పనిచేస్తున్నారు. అనధికారిక లెక్కల ప్రకారం రెండు తెలుగురాష్ట్రాలలో సుమారు 3లక్షలమంది పైగా ప్రైవేట్ టీచర్లు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో 60శాతంమంది కనీస ఉద్యోగ భద్రత, పీఎఫ్ వంటి కనీస సౌకర్యాలకు నోచుకోకుండా బతుకు బండిని నెట్టుకొస్తున్నారంటే నమ్మాల్సిందే. టీచర్ గ్రాడ్యుయేట్ ఎన్నికలు తప్ప మిగిలిన ఏ సందర్భంలోనూ రాష్ట్ర ప్రభుత్వాలు తమను పట్టించుకోలేదని, ఏపీ, తెలంగాణలోని ప్రస్తుత ప్రభుత్వాలైనా తమ సమస్యల మీద దృష్టి పెట్టాలని వారంతా కోరుతున్నారు. వినటానికి కాస్త ఇబ్బందిగా ఉన్నా ప్రైవేటు టీచర్ల జీవితాలు ఈ రోజు వెట్టిచాకిరి బానిసలకంటే దౌర్భాగ్యంగా ఉన్నాయి. గత పదేళ్లలో ప్రైవేటు స్కూళ్ల మీద రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పట్టు కోల్పోయింది. వీధికొక స్కూలు వస్తున్నా, వాటిలో అనుమతులున్నవెన్నో తెలియని పరిస్థితి. వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేసే ఈ స్కూళ్లలో రోజంతా నిలబడి పనిచేసే గొంతుపోయేలా పాఠాలు చెప్పే టీచర్లలో సగం మందికి ఉపాధి హామీ కూలీకి దక్కే వేతనం దక్కటం లేదు. వీరిలో చాలామంది ఏళ్ల తరబడి టీచరు నోటిఫికేషన్లు లేక, వయసు దాటిపోయి, సమీపంలోని ప్రైవేటు స్కూల్స్‌లో పని చేస్తూ చాలీచాలని జీతంతో కుటుంబాలను పోషించుకుంటున్న వారు కొందరైతే.. ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న గౌరవంతో రాజీపడుతూ బతికేవారు మరికొందరు. ప్రైవేటు స్కూళ్లలో టీచర్లకు మార్చి నెల వచ్చిందంటే నరకం గుర్తుకు వస్తుంది. స్కూలు సమయం తర్వాత వీరు విద్యార్థుల ఇండ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులను ఒప్పించి, అడ్మిషన్లు చేయించాలి. మేనేజ్‌మెంట్ వారు చెప్పినన్ని అడ్మిషన్లు చేయని టీచర్లకు వచ్చే ఏడాది ఉద్యోగం లేనట్లే. ఎలాగూ ఏప్రిల్, మే వేతనాలు ఇవ్వరు గనుక.. మరో మార్గం లేక టీచర్లు ఇంటింటికీ తిరగాల్సి వస్తోంది. ఒంటిపూట బడుల రోజుల్లో ఎర్రటి ఎండల్లో వీరిని అడ్మిషన్ల కోసం పంపే మేనేజ్‌మెంట్లు వీరి వేతన పెంపుదగ్గరకు వచ్చేసరికి



మీ తరగతిలో పిల్లలకు మంచి మార్కులు రాలేదు అంటూ గొణగటం మామూలే. మన సమాజంలో ఏ సంఘం లేకుండా.. ఎవరికి వారే అన్నట్లు పనిచేసే ఉద్యోగులు ఎవరైనా ఉన్నారంటే అది ప్రైవేటు టీచర్లే. కాబట్టి తమ సమస్యలపై వీరు కలిసి కట్టుగా పోరాటం చేయలేకపోతున్నారు. ప్రయివేటు టీచర్స్ ఎవరైనా సంఘం పెట్టినట్టు తెలిసినా, తమ పాఠశాలలో పని చేసే టీచర్లు అందులో చేరినా వారి ఉద్యోగాన్ని తొలగించటమే కాకుండా, వారికిమరే ప్రైవేటుస్కూల్లో ఉద్యోగం రాకుండా యాజమాన్యాలు చేయటం ఇక్కడచాలా కామన్‌గా జరిగే వ్యవహారం. కనుక పోరుబాట పట్టి కుటుంబాన్ని పస్తులుంచలేక వీరంతా ఏసంఘంలోనూ చేరేందుకు ముందుకు రాలేని దుస్థితి నెలకొంది. ప్రైవేటు స్కూల్స్‌లో నెలకు ఒక సెలవు కంటే ఎక్కువ పెడితే వేతనం కట్ చేయటం కామన్. నెలలో వచ్చే 4 ఆదివారాలు పోనూ ఒక సెలవు మాత్రమే ఉండే ఈ స్కూళ్లలో అంతకంటే ఎక్కువ సెలవులు పెరిగితే శాలరీకోసిపారేస్తారు. చాలా స్కూళ్లలో ఆదివారానికి ముందు, తర్వాతి రోజు సెలవుపెడితే.. రెండు రోజుల జీతం కట్. అనారోగ్యం గానీ అత్యవసరంగా సెలవు కోరితే ఇచ్చే అవకాశం బహు తక్కువ. గ్రామం, మండలం స్థాయిలో ఉన్న ప్రైవేటు స్కూళ్లలో రోజుకు 9 గంటలపాటు పనిచేసే టీచర్లలో సగం మంది వేతనాలు రూ. 9 నుంచి 12 వేల మధ్యనే ఉన్నాయి. ఇక పదో తరగతి పిల్లలకు బోధించే టీచర్లు రాత్రి 8 గంటల వరకు బడిలో ఉండాల్సిందే. దీనికి అదనంగా చెల్లించేది ఏమీ ఉండదు. స్కూలు యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర 12 నెలల ఫీజులు వసూలు చేస్తారు. కానీ టీచర్లకు మాత్రం పది నెలలకే జీతం అందుతుంది. ఏప్రిల్, మే నెలలకూ వేతనం ఇచ్చే స్కూళ్లుమొత్తం తెలంగాణలో కేవలం 5శాతం మాత్రమేనంటే నమ్మాల్సిందే. తెలంగాణలోని వందలో 20 శాతం స్కూళ్లలో టీచర్లకి పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కూడా లేవు. వీరికి నేరుగా వేతనాన్ని నగదు రూపంలో అందిస్తున్నారు. దీనివల్ల వీరికి ప్రభుత్వ పరంగా అందే వైద్యసదుపాయం, మెటర్నిటీ లీవ్ వంటివి ఏమీ అందవు. ఇక కరోనా సమయంలో ప్రైవేటు టీచర్లు పడిన పాట్లు అన్నీఇన్నీ కావు. గత పదేళ్లలోప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు మరింతగా ప్రైవేటు టీచర్ల కష్టాన్ని దోచుకుంటున్నాయి. కళ్లముందు ఇంత జరుగుతున్నా, విద్యాశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవటం లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల వేళ తప్ప రాజకీయ పార్టీలు ప్రైవేటు టీచర్ల సమస్యల్ని ప్రస్తావించకపోవటం దురదృష్టకరం. ఇకనైనా కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాలు తగినచర్యలు తీసుకుని, ప్రైవేటుస్కూళ్ల యాజమాన్యాలను కట్టడి చేయటంతోబాటు ఇక్కడ పనిచేసే టీచర్ల సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేయాలి. ●

5_5.qxd 12/8/2025 1:08 AM Page 1



## వైభవంగా ముగిసిన రెండు రోజుల నెక్స్ జెన్ బాలోత్సవ్



**ఒంగోలు, ప్రభాతవార్త**

విద్యార్థులకు తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శించడానికి ఒక మంచి వేదిక ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ఒంగోలులోని నెక్స్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ లో ప్రారంభమయిన బాలోత్సవములో 90కి పైగా విద్యాసంస్థలనుండి వివిధ ప్రాంతాలనుండి విచ్చేసిన సుమారు 1100 మంది విద్యార్థులు పాల్గొంటున్న బృహత్ కార్యక్రమము ప్రముఖ సంగీత విద్వాంసులు, గిన్నిస్ వరల్డ్ బుక్ రికార్డ్ గ్రహీత అయిన డా. గజల్ శ్రీనివాస్‌చే శనివారం ప్రారంభించబడింది. ఇందులో మొత్తం 27 అంశాలలో 64 పోటీలు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో నిర్వహించబడినాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులతో స్కూల్‌లో చక్కని పండుగ వాతావరణం నెలకొన్నది. పాల్గొన్న ప్రతి విద్యార్థికీ కూడా పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇవ్వబడింది. ప్రథమ స్థానం, ద్వితీయ స్థానం, తృతీయ స్థానం విజేతలు అయిన వారందరికీ ఈ నెల పద్నాల్గవ తేదీ నిర్వహించబోయే నెక్స్ జెన్ కార్నివాల్‌లో ప్రముఖులచే బహుమతి ప్రదానం చేయబడుతుంది అని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమములో స్కూల్‌యాజమాన్యప్రతినిధులయిన డా. కె. మురళీధర్‌రెడ్డి, కె. శ్రీకాంత్‌బాబు, అరవింద, శ్రీవిద్య, ప్రిన్సిపాల్ డా. ఆర్. ఎల్. వి. రమేష్‌తో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపండి

### - వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బొట్లా రామారావు



**ఒంగోలు, ప్రభాతవార్త**

మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణను నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు వై ఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి నాయకత్వంలో మాజీ మంత్రి, రాష్ట్ర పిఏసీ సభ్యులు, కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఆదిమూలపు సురేష్ నాయకత్వంలో కందులూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం కోటి సంతకాల ఉద్యమ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బొట్లా రామారావు మాట్లాడుచూ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణను ఆపాలని కోరుతూ మన నాయకులు జగనన్న కోటి సంతకాలుతో గవర్నర్‌కు నివేదించే కార్యక్రమంనకు రాష్ట్రంలో భారీ స్పందన వచ్చిందని అన్నారు. జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు బొట్లా సుబ్బారావు మాట్లాడుచూ ప్రైవేటీకరణలతో చంద్రబాబు సర్కార్ అవినీతి లో దూసుకుపోతోందని అన్నారు. ఎంపీటీసీ ఆరితోటి దొరబాబు మాట్లాడుచూ చంద్రబాబు ప్రభుత్వం పేదల నోట్లో మట్టి కొట్టే నిర్ణయాలు చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొడ్డు వేణు, బొట్లా మాల్యాద్రి, బొబ్బాల భాను, కళ్యాణ్, జల్లి దాసు, ఉప్పలపాటి శ్రీనివాసరాజు, పసుమర్తి కోటేశ్వరరావు, వామనగుంట కోటయ్య, మోహనరావు, పాటిబండ్ల యేసుపాదం, కృపారావు, గాలి జాన్, సుమన్, శ్యాంబాబు, ఏసుదాసు, వంకాయలపాటి సురేష్, వీసం బాలకృష్ణ, ఫణిదపు సుధాకర్, షేక్ జిలాని బాషా, పిర్లా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సమస్త జీవరాశులకు నీరు జీవనాధారంపై అవగాహన




**ఒంగోలు, ప్రభాతవార్త**

స్థానిక ఎస్ఎస్‌యన్ డిగ్రీ కళాశాల వాలంటీర్లు జాతీయ సేవా పథకంలో భాగంగా యూనిట్ 1, యూనిట్ 2 కొత్తపట్నం మండలం సంకువారిగుంట మరియు టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెంలో సమస్త జీవరాశులకు ప్రాణాధారమైనది నీరుపై అవగాహన కార్యక్రమం జరిగినట్లు కళాశాల డైరెక్టర్ కమ్ ప్రిన్సిపల్ వై. సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో నీటి కొరత, కాలుష్యం నేపద్యంలో నీటి సంరక్షణ అవశ్యకత పై ప్రజల్లో అవగాహన కల్పించడం అవసరమని, నీటిని జాగ్రత్తగా ఉపయోగించడం ద్వారా మన భవిష్యత్తును సంరక్షించుకోవచ్చునని, నీటిని వృధా చేయకుండా ప్రతి నీటి బిందువును కాపాడుకోవాల్సిన అవసరం మన అందరి బాధ్యత అని వాలంటీర్లకు తెలియచేశారు. అనంతరం రోడ్లకు ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి వాలంటీర్లు శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌యన్ ప్రోగ్రాం అధికారులు టీ. రాజేంద్రబాబు, పీ. నీలిమ, టి. రవితేజ, బి. శ్యామల, వైస్‌ప్రిన్సిపల్ టి. రాజశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు. నవీన్, రాయుడు, రాజకుమార్, నాయోమి, హ్యూమేరా అధ్యాపకేతర సిబ్బంది, ఆయా గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఆ కలయిక మధురాతి మధురం

**కొండపి, ప్రభాతవార్త**

ఒకటి కాదు రెండు కాదు దాదాపు అర్ధ శతాబ్ది తర్వాత పూర్వ విద్యార్థుల కలయిక మధురాతి మధురం అమ్మమ్మ తాతయ్య వయసులో విద్యార్థి దశలో, జ్ఞాపకాలను నెంబరు వేసుకుని చిన్న పిల్లలగా మారిపోయారు. కే ఉప్పలపాడు జడ్పీ హైస్కూల్ 1975-76 టెన్త్ క్లాస్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు 50 సంవత్సరాలు టెన్త్ పూర్తయిన సందర్భంగా ఆత్మీయ కలయిక వేడుక నిర్వహించుకున్నారు. వీరందరూ ఇక్కడే చదువుకొని వివిధ వృత్తుల్లో స్థిరపడినా, వీరు ఆత్మీయ కలయిక సందర్భంగా అందరు కలిసి చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకొని ఆనంద బారితమయ్యారు. పూర్వ విద్యార్థులందరూ కలవడానికి పూర్తి సహాయ సహకారాలు అందించిన స్కూల్ కమిటీ చైర్మన్ ఎస్ రాఘవేంద్ర శర్మని పాఠశాల హెచ్‌ఎం సుసన్నకుమార్ను వారు అభినందించి దృశ్యాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తమ చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హెచ్‌ఎంకి పాఠశాల కమిటీ చైర్మన్‌కి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి చుండి శంకర్రావు పూర్తి సహాయ సహకారాలు అందించారు.



ప్రకాశం

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# మీ ఆశీర్వాదం ఇవ్వండి

- పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాం
- యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం..
- వెలుగొండ నీటితో సస్యశ్యామలం చేస్తాం..
- ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



**మార్కాపురం, డిసెంబర్ 7, ప్రభాతవార్త**

చంద్రన్న మార్కాపురం జిల్లా ఏర్పాటు ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపుతామని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా ప్రకటించడం పట్ల టిడిపి కార్యకర్తల ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణంలోని 10,11 వార్డుల్లో ఆదివారం సాయంత్రం ఏర్పాటుచేసిన అభినందన సభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి దోసుకుందని విమర్శించారు. రాష్ట్రం దివాలా తీయడం తప్ప పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. అన్ని రంగాల్లో వెనుకబడిన మార్కాపురం డివిజన్ ను తమ ప్రభుత్వం ప్రత్యేక జిల్లాగా ప్రకటించడం అదృష్టంగా భావిస్తున్నాను. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. వెలుగొండ ప్రాజెక్టు రెండవ టన్నుల కోసం పాదయాత్ర ద్వారా సాధించాన్నారు. ఐదేళ్ల వైకాపాలనలో వెలుగొండ ప్రాజెక్టును నిర్వీర్యం చేయడం జరిగిందన్నారు. ప్రాజెక్టును పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేసి పచ్చి మోసం చేశారన్నారు. వెలుగొండ ప్రాజెక్టు రెండవ టన్నల్ రాకపోతే ఈ ప్రాంతం ఎండమావిగా మారుతుందని అలుపెరగని పోరాటం చేసి ఆనాటి ప్రభుత్వం ద్వారా సాధించానన్నారు. జిల్లా ఏర్పాటు ద్వారా మార్కాపురం జిల్లా సస్యశ్యామలం కానుంది అన్నారు. నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాల కోసం కృషి చేస్తున్నన్నారు. ఈ ప్రాంతం వెనుకబడిందని, గత ప్రభుత్వం పట్టించుకోలేదని, కూటం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంత అభివృద్ధికి పెద్దపీట వేయడం జరుగుతుంది అన్నారు. ఇందిరమ్మ కాలనీ అభివృద్ధి కోసం కృషి చేయడం జరుగు తుందన్నారు. ఒకప్పుడు లక్ష యాభై వేలు పలికిన ఇందిరమ్మ ఇల్లు నేడు 10 లక్షలు పలుకుతుందని, ఆ కాలనీ అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. పేదల కోసం అహర్నిశలు శ్రమించే తనను ఆశీర్వదించాలని కోరారు. ఆస్తులు కూడా పెట్టుకోవడం కోసం రాజకీయాల్లోకి రాలేదని, పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు మాత్రమే తాను రావడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో అన్ని రంగాల్లో చంద్రన్న మార్కాపురం జిల్లా అభివృద్ధి జరుగు తుందన్నారు. జిల్లా ఏర్పాటు ద్వారానే ఈరోజు భూములకు విపరీతమైన ధరలు వచ్చాయన్నారు, ఇది కూటమి ప్రభుత్వం వల్ల సాధ్యమైంది కాదా అని ప్రశ్నించారు. పేదల జీవితాలకు వెలుగు నింపడమే తమ ధ్యేయమని, ప్రజా సంక్షేమం కోసమే నిరంతరం పనిచేస్తామన్నారు. నాణ్యమైన వైద్యం పేదలకు అందించాలన్న సంకల్పంతో జిల్లా వైద్యశాలను తీసుకురావడం జరిగిందన్నారు. పేదల కోసం తపించే తనకు పేదల ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. జిల్లా ఏర్పాటు ద్వారా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు రావడం జరుగుతుందని ప్రజా పాలన కూడా మీ ముందుకు వస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ఎల్లప్పుడూ అండగా నిలవాలన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి పూల వర్షంతో మహిళలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలోతెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## గుంటి గంగా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



**తాళ్లూరు, నవంబర్ 30, ప్రభాతవార్త**

మండలంలోనితూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడు గ్రామంలో వెలిసిన జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్య క్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారంభక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. పూజారిలు మెట్టెల బాలరాజు, పుచ్చకాయల విజయ లక్ష్మి అమ్మవారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ఎన్. కామేశ్వరశర్మ, అమ్మవారికిఅభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు . అమ్మవారికి నైవేద్యాలు, పొంగళ్లు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన అమ్మవారిని దర్శించుకోవడానికి జిల్లాతో పాటు పలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు పొంగళ్లు పెట్టి, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రక్కన ఉన్న పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు చేశారు. అమ్మవారి దర్శించుకున్న భక్తులకు ఆలయ అన్నదానసత్రంలో అన్నదానం చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయఈవో జీ. వాసుబాబు, ఆర్‌ఏ కాటూరి ప్రసాదు, సిబ్బంది పర్యవేక్షించారు.

# సచివాలయం తప్పుతుంది..

- ఇష్టానుసారంగా వ్యవహారిస్తున్న ఉద్యోగులు
- మండలాలకే పరిమితమైన వీఆర్వోలు
- పర్యవేక్షించని ఉన్నతాధికారులు
- ఇబ్బందుల్లో ప్రజలు

**ఒంగోలు, ప్రభాతవార్త**

40ఏళ్ల పరిపాలనను ప్రజలకు అందుబాటులోకి తీసుకెళ్లడానికి మండలి వ్యవస్థను ప్రవేశపెట్టారు. 2019లో పరిపాలనను గ్రామస్థాయికి చేర్చాలన్న ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. జిల్లాలోని సచివాలయాల్లో పాలన గాడితప్పుతుంది. ఉద్యోగులు ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చేప్రజలుపడిగాపులు గాయాల్సిన పరిస్థితి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించింది. సచివాలయ వ్యవస్థ పర్యవేక్షణకు ప్రభుత్వం మండల స్థాయిలో ప్రత్యేకంగా 25 డిప్యూటీ ఎంపీడీవోలను నియమించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ ఉద్యోగులు సర్దుబాటు కోసం సచివాలయాలను ఏబీసీలుగా వర్గీకరించింది. అయినా కొన్ని చోట్ల తీరు మారలేదు. సచివాలయ ఉద్యోగులు ఇష్టానుసారంగా వ్యవహారిస్తున్నారు. సమయ పాలన లేకుండా విధులకు హాజరవుతున్నారు. ఉదయం 10గంటలకు రావాల్సిన సచివాలయ ఉద్యోగులు ఉదయం 11.30గంటలకు విధులకు వస్తున్నారు. గ్రామ వార్డు సచివాలయాలకు వెళ్లి ప్రజలు ఆదాయ జనన మరణ సర్టిఫికేట్ల కోసం పడిగాపులు కాస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు సచివాలయ తనిఖీలు చేయకపోవడంతోఉద్యోగులు ఇష్టానుసారంగా వ్యవహారిస్తున్నారని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నారు. సచివాలయాలు ఏర్పాటు అయ్యాక ప్రతి గ్రామంలో ఒక కార్యాలయం, పది శాఖలకు సంబంధించిన ఉద్యోగులు, ప్రజల గడప వద్దకు సేవలు ఆనాడు అది ఒక రంగుల కళ. వైసీపీ ప్రభుత్వంలోని సచివాలయ వ్యవస్థ గాడి తప్పింది. పింఛన్ల మంజూరు కోసం వాలంటీర్లు ప్రజల వద్ద డబ్బులు వసూళ్లు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. నాటి నుంచి నేటి వరకు గ్రామ, వార్డు సచివాలయాలను తనిఖీలు చేసిన అధికారులు లేకపోవడంతో సోమవారం నాడు కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీల సంఖ్య ప్రతి వారం పెరుగుతుంది. జిల్లాలో పని చేసే అనేక మంది వీఆర్వోలు మండల కార్యాలయాలకే పరిమితం అవుతున్నారు. ఉదయం 11.30గంటలకు వీఆర్వోలు విధులకు హాజరవుతున్నారు. ప్రతి సచివాలయానికి ఉదయం 10గంటలకు హాజరు కావాల్సిన వీఆర్వోలు డైరెక్ట్‌గా మండల కార్యాలయానికి వెళ్తున్నారు. ప్రజలు ఫోన్ చేస్తే తహసీల్దార్, డీటీ, ఆర్ఐతో సమావేశాలు ఉన్నాయని వీఆర్వోలు చెప్పడం గమనార్హం. ప్రజలకు సేవలు చేయాల్సిన ఉద్యోగులు పని వేళలు తగ్గించుకుని తిరగడం ఎంత వరకు సమంజసమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీ సేవ ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో వాటా ఉండటంతో వాటి సేవలను పరిష్కరించి సచివాలయ దరఖాస్తుల తిరస్కరణకు గురి చేయడంతో వీఆర్వోలు తమ సఫలీకృతమయ్యారు. కనీసం ఉదయం 10గంటల నుంచి 1గంటల వరకు అయిన సచివాలయాల్లో వీఆర్వోలు అందుబాటులో ఉంటే అన్నిసమస్యలకు పరిష్కారం అవుతాయని గ్రామ, వార్డు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఒక సర్వేయర్‌ను నియమించింది. ఆ తరువాత అగ్రికల్చర్, రీ సర్వే మొదలు కావడంతో సర్వేయర్లను రంగంలోకి దింపింది. వారు ఎక్కడ నుంచైనా బయోమెట్రిక్ హాజరు నమోదు చేసే అవకాశం కల్పించడంతో వారు సచివాలయాలకు వీడ్కోలు చెప్పారు. ఇక గ్రామంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు ఎనర్జీ అసిస్టెంట్ ఉండేవారు. సచివాలయ సిబ్బందిజీతభత్యాలు, పంచాయతీ కార్యదర్శుల చేతుల్లో ఉండేవి. ఎనర్జీ అసిస్టెంట్ జీతం మాత్రం వారి మాతృశాఖకు ఇచ్చింది దీంతో వారు సచివాలయానికి శుభం కార్డు వేశారు. సచివాలయం ఏర్పాటు అయిన నాటి నుంచి సరైన జాబ్‌చార్జి లేక, విధులు కేటాయించక విలువైన మానవవనరులు వృధా అయిన కొలువు మహిళ పోలీసు అనంతరం ఈ కొలువు పేరున గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శిగా మార్చినప్పటికి వీరి విషయంలో ఏమి చేయాలో ఎవరి వద్ద స్పష్టమైన సమాధానం లేదు. పోలీసు ఉద్యోగానికి కావాల్సిన శారీరక ధారుడ్య అర్హతలు వీరికి లేవు. వీరిని ఏ శాఖకు కేటాయించాలన్న సందిగ్ధత ఇప్పటికి నెలకొంది. విధినిర్వహణ లేని కొలువుగా మిగిలిపోయింది. సచివాలయ ఉద్యోగులు వచ్చాక ఎన్నికల విధుల్లో భాగస్వామ్యం చేస్తూ వారిలో మెజార్టీ సిబ్బందిని బూత్ లెవల్ అధికారులుగా(బీఎల్ఓ)గా నియమించారు. తమకు బీఎల్వో డ్యూటీ ఉందని సచివాలయానికి హాజరు కావడం తగ్గించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా ట్యాంకులను పరిశుభ్ర పరచడం, మురికి కాలువల నిర్వాహణ బాధ్యత ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ది. వారు ఈ పనులు పంచాయతీ కార్యదర్శులకు సంబంధించింది అంటూ తప్పించుకుంటున్నారు. డివిజన్ స్థాయిలో డివిజన్ అభివృద్ధి అధికారులను గత ప్రభుత్వం నియమించింది. ఈ కార్యాలయానికి సిబ్బందిని కేటాయించక ఇద్దరిని మిగిల్చింది. ఇప్పుడు వారి పేరు డీడీఓలుగా మార్చింది. కానీ అధికారులు పది మందికి పైగా సచివాలయ సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకున్నారు. దీంతో సచివాలయాల్లో సేవలు అందించే వారు లేక అవి వెలవెలబోయాయి. సచివాలయ వ్యవస్థను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం మండల స్థాయిలో ప్రత్యేకంగా డిప్యూటీ ఎంపీడీవోలను నియమించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ ఉద్యోగుల సర్దుబాటు కోసం సచివాలయాలను ఏ, బీ, సీలుగా వర్గీకరించింది. అయినప్పటికి కొన్ని చోట్ల తీరు మారలేదు. నగరాల్లో నోడల్ అధికారులను నియమించింది. వీరు సచివాలయ ఉద్యోగులపై పర్యవేక్షించింది. వీరి ఆగమనంతోనైనా సచివాలయ ఉద్యోగుల మెడలో గంట కడతారేమోనని ఓ ఆశ జనాల్లో నెలకొంది.

# ఎరిక్షన్‌బాబు మీద ధ్వజమెత్తిన తెలుగుదేశం పార్టీ రెబల్స్

- కమీషన్ల కక్కుర్తితో పార్టీని నాశనం చేస్తున్నాడంటూ ధ్వజం
- ఇసుక, బియ్యం, మద్యం మట్టిలో భాగాలు పంచుకుంటూ పార్టీ వినాశానికి కరణం
- పార్టీ వారిని పక్కన పెడుతూ వైసీపీతో దోస్తీ కడుతున్నాడంటూ ధ్వజం
- నెగ్గితే వారి బలంగా ఓడితే పక్కవారి మీదకు నెట్టడం అలవాటుగా మారిందంటూ విమర్శ

**యర్రగొండపాలెం, డిసెంబర్ 7, ప్రభాతవార్త**

వేగినాటి కోటయ్య మృతి చెందిన తరువాత తెలుగుదేశం పార్టీ బరువు బాధ్యతలను తలకు ఎత్తుకున్న నేను నియోజకవర్గం అయిన దగ్గర నుంచి ఆయురారోగ్యాలతో పార్టీలో నిందమోయ వలసి వస్తుందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ వైద్యులు మన్నె రవీంద్ర వాపోయారు. యర్రగొండపాలెం పట్టణంలోని రవీంద్ర సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని తన కార్యాలయంలోవిలేకర్ల సమావేశం నిర్వహించారు. ఇక్కడి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా ఓ పత్రికలో ఇచ్చిన కథనంలో వైద్యులు రవీంద్ర మీద ఎరిక్షన్‌బాబు అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. దానికి ప్రతీకగా తెలుగుదేశం పార్టీలోని రెండవ వర్గం అయిన రవీంద్ర వర్గం విలేకర్ల సమావేశం నిర్వహించి ఎరిక్షన్‌బాబును ఎండగట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పునర్విభజనలో యర్రగొండపాలెం నియోజక వర్గంగా మారిన తరువాత తెలుగుదేశం పార్టీ తరుపున సీటును పొంది ఎవరో ఒకరు రావడం ఎలాంటి వ్యూహ్ ప్రతివ్యూహాలు పన్నాకుండగా ఎన్నికలలో నిలబడడం పరాజయం చెందడం ఆ నెపాన్ని డాక్టర్ మీదకు నెట్టడం అలవాటుగా మారిందని, అందుకుఎరిక్షన్‌ఆబు అతీతుడు కాదని విమర్శించారు. యర్రగొండపాలెంన ఇయోజకవర్గం అయిన తరువాత 2009 కాంగ్రెస్ తరుపున ఆదిమూలపు సురేష్, తెలుగుదేశం పార్టీ అభ్యర్థి అయినపాలపర్తి డేవిడ్ రాజు మీద గెలుపొందారు. ఆ తరువాత 2014 జరిగిన సార్వత్రిక ఎన్నికలలో అదే డేవిడ్ రాజు తెలుగుదేశం నుంచి వైసీపీలోకిచేరి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని బూదాల అజితారావు మీద గెలుపొందారు. వైసీపీ అధికారంలోకి రాకపోవడంతో వైసీపీ తరుపున గెలిచిన డేవిడ్ రాజు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. 2019లో మరోమారు వైసీపీ తరుపున ఆదిమూలపు సురేష్, తెలుగుదేశం పార్టీ తరుపు బూదాల అజితారావు పోటీ పడి వైసీపీ చేతిలో ఘోర ఓటమి చవిచూశారు. 2024 జరిగిన ఎన్నికలలో మన్నె రవీంద్ర ఆశీర్వాదంతో తెలుగుదేశం అభ్యర్థిగా రంగంలోకి దిగిన ఎరిక్షన్‌బాబు వైసీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ చేతిలో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. అయితే తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావడం తో ఇన్‌చార్జిగా ఎరిక్షన్‌బాబు ఇక్కడే కొన సాగుతున్న విషయం తెలిసిందే. ఓటమి చెందిన తరువాత తన ఓటమికి మన్నె రవీంద్ర కారణమనే వాదనను బలంగా పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకురావడంలో సఫలీకృతం చెందడంతో గ్రూపుల కుంపటి మొదలైన విషయం విధితమే.



ఎరిక్షన్‌బాబు నియంతృత్వ పోకడలను పోతున్నా దంటూ మన్నె రవీంద్రవర్గం ప్రతి సారి ధ్వజమెత్తుతూనే ఉన్నారు. పలుమార్లు అధిష్టానాని కి ఎరిక్షన్‌బాబు మీద ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. అధిష్టానం మాత్రం నిమ్మకు నీరెత్తిన చందంగా ఉండటంతో విసుగు చెందిన వీరు అమీతుమీకి తెల్చుకునేందుకు ఎరిక్షన్‌బాబు మీద అవినీతి ఆరోపణలను గుప్పించారు. నియోజక వర్గంలో అలీబాబా అరడజను దొంగలు చందంగా వ్యవహారం నడుపుతున్నారని దొంగ యవ్వారాన్ని బట్టబయలు చేసి పార్టీని కాపాడుకుంటామంటూ హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో దోర్నాల మాజీ పార్టీ అధ్యక్షులు అంబటి వీరారెడ్డి, యర్రగొండపాలెం మాజీ పార్టీ అధ్యక్షులు షేక్ జిలాని, పెద్దారవీడు మండలపార్టీ మాజీ అధ్యక్షులు వెన్నా వెంకటరెడ్డి, రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి రమణారెడ్డి శ్రీను చౌదరి తదితరులు పాల్గొన్నారు.

6_6.qxd 12/8/2025 1:09 AM Page 1



# ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్యా బోధన

## - మన బాల భారతి విద్యాసంస్థ అకాడమిక్ డైరెక్టర్ ఒంటెద్దు అంజిరెడ్డి



**సంతమాగులూరు, డిసెంబర్ 7 ,ప్రభాతవార్త**
ఉన్నత విద్యాప్రమాణాలతో విద్యను బోధించడంలో సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం పరిధిలోని మలబాలభారతి విద్యాసంస్థ సంతమాగులూరు ప్రాంతంలో అగ్రగామిగా నిలుస్తుందని పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ ఒంటెద్దు అంజిరెడ్డి తెలిపారు. పాఠశాల ప్రారంభించి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా యాజమాన్య భాగస్వామి పాఠశాల నిర్వహణ కర్త దుగ్గెంపూడి పవన్ కుమార్ తో కలిసి ఒంటెద్దు అంజిరెడ్డి ఆదివారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. మన బాల భారతీయ సంస్థను తన మిత్రులు దుగ్గెంపూడి పవన్ కుమార్, ముప్పాళ్ళ వెంకటేశ్వర్లు తదితరులు కలయికతో 2016 జూన్ 9న 470 మంది విద్యార్థులతో ప్రారంభించడం జరిగిందన్నారు. విద్యారంగంలో విద్యార్థుల వృత్తి నైపుణ్యానికి సంబంధించిన ప్రయోజనకరమైన కోర్సులను ప్రవేశ పెడుతూ 10 సంవత్సరాల ప్రస్థానం కొనసాగించామన్నారు. ప్రస్తుతం 1250 మంది విద్యార్థులతో విద్యాసంస్థ విజయవంతంగా నడుస్తుందని అంజిరెడ్డి తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రైవేటు విద్యాసంస్థలు ఎక్కడా లేని విధంగా హైదరాబాదు వారి ఈ- అభ్యసన్, వారి సౌజన్యంతో ఒలంపియాడ్ కోర్సులు ప్రవేశపెట్టి విద్యార్థుల భవితకు మంచి పునాది వేస్తున్నామన్నారు. బాల బాలికలకు మూడవ తరగతి నుండి పదవ తరగతి వరకు వివిధ రకాల రాష్ట్రస్థాయి పోటీలకు సంసిద్ధులను చేస్తూ విజయవంతంగా రాష్ట్రస్థాయి బహుమతులను విద్యార్థులు తెచ్చుకుంటున్నారని అంజిరెడ్డి తెలిపారు. 2026 జూన్9న పాఠశాల10వ వార్షికోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో తమసంస్థ విజయాలను పాత్రికేయులతో పంచుకుంటున్నామని అంజిరెడ్డి తెలిపారు.

# మన బాలభారతిలో పాత్రికేయులకు సముచిత గౌరవం

## - షష్టి పూర్తి చేసుకున్న ప్రజాశక్తి విలేకరి కొండలు ఘన సత్కారం



**సంతమాగులూరు, డిసెంబర్ 7, ప్రభాతవార్త**
సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం పరిధిలోని మన బాల భారతి విద్యా సంస్థలో పాత్రికేయులకు ప్రత్యేక గౌరవం ఉంటుందని మన అకడమిక్ డైరెక్టర్ ఒంటెద్దు అంజిరెడ్డి తెలిపారు. తమ పాఠశాల 10 సంవత్సరాల ప్రస్థానం పూర్తి చేసుకున్న నేపథ్యంలో పాత్రికేయ వృత్తిలో ఉండి షష్టిపూర్తి(60 సంవత్సరాల వయస్సు నిండిన) చేసుకున్న ప్రజాశక్తి విలేఖరి ఓర్సు కొండలరావును మన బాల భారతి యాజమాన్యం తరఫున ఒంటెద్దు అంజిరెడ్డి, పాఠశాల ఏఓదుగ్గెంపూడి పవన్ కుమార్లు దుశాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ గుర్తింపు పొందిన పాత్రికేయ సంస్థల్లో పనిచేస్తున్న పాత్రికేయుల పిల్లలకు తమ సంస్థ బోధన ఫీజుల్లో 50 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు.

# సత్ప్రవర్తనతోనే ఉన్నత శిఖరాలకు



**సంతమాగులూరు ,డిసెంబర్ 7, ప్రభాతవార్త**
విద్యార్థులు సత్ప్రవర్తనతోనే ఉన్నత శిఖరాలకు ఎదగ గలరని సంతమాగులూరు శఖా గ్రందాలయ పాలకుడు బాదం విజయ భాస్కరరెడ్డి అన్నారు. పాఠశాల శలవు దినాల్లో గ్రందాలయంలో నిర్వహించే చదవడం మాకనఇష్టం కార్యక్రమాన్ని సంతమాగులూరుశాఖ గ్రంధాలయములో ఆదివారం నాడు చదువుతో నాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుందుర్తి గ్రామానికి చెందిన అతిథి ఎం. వెంకట్రావు పాల్గొని సత్ప్రవర్తన పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## కోటప్పకొండ యోగివేమన సత్రంలో కుమ్మెత దంపతులకు ఘన సన్మానం



**సంతమాగులూరు, డిసెంబర్ 7, ప్రభాతవార్త**
కోటప్పకొండ యోగివేమన రెడ్ల అన్నదాన సత్రం అభివృద్ధి కమిటి సంతమాగులూరు మండలం పాతమాగులూరు గ్రామానికి చెందిన నరసరావుపేట ప్రముఖ ఏఆర్కే ఫుడ్స్ అధినేత కుమ్మెత అంజిరెడ్డి, పద్మ దంపతులను ఆదివారం కోటప్పకొండ సత్రంలో కమిటిఘనంగా సత్కరించారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పేద వారికి నిరంతర సేవలుఅందిస్తున్న కొటప్పకొండ యోగివేమన సత్రం అభివృద్ధి కొరకు నిధుల సమీకరణలో తన వంతు సహకారంగా కుమ్మెత అంజిరెడ్డి ఆర్థిక సహకారం అందించారు. ఈ సంవత్సరం నూతనంగా సత్రం అభివృద్ధికి నిధులు అందించి సభ్యత్వం పొందిన 70మందిని నిర్వహణ కమిటి సత్కరించినట్లు అందులో సంతమాగులూరు మండలంలో అంజిరెడ్డి దంపతులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అద్యక్ష,కార్యదర్శులు కంజుల వీరారెడ్డి, భవనం రాఘవరెడ్డి , సంతమాగులూరు మండలం ఏల్చూరుకు చెందినమరో దాత వెన్నపూస జోషప్‌రెడ్డి తదితరులు ఉన్నారు. యోగివేమన ట్రస్ట్ సభ్యుల సంఖ్య మొత్తం 2412 కు చేరినట్లు అద్యక్షులు వీరారెడ్డి తెలిపారు.

# రియాలిటీ 'లక్కీ' విజేత గోపు అమూల్య



**సంతమాగులూరు, డిసెంబర్ 7,ప్రభాతవార్త**
సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం గ్రామంలో రియాలిటీ రియల్ ఎస్టేట్ వారు ఆదివారం నిర్వహించినలక్కీ డ్రాలో రెండున్నర సెంట్‌ప్లాట్‌నిరొంపిచర్ల మండలం అన్నవరప్పాడు గ్రామానికి చెందిన గోపు వెంకటరెడ్డి కుమార్తె అమూల్య గెలుచు కున్నారు. ఇదే లక్కీడ్రాలో మరో నలుగురు వరుసవిజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమానికి అతిధులుగా సంతమాగులూరు మండలసర్పంచుల సంఘ అధ్యక్షులు మరియు పుట్టవారిఆపలెం సర్పంచ్ సన్నెబోయిన గురుయాదవ్,కామేపల్లి సర్పంచ్ గుండపనేని సురేష్, సంతమగులూరు సర్పంచ్ పుచ్చకాయల నాగేశ్వరావు మరియు ఏల్చూరు టీడీప నాయకులు దుద్దెల గాలయ్య,గోపు వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ అన్న సంతర్పణ చేశారు. విజేతలను అభినందించారు.

## మంగమ్మకు నివాళులర్పించిన మాజీ మంత్రి మేరుగ



**నాగులుప్పలపాడు, డిసెంబర్ 7, ప్రభాతవార్త**
నాగులుప్పలపాడు మండలం చదలవాడ గ్రామ పశుక్షేత్రంలో హెల్పర్‌గా పని చేస్తున్న జి.విజయ్ కుమార్ సతీమణి జి.మంగమ్మ మృతి చెందిన విషయం తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు తనప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ మేరుగ నాగార్జున. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పోలవరపు శ్రీమన్నారాయణ, వైసీపీ జిల్లా సీనియర్ నాయకులు వల్లంశెట్టి హనుమంతరావు, గ్రామ ఎంపీటీసీ పొద పవన్, గ్రామ పార్టీ అధ్యక్షులు తోకల శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ సుబ్బారావు, సీనియర్ నాయకులు రామస్వాఇ, బీసీ నాయకులు దాసరి శ్రీనివాసరావు, దాసరి ఆంజనేయులు, చిరంజీవి, తిరుపతిస్వామి, సుధీర్, కిరణ్, గూడూరు వెంకటరావు, రైతు నాయకులు బొర్ర శ్రీనివాసరావు, ఉప్పుగుండూరు గ్రామ పార్టీ అధ్యక్షులు మాదాసు రాంబాబు, నాగరాజు, అంజిబాబు, పోలవరపు జనార్ధన, జిల్లా యువ నాయకులు కాకర్ల వెంకటేష్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కందుల డానియల్, మద్దిపాడు మండల ప్రచార కమిటీ అధ్యక్షులు జాలయ్య, సీనియర్ నాయకులు కట్ట శ్రీరాములు, మల్లెల నాగరాజు, పోలయ్య, రత్నం, ఎడ్లూరి శ్రీనివాసరావు, పాలేటి నరసింహారావు, కాకుమాను బ్రదర్స్ జస్టి నరసింహారావు, చుండూరి శ్రీధర్, ఫకీర్ అహ్మద్, అక్బర్, సైదావలి, కార్తీక్, చప్పిడి అశోక్, చప్పిడి శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 11న ఉపసర్పంచ్ ఖాళీకి ఎన్నిక

**సింగరాయకొండ, డిసెంబర్ 7,ప్రభాతవార్త**
సింగరాయకొండ గ్రామపంచాయతీలో ఉపసర్పంచ్ పదవి ఖాళీ కావడంతో ఈ నెల 11వ తేదీన ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.జయమణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పంచాయతీ లో 11వ వార్డు సభ్యురాలు, ఉపసర్పంచ్‌గా వ్యవహరించిన షేక్ కరీమున్ ఇటీవల తన పదవికి రాజీనామా చేయడంతో ఉపసర్పంచ్ స్థానం ఖాళీ అయ్యింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం డిసెంబర్ 11వ తేదీ ఉదయం 11 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తూ సర్పంచ్, వార్డు సభ్యులకు నోటీసులు జారీ చేశారు. ఆ సమావేశంలోనే ఉపసర్పంచ్ ఎన్నిక జరగనుందని ఎంపీడీఓ తెలిపారు.

## శానిటేషన్ పక్రియను పరిశీలించిన డీపీవో వెంకటేశ్వరరావు



**సంతనూతలపాడు, డిసెంబర్ 7, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన సంతనూతలపాడులో ఆదివారం నాడు జరుగుతున్న శానిటేషన్ పక్రియను జిల్లాపంచాయతీ అధికారి వెంకటేశ్వర రావు పరిశీలించారు. శానిటేషన్ పట్ల పంచాయతీ కార్మికులకు డీపీవో వెంకటేశ్వరరావు పలు సూచనలు ఇచ్చారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో కంపోస్టు ఎరువు తయారుకు నడుము బిగించాలని డీపీవో కోరారు. ప్రతి ఒక్కరూ తమ తమ గృహాలు పరిసరాలను పరిశుభ్రం ఉంచుకోవాలని, తద్వారా ఆరోగ్య సంరక్షణ లభించునని డీపీవో వెంకటేశ్వరావు పేర్కొన్నారు. ముమ్మరంగా శానిటేషన్ పక్రియను వేగవంతం చేయాలన్నారు. సైడు కాలువలో మురుగునీరు నిల్వ లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రతకు పాటుపడాలని తద్వారా ఆరోగ్య సంరక్షణ కలుగునని డీపీవో వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు పంచాయతీ కార్యదర్శి ఎన్.ప్రతాప్ కుమార్, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించిన నూతన బీజేపీ అధ్యక్షులు దండు, కావూరిలు



**సంతనూతలపాడు, డిసెంబర్ 7 ,ప్రభాతవార్త**
సంతనూతలపాడు నియోజకవర్గానికి చెందిన బీజేపీ నూతన బీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు దండు శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కావూరి వాసులు ఆదివారం నాడు కూటమి ప్రభుత్వంలో భాగంగా ఒంగోలులో తన కార్యాలయంలో సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, స్వీట్స్ అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు, పొగాకు బోర్డు మాజీ డైరక్టర్ పొద వరప్రసాద్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గూండా శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్ సింహ, సంతనూతలపాడు మండల బీజేపీ అధ్యక్షులు బాలినేని కళ్యాణ్‌రెడ్డి, మాజీ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు బాలినేని చెంచిరెడ్డి, తదితరులు ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను కలిసి మొక్కలను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి



**సంతనూతలపాడు, డిసెంబర్ 7, ప్రభాతవార్త**
ప్రభుత్వ వైద్య, విద్యపై చంద్రబాబు సర్కార్ కుట్ర చేస్తుందని సంతనూతలపాడు మండల వైసీపీ కన్వీనర్ దుంపాచెంచిరెడ్డి ఆరోపించారు. చంద్రబాబు సర్కార్ ప్రభుత్వ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటిసంతకాల సేకరణ కార్యక్రమం సంతనూతలపాడులోని బస్టాండ్ సెంటర్, పలు కాలనీల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చెంచిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తే నేటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం వైద్య, విద్యను పీపీపీ పేరుతో టీడీపీ సానుభూతిపరులకు, కార్పొరేటర్లకు దోచిపెడుతున్నట్లు ఆయన ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమం పెట్టడం లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వారిపై దాడులు, అక్రమ కేసులు పెడుతున్నారు తప్ప ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ డైక్టర్ తన్నీరు మోహన్‌రావు, తన్నీరు వైసీపీ నాయకులు కుంచాల నాగాంజనేయులు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేర్నమిట్ట చెరువు కట్ట వద్ద ఒక వ్యక్తి ఆత్మహత్య



**సంతనూతలపాడు, డిసెంబర్ 17 ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట చెరువు కట్ట వద్ద కూచిపూడి గ్రామానికి చెందిన జి.పుల్లారెడ్డి 35 అనే వ్యక్తి ఆత్మహత్యకు గురయ్యాడు. తన మోటారు సైకిల్‌పై ఈ ప్రాంతానికి చేరుకుని ఒక వైరుతో తాను చెట్టుకు కట్టుకొని ఆత్మహత్యకు గురైనట్లు తెలుస్తోంది. ఒంగోలు తాలూకా ఎస్సై హరిబాబు సంఘటన ప్రాంతాన్ని పరిశీలించి మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

# పేదరెడ్ల అభివృద్ధికి కృషి చేయాలి






**సీఎస్‌పురం, డిసెంబర్ 7, ప్రభాతవార్త**
పేదరికంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రెడ్లను గుర్తించి వారి అభివృద్ధికి రెడ్డి బంధువులు సహాయ సహకారాలు అందించాలని రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి అన్నారు. బెంగుళూరులోని యలహంకా ప్రాంతంలో ఉన్న కంట్రీ క్లబ్‌లో బెంగుళూరు రెడ్డి బంధువుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ బెంగుళూరులో ఉన్న రెడ్డి బంధువులు అందరూ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. రెడ్డి బంధువులంతా కలిసి పని చేయాలన్నారు. రెడ్డి కులంలో పుట్టిన ప్రతి ఒక్కరూ పేద ప్రజల సంక్షేమం కోసమే పని చేశారని రెడ్డి కులస్తులు చేపట్టిన మంచి పనుల గురించి వివరిస్తూ రెడ్డి నాయకులను గుర్తు చేసుకున్నారు. ఆరె శ్యామలరెడ్డి, తోపుదర్తి ప్రకాష్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తదితరులు రెడ్ల ప్రాధాన్యత గురించి వివరించారు. రెడ్ల ఆత్మీయ సమావేశానికి ఆర్థిక సహకారం అందించిన ముత్యాల రమణారెడ్డి, ముత్యాల నారాయణరెడ్డి, పాలుగుళ్ళ నాగిరెడ్డి, ముడుమాల రాజేంద్రరెడ్డి ఆర్థిక సహకారం అందించిన దాతలను సన్మానించారు. వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజన వెంకటరెడ్డి, సర్పంచ్ ముత్యాల భారతీ నారాయణరెడ్డి, పులి మాల్యాద్రి రెడ్డి, పెద్దిరెడ్డి నారాయణరెడ్డి, సిద్దు వెంకటరెడ్డి, డబల్ రెడ్డి, గూడపు రెడ్డి రమణారెడ్డి, దుగ్గిరెడ్డి జయరెడ్డి, అడవిరెడ్డి, కందుల బ్రదర్స్, తదితర మండల రెడ్డి నాయకులతో పాటు బెంగుళూరులో ఉన్న అనేక మంది రెడ్డి బంధువులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## పిఏసి సభ్యులు సురేష్‌ను పరామర్శించిన బొట్లా రామారావు



**సింగరాయకొండ, డిసెంబర్ 7, ప్రభాతవార్త**
మాజీ మంత్రి వర్యులు, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, కొండపి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్ ను వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బొట్లా రామారావు ఆదివారం ఉదయం సింగరాయకొండలోని క్యాంపు కార్యాలయంలో కలిసి పరామర్శించారు. ఇటీవల వైద్య చికిత్స పొందిన సురేశ్‌ను డిశ్చార్జ్ అయిన తరువాత ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. తరువాత ప్రైవేట్ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా జరుగుతున్న సంతకాల సేకరణ, కొండపి నియోజకవర్గంలో అధికార తెలుగుదేశం పార్టీ నేతల పాలన విధానంపై తీవ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయనతో జిల్లా ఇంటెలెక్చ్యువల్ విభాగం కార్యదర్శి తొట్టెంపూడి సురేష్ పాల్గొన్నారు.

## 63వ హోంగార్డ్స్ రైజింగ్‌డేలో ఉప్పుగుండూరు వాసి ప్రతిభ




**నాగులుప్పలపాడు, డిసెంబర్7, ప్రభాతవార్త**
ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన 63వ హోంగార్డ్స్ రైజింగ్ డేలో నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు వాసి కొలకలూరి శ్యామ్‌బాబు మంచి ప్రతిభ కనపరిచారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలైన లాంగ్ జంప్ 30 మందిలో శ్యామ్‌బాబు మొదటి స్థానంలో సాధించి మంచి ప్రతిభ కనపరిచారు. అదే విధంగా వాలీబాల్‌లో మొదటి బహుమతి సాధించారు. మంచి ప్రతిభ కనపరిచిన శ్యామ్‌బాబును ఎస్పీ హర్షవర్ధన్ రాజు అభినందించి మెమోంటో అందజేశారు. తదుపరి జరగబోయే క్రీడల్లో మంచిప్రతిభ కనపరిచి పోలీసు శాఖకు మంచిపేరు తీసుకురావాలని అభినందించారు.

# మహాదేవునికి ప్రత్యేక పూజలు



**బల్లికురవ, డిసెంబర్ 7, ప్రభాతవార్త**
బ్రహ్మగుండ మహా పుణ్యక్షేత్రంలో మార్గశిర మాస, ఆర్ధ్ర నక్షత్ర పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ గంగా పార్వతి సహిత నాగలింగేశ్వరస్వామి వారికి మహన్యాస పూర్వక మహా రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి వేకువ జాము నుండి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు కొనసాగాయి. అనంతరం స్వామివారికి అష్టోత్తర పూర్వక మహా బిల్వ దళార్చన నివేదన నీరాజన, మహా మంత్రపుష్ప కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు, పరిసర గ్రామాల ప్రజలకు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అమరావతిలో జనవరి 3 నుంచి ప్రపంచ తెలుగు మహాసభలు




**ఒంగోలు - ప్రభాతవార్త**
ప్రతినోట తెలుగుమాట అన్న నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రసారస్వత రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ తెలిపారు. తెలుగు భాష బడి భాష మాత్రమేకాదని అమ్మఒడి భాషగా గుర్తించాలని, అధికార భాషగానే కాకుండా మమకార భాషగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్క తెలుగువారు కృషిచేయాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన బ్రోచరను నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూలులో ఆవిష్కరించారు. 2026 జనవరి 3, 4, 5 తేదీల్లో అమరావతిలోని శ్రీ సత్యాసాయి స్పిరిచ్యువల్ సొసైటీలో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహాసభలు ప్రారంభిస్తారని వీరితోపాటు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, భారత ఉపరాష్ట్రపతి, ఆరు రాష్ట్రాల గవర్నర్లు పాల్గొంటారన్నారు. మూడు రోజులు జరిగే సభల్లో పద్య, వచన, అవధాన, భక్తి, సాహిత్య సదస్సులు, పత్రిక, బాలసాహిత్య, జానపద, విజ్ఞానం, చలనచిత్ర, సాహిత్యాలపై సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవిదేశాల నుంచి అనేకమంది తెలుగువారు మహాసభల్లో పాల్గొంటున్నారని ప్రకాశంజిల్లా కవులు, రచయితలు, కళాకారులు, సాహిత్య అభిమానులు మూడు రోజులు జరిగే కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నందమూరి తారకరామారావు వేదిక, శ్రీనాధకవి వేదిక, తూము నరసింహదాసు వేదిక, డాక్టర్ ఘంటశాల, డాక్టర్ ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం వేదిక, రామోజీరావు ప్రదర్శనల ప్రాంగణం, కొప్పరపు కవుల వేదిక, జాషువా, కరుణశ్రీ వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు, సభా కార్యక్రమాలు, పూర్ణకుంభ ప్రధానోత్సవం, ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం, సౌజన్య సేవా పురస్కారాల ప్రదానోత్సవం, గ్రంథాల ఆవిష్కరణలు, ఆంధ్రమేవ జయతే ప్రత్యేక సంచిక ఆవిష్కరణ, కవి సమ్మేళనాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాల్గొనే కవులకు ఎటువంటి ప్రవేశ రుసుం లేదని, అందరికి భోజన, సాధారణ వసతి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి, నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నెక్స్ట్‌జెన్ స్కూలు డైరక్టర్లు మురళీధర్‌రెడ్డి, శ్రీకాంత్, అరవింద, శ్రీవిద్య, ప్రిన్సిపాల్ రమేష్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పోలేరమ్మ గుడి పునర్నిర్మాణానికి నిధుల మంజూరు - గ్రామస్థుల కృతజ్ఞతలు



**సింగరాయకొండ,డిసెంబర్ 7,ప్రభాతవార్త**
మండల కేంద్రంలోని మూలగుంటపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి సమీపంలోని శ్రీ పోలేరమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి రాష్ట్ర దేవాదాయ శాఖ ద్వారా 50 లక్షల రూపాయల నిధులు మంజూరు అయినందుకు గ్రామస్థులు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామికి, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మాచింగ్ గ్రాంట్ రూపంలో 16,67,000 ను ఒక నెలలోపు గ్రామ పెద్దలు చెల్లిస్తే,ప్రభుత్వం నుండి 33 లక్షల 33 వేల రూపాయలు నిధులు విడుదల చేయనున్నట్లు రాష్ట్ర దేవాదాయ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సన్నెబోయిన శ్రీనివాసులు, నక్కా ముసలయ్య, నరాల సుధాకర్, అంబటి బ్రహ్మయ్య, తిరుపతి, వార్డు సభ్యుడు వెంకటరావు, నక్కా మధు, మురళి, మిరియం మోహన్, అంబటి శ్రీహరి, సన్నెబోయిన వెంకటేశ్వర్లు, ప్రభాకర్, బాలాజీ,అశోక్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరువతో కళ్లగుంటకు బస్సు సౌకర్యం ఏర్పాటు



**నాగులుప్పలపాడు, డిసెంబర్ 7, ప్రభాతవార్త**
కళ్లగుంట గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామ పీఏసీఎస్ చైర్మన్ మున్నంగి పున్నారెడ్డి ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షులు తేళ్ళ మనోజ్‌కుమార్‌కి వివరించి వెంటనే మమ్మల్ని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ వద్దకు తీసుకెళ్ళడం జరిగింది. శాసనసభ్యులు వెంటనే స్పందించి వారికి లెటర్ ఇచ్చి వెంటనే వెళ్లి ఆర్‌ఎంని కలిసి సమస్యను పరిష్కరించాలని మనోజ్‌ని ఆదేశించారు. ఆర్‌ఎంని కలిసి తమ గ్రామ సమస్యను వివరించి ఊరికి బస్సు వచ్చేంత వరకు అనునిత్యం సంబంధిత అధికారులను సంప్రదించి బస్సు సౌకర్యం కల్పించారు.

7_7.qxd 12/8/2025 1:11 AM Page 1



## నేడు హసనాపురంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**కొమరోలు, డిసెంబర్ 7,ప్రభాతవార్త**
మండలంలోని తాటిచెర్ల మోటు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని హసనాపురం గ్రామంలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. హసనాపురం గ్రామంలో ఉదయం 8.30గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు ఆర్డిఎస్ఎస్ కొత్త లైన్ వేయడం జరుగుతుందని కావున విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా తెలిపారు.

## సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**కొమరోలు,డిసెంబర్ 7, ప్రభాతవార్త**
సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కొమరోలు ఎస్సై జె నాగరాజు తెలిపారు. పోలీసులు వీడియో కాల్స్ ద్వారా విచారణ చేయడం, వీడియో కాల్స్ ద్వారా డబ్బు,వ్యక్తిగత వివరాలు సేకరించడం జరగదని తెలిపారు. డిజిటల్ అరెస్ట్ అనేది లేనేలేదని, అలాంటి కాల్స్ వచ్చినప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు. ప్రజలు మోసాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పలుమార్లు సూచించారని ఎస్ఐ తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**రాచర్ల, డిసెంబర్ 7 ,ప్రభాతవార్త**
విద్యుత్తు మరమ్మతుల కారణంగా మండలంలోని ఆకవీడు గ్రామంలో నేడు సోమవారం ఉదయం 8గంటల నుండి ఉదయం 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని రాచర్ల విద్యుత్ శాఖ ఏఈ కే బాల గురువయ్య తెలిపారు. ఆర్డిఎస్ఎస్ పనుల్లో భాగంగా 33/11 ఆకవీడు, జేపిచెరువు సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఈ అంతరాయం ఏర్పడుతుందని పరిస్థితిని గమనించి విద్యుత్ వినియోగదారులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## ఘనంగా కరాటే అకాడమీ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్

**గిద్దలూరు, డిసెంబరు 7, ప్రభాతవార్త**
గిద్దలూరులోని ప్రముఖ కరాటే అకాడమీలో ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ ఘనంగా నిర్వహించారు. మాస్టర్ సుబ్రహ్మణ్యం మార్గదర్శకత్వంలో మొత్తం 45మంది విద్యార్థులు వివిధ స్థాయిల బెల్ట్ పరీక్షల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన విజేతలకు బెల్టులు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే గురువు సిద్ధార్థ దు కరాటే అకాడమీ వ్యవస్థాపకులు నల్లారి మోహన్‌రావు ప్రత్యేక అతిథిగా పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. క్రమశిక్షణ, ధైర్యం, శారీరక నైపుణ్యం కరాటే ద్వారా అభివృద్ధి చెందుతుందని అన్నారు. మరింత కృషితో జాతీయ స్థాయిలో అవకాశాలు పొందాలని గురువులు విద్యార్థులకు సూచించారు. అనంతరం పాల్గొన్న విద్యార్థులు అందరికీ రంగ సాయి ఫిజియోథెరపీ డాక్టర్ పసుపులేటి విజయ్ బహుమతులను ప్రధానం చేశారు.

## ఘనంగా గాండ్ల సంక్షేమ సంఘ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**- ఏకగ్రీవంగా కార్యవర్గం ఏర్పాటు**



**కొనకనమిట్ల, డిసెంబర్ 7, ప్రభాతవార్త**
పొదిలి పట్టణంలోని ఎన్జీఒ హోంలో పొదిలి యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు, దాసరి గురు స్వామి ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా సలహాదారులు తంగెళ్ళ నాగభూషణం, రాష్ట్ర సంఘ నాయకులు చిట్టెంశెట్టి శ్రీనివాసులు, జిల్లా యూత్ కన్వీనర్ రోషన్‌బాబు చేతుల మీదుగా ఆదివారం గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం రిజిస్టర్ నెంబర్ 366/2025తో పొదిలి యూనిట్‌కు కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా దాసరి గురుస్వామి, సహాధ్యక్షులుగా మాడిశెట్టి హారిక, సహ కార్యదర్శిగా చిట్టెంశెట్టి శ్రీనివాసులు, కోశాధికారిగా బూదాటి వెంకట నిమ్మేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా దుద్దు శంకరరావు, ముత్యాలపాటి రామారావు, ఆళ్లచెరువు విక్రమార్క్,చాకిరాల చంద్రకుమారిలను నూతనంగా ఎన్నికయ్యారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ సలహాదారులు తంగేళ్ల నాగభూషణం మాట్లాడుతూ గాండ్ల కార్పొరేషన్, కమ్యూనిటీ బిల్డింగ్ సాధించాలని అది సాధించాలంటే గాండ్ల తెలికుల సామాజిక ప్రజలందరూ ఐకమత్యంగా ఉండాలని సూచించారు. ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గాండ్ల సంక్షేమసంఘం జిల్లా కోశాధికారి వరికుంట్ల హనుమంతరావు, యూత్ కన్వీనర్ బోయిళ్ళ రోషన్‌బాబు, చిట్టెంశెట్టి వెంకట సుబ్బారావు, దుద్దు హరి, గుంటిక కృష్ణ, ఫణి మాధవి, అనూష, వరికుంట్ల వెంకటేశ్వర్లు, బూదాటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టిన రోజు వేడుకలు

**- పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపేందుకు పోటీలు పడిన నాయకులు, కార్యకర్తలు**

**- పార్టీ నాయకులతో కలిసి క్యూకట్టిన అధికారులు**

**- పుట్టిన రోజు వేడుకల బందోబస్తును పర్యవేక్షించిన పోలీసులు**



**యర్రగొండపాలెం, డిసెంబర్ 7, ప్రభాతవార్త**
యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పుట్టిన రోజు వేడుకలను ఆయన అనుచరగణం,పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజల భాగస్వామ్యంతో ఆదివారం ఘనంగా జరిపారు. యర్రగొండపాలెం పట్టణంలోని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. మార్కాపురం నుంచి పార్టీ కార్యాలయానికి చేరిన ఎరిక్షన్‌బాబు తన అనుచర గణం ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి మండలంలోని పలువురు నాయకులకు తినిపించారు. నాయకులు, అనుచరులు ఎరిక్షన్‌బాబుకు తినిపించి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలిపారు. ఆదివారం అయినప్పటికి పుట్టిన రోజు జరుపుకున్న ఇన్‌చార్జిలకు నియోజకవర్గంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు, నాయకులు, కార్యకర్తలు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలపడానికి ఉదయం నుంచే పోటీలు పడ్డారు. పలు శాఖలకు చెందిన అధికారులు, కార్యకర్తలతో పాటు వివిధ పత్రికలలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబుకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రకటనలను ఇవ్వడం తెలిసిందే. పత్రికలలో వచ్చిన ప్రకటనలు పార్టీ నాయకులతో పాటు అధికారులు ఇచ్చిన ప్రకటనలు కలిసి రావడంతో కాసింత గందరగోళం నెలకొంది. తన పుట్టిన రోజు వేడుకలకు దండలు, శాలువాలు వద్దని ఎరిక్షన్‌బాబు వారించినప్పటికి నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మాత్రం నాయకుని మాటను బేఖాతరు చేస్తూ నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున తరలివచ్చారు. యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద యర్రగొండపాలెం పంచాయతీ తరుపున పండ్లు, పలహారాలను రోగులకు అందించారు. దాంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తమ నాయకునికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ కార్యకర్తలు, నాయకులు పట్టణంలో పెద్ద ఎత్తున ప్లెక్సీలను ఏర్పాటు చేశారు. మరి కొందరు భారీ కటౌట్లను ప్రధాన కూడళ్లలో ఉంచారు. వచ్చిన కార్యకర్తలకు, నాయకులకు,అధికారులకు భోజన సదుపాయం కల్పించారు. రాజకీయ నాయకుల భాగస్వామ్యంతో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగల్‌రెడ్డితో పాటు నియోజకవర్గంలోని మిగతా నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, తోటా మహేష్ నాయుడు, కొత్తమాసు సుబ్రహ్మణ్యం, శెనగ నారాయణరెడ్డి,కందుల నారాయణరెడ్డిలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పట్టణంలో గూడూరి జన్మదిన వేడుకల సందడి

**- పుల్లలచెరువు మండల ముఖ్య నాయకులు గజమాలతో సత్కారం**



**పుల్లలచెరువు, డిసెంబర్ 7, ప్రభాతవార్త**
యర్రగొండపాలెం పట్టణంలో టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు జన్మదిన వేడుకలను ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా పుల్లలచెరువు మండలం టీడీపీ మండల కన్వీనర్ పోట్ల గోవిందు తమ నాయకులు మాజీ మండల అధ్యక్షులు పయ్యావుల ప్రసాద్, శనగ నారాయణరెడ్డి, రెంటపల్లి సుబ్బారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు గజ్వల్లి భాస్కర్‌లతో కలిసి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పోట్ల గోవిందు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని, ఆ దేవుని ఆశీస్సులతో నిండు నూరేళ్ల వర్ధిల్లుతూ మరింత అభివృద్ధి చేయాలని ఆయన కొనియాడారు. అదే విధంగా ఇప్పటికే వెనుకబడి ఉన్న మా ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి బాటలో తీసుకొని పోవడం జరుగుతుందని అన్నారు.ఇంకా ఆ భగవంతుడు దయతో ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో ఉండి మాకు మంచి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పుల్లలచెరువు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు ప్రత్యేక చర్యలు

**- రోడ్లపై వేగనిరోదక బ్యారికెట్స్**

**- ద్విచక్రవాహన చోదకులకు సి.ఐ. ప్రత్యేక అవగాహన**

**- తప్పని సరిగా హెల్మెట్ వాడాలని ఆదేశం**





**అద్దంకి, డిసెంబరు 7,ప్రభాతవార్త**
ఇటీవల కాలంలో నార్కెట్‌పల్లి-మేదరమెట్ల రహదారిపై సంతమాగులూరు అడ్డరోడ్డు పరిసరాల లోను,తోకపల్లి, పేరేచర్ల రహదారిపై వినుకొండ పరిధిలోను ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.ఈ నేపద్యంలో బాపట్ల జిల్లా ఎస్.పి. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని ఆయా ప్రాంతాల ప్రత్యేకదృష్టి సారించి,పోలీస్ అధికారులకు రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు పలు సూచనలు చేశారు. ఈ నేపద్యంలో అద్దంకి పట్టణ సి.ఐ. సుబ్బరాజు ఆదివారం అద్దంకి-సింగరకొండ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ, రోడ్లు అస్తవ్యస్తంగా వున్న ప్రాంతాలలో వాహనాల వేగ నిరోదానికి బ్యారికెట్స్‌ను ఏర్పాటు చేయించారు. అదే విధంగా ప్రధాన రహదారి నుండి సింగరకొండకు వెళ్ళె జంక్షన్ ప్రాంతంలో 99 అడుగుల విగ్రహం వద్ద కూడ వేగ నిరోదక బ్యారికెట్స్‌ను ఏర్పాటు చేయించారు. కాకానిపాలెం హైస్కూల్ పరిసరాలలో కూడ హైవేపై వేగనిరోదక బ్యారికెట్స్‌ను ఏర్పాటు చేశారు. వీటితోపాటు వాహన చోదకులకు ప్రత్యేకంగా సి.ఐ. సుబ్బరాజు కౌన్సిలింగ్ నిర్వహించారు. తప్పని సరిగా హెల్మెట్లను వాడాలని, వేగాన్ని అదుపులో వుండే విధంగా వాహనాలను నడపాలని తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకోవాలని ద్విచక్రవాహన చోదకులకు అవగాహన కలిగించారు.

## గోశాల షెడ్ నిర్మాణానికి విరాళం



**అద్దంకి, డిసెంబరు 7, ప్రభాతవార్త**
హరిహర గోశాలషెడ్ నిర్మాణం కొరకు చిలకల సాంబశివరావు 10వేల రూపాయల చెక్కును గోశాల సుబ్బారావుకు అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో ఈకార్యక్రమంలో ప్రెసిడెంట్ బాచిన శివధర పూర్ణచంద్రరావు,సెక్రటరీ అళహరి హరిప్రసాద్, రోటరీ సభ్యులు ఊటుకూరు రామకోటేశ్వరరావు,పువ్వాడ రామకోటేశ్వరరావు, చుండూరి మురళీ సుధాకరరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు,సంకా సుబ్రహ్మణ్యం(బాబు),మహమ్మద్ రఫీ,పిఎల్‌వి. నరసింహారావు,నాగయ్య,చిలకల సాంబశివరావు,కోటేశ్వరరావు,తమ్మనశ్రీనివాసరావు పాల్గొన్నారు.

## వైసిపిలో పదవుల నియామకం

**- అద్దంకి నియోజకవర్గంలో పలువురికి పార్టీ పదవులు**

**అద్దంకి , డిసెంబరు 7, ప్రభాతవార్త**
వైఎస్ఆర్‌సిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అద్దంకి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ సిఫార్సులతో అద్దంకి నియోజకవర్గానికి చెందిన పలువురుకు నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పార్టీ పదవులలో నియామకాలు జరిగాయి.అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షులుగా ఇస్తర్ల వెంకటరావు, బాపట్ల జిల్లా మైనార్టీ సెల్ సెక్రటరీలుగా షేక్ చిన్న జానీబాషా, సయ్యద్ రహీం, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా షేక్ అబ్దుల్ రెహమాన్, బాపట్ల జిల్లా వైఎస్ఆర్ సిపి సోషల్ మీడియా విభాగ ప్రధాన కార్యదర్శిగా కల్లం జయరామిరెడ్డి, సెక్రటరీలుగా యర్రిబోయిన వెంకటేష్, కిన్నెర అనిల్,ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మొరబోయిన రఘువంశీ, షేక్ మీరావలిలను నియమిస్తూ ఉత్తర్వులు విడదల చేశారు.

## అద్దంకి నియోజకవర్గ వైసిపి టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షులుగా ఇస్తర్ల



**అద్దంకి, డిసెంబరు 7,ప్రభాతవార్త**
అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షులుగా ఇస్తర్ల వెంకటరావును నియమిస్తూ నియమాక ఉత్తర్వులను ప్రకటించారు. ఈయన విద్యార్థి దశనుండే ఎన్ఎస్‌యుఐలో చురుకుగా పనిచేశారు.ఈ విభాగంలో అద్దంకి మండల, అద్దంకి నియోజకవర్గ అధ్యక్షులుగా, జిల్లా అధికర ప్రతినిధిగా సుదీర్ఘకాలం పనిచేశారు. యూత్ కాంగ్రెస్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా అద్దంకి నియోజకవర్గ యూత్ అధ్యక్షులుగా ఈయన పనిశారు. అదే విధంగా ప్రత్యక్ష ఎన్నికలలో ఎంపిటిసిగా పోటీచేసి గెలుపొందారు. ఆసమయంలో మండల పరిషత్‌లో వైసిపి చీఫ్ విప్‌గా పనిచేశారు. అద్దంకి మండల వైసిపి సోషల్ మీడియా కన్వనర్‌గా పనిచేశారు. ప్రస్తుతం అద్దంకి నియోజకవర్గ వైసిపి జెసిఎస్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. ప్రధానంగా 2014లో జరిగిన సమైఖ్య ఆంధ్ర ఉద్యమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ అధ్యక్షులుగా పనిచేశారు. 77గంటలపాటు ఆమరణ నిరాహరదీక్షలో ఇస్తర్ల వెంకటరావు పాల్గొన్నారు. ఈయన నియామకం పట్ల పలువురు హర్షం ప్రకటించి, అభినందనలు తెలియజేశారు.

## బిజెపి ఒబిసి మోర్చా జిల్లా అధ్యక్షులుగా గాలం

**- గాలంకు పలువురు అభినందనలు**



**అద్దంకి, డిసెంబరు 7, ప్రభాతవార్త**
బీజేపీ ఓబీసీ మోర్చా బాపట్ల జిల్లా అధ్యక్షులుగా గాలం ప్రభాకర్‌యాదవ్ నియమితులయ్యారు. ఆమేరకు సింగరకొండఅలోని యాదవ సత్రం అధ్యక్షులుఎర్రిబోయిన ప్రసాద్, అనమనమూరు సర్పంచ్ జంపు హరిబాబు,సింగరకొండపాలెం సర్పంచ్ ఎర్రిబోయిన తిరుపతయ్య,యాదవ సంఘం నాయకులు సాయి,తేజ తదితరులు ప్రభాకర్ యాదవ్‌ను పూలమాలలతో, శాలువాలుతో ఘనంగా సత్కరించారు.

## పుట్టంరాజు చారిటబుల్ ట్రస్టు విస్తృత కళాపురస్కారానికి డాక్టర్ అక్కిరాజు ఎంపిక

**- ఈ నెల 21న పురస్కార పంపిణీ కార్యక్రమం**



**అద్దంకి, డిసెంబరు 7, ప్రభాతవార్త**
పుట్టంరాజు బుల్లెయ్య-రామలక్ష్మమ్మల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న విస్తృత కళా పురస్కారం-2025కార్యక్రమం ఈ నెల 21 ఆదివారం ఉదయం 10 గంటలకు పుట్టంరాజు కళాక్షేత్రంలో నిర్వహించనున్నారు.ఈ సంవత్సరానికి పురస్కార గ్రహీతగా కవితాగాండీవి, నాట్యశ్రీనాథ, అభినవ తెనాలిరామకృష్ణ, అభినవ ఘంటశాల, పద్యవిద్యామణి, కళాప్రవీణ వంటి అనేక గౌరవ బిరుదులు పొందిన పద్యకవి, రంగస్థల-సినిమా నటుడు,గాయకుడు,అధ్యాపకులు డా.అక్కిరాజు సుందర రామకృష్ణను ఎంపిక చేశారు.ఆమేరకు పురస్కారాన్ని ట్రస్ట్ తరఫున పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ప్రదానం చేయనున్నారు. పురస్కార గ్రహీతకు పురస్కారద్రవ్యం క్రింద10వేల రూపాయలను, పట్టువస్త్రాలను,జ్ఞాపికను అందజేయనున్నట్లు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి వెల్లడించారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ సరైంది కాదు



**తాళ్లూరు, డిసెంబర్7 ,ప్రభాతవార్త**
రాష్ట్రంలో ఉన్న మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించడం సరైంది కాదని వైఎస్సార్ సీపీ నాయకులుఅన్నారు. ఆదివారం మండలంలోని తూర్పు గంగవరంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి ఆదేశాలు మేరకు మెడికల్ కళాశాలల ప్రవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పి విద్యను వ్యాపారం చేయాలను కుంటున్నారని, దీంతో పేదింటి పిల్లలు డాక్టర్లుగా ఎదిగే అవకాశం లేకుండా పోతం దన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అడ్వకేట్ లీగల్ సెల్ కార్యదర్శి గోపు శ్రీనివాస్ రెడ్డి,దర్శి నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షులు యత్తపు మధుసూదన రెడ్డి,నాయకులు గుజ్జుల వెంకటేశ్వర రెడ్డి, కటకంశెట్టి శ్రీనివాసరావు, పూనూరి దేవదానం, బచ్చా, లతీఫ్, పల్లెబోయిన శ్రీనివాస్ రెడ్డి, గూడా నాని,ముసలారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రభుత్వం విరమించుకోవాలి




**పొన్నలూరు,డిసెంబర్ 7,ప్రభాతవార్త**
మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వలన పేద విద్యార్థులు వైద్యవిద్యకు దూర మవుతారని ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించు కోవాలని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మండల కేంద్రమైన పొన్నలూరులో ఆదివారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సురేష్ మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో కొత్తగా 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి పూనుకుందని, వాటిలో 7 మెడికల్ కాలేజీలు పూర్తి చేశామన్నారు. అంత చేసినప్పటికి అభివృద్ధి జరగలేదని ప్రచారం చేస్తూ,ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రైవేటికరణ జరగకుండా ఆపేందుకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని తమ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి చేపట్టారన్నారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు.రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసే వరకు కూటమి ప్రభుత్వంపై ప్రజలు తరపున పోరాటం చేస్తామన్నారు.వైసీపీశ్రేణులు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను గ్రామాల్లోని ప్రతి ఇంటింటికి వివరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి, పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, గడ్డం మాల్యాద్రి, కనపర్తి గోవిందమ్మ, గుత్తికొండ కళ్యాణి, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్కాపురం జిల్లాలో దర్శి నియోజకవర్గం చేర్చమనడం నేరమా?

**దొనకొండ,డిసెంబర్ 7,ప్రభాతవార్త**
కనీసం100కిమీ ఒంగోలుకి దూరంగా ఉన్న దొనకొండ కురిచేడు మండలంలను చేర్చమనడం నేరమా?మీకు చీమకుర్తి ఉంది మాకు దొనకొండ ప్రాంతాన్ని స్టార్టప్‌ల కోసం ఉపయోగిస్తారు అని అడగడం నేరమా?శ్రీశైలం కారిడార్ని ఏర్పరుస్తూ పర్యాటక ప్రాంతంగా ఆద్యాత్మిక పర్యాటక ప్రాంతంగా నాలుగు యుగాల దేవుడు చెన్నకేశవ స్వామి ఆలయాన్ని కలిపి అభివృద్ధి చేయండి అని అడగడం నేరమా?త్రిపురాంతకం దోర్నాల ప్రాంతాన్ని ఆద్యాత్మిక ప్రాంతంగా అభివృద్ధి చేయమనడం నేరమా?గిద్దలూరు రెవిన్యూ డివిజన్ ఏర్పాటు నేరమా?కుదరని పక్షంలో కంభం బేస్తవారిపేట రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి అని అడగడం నేరమా?దొనకొండ ప్రాంతం లేని మార్కాపురం జిల్లా తల లేని జిల్లా కాదా? అడగడం నేరమా?ఇప్పటికే ఎప్పటికీ వెనుకబడిన ప్రాంతం గానే మిగిలి పోదామా?పార్టీల్లో అధికారం అనుభవించే వారు అధిష్టానం ను మెప్పించే అవకాశం లేనప్పుడు ప్రజలు నోరెత్తి అడగడం నేరమా?నోరెళ్ళబెట్టి అభివృద్ధి కావాలి రియల్ ఎస్టేట్ వ్యాపారంతో కోట్లు గడించాలి అని ఆశపడటం నేరము కాదా?ఎందుకు ఈ మోనం వ్యాపారస్తులు?విజయోత్సవాలలో ఉన్నవాళ్లు ఎప్పుడైనా జిల్లా కోసం గళమెత్తారా? ఎంతమంది నోరెత్తి అడిగానవారు?నోరెళ్ళబెట్టి చూసి అవహేళన చేసి నేడు సంకలు గుద్దుకున్నవారు మీ ఆలోచనలు ఆచరణ విధానంలో బయటపడి దొనకొండ ప్రాంతం కోసం ముందుకు రండి.మార్కాపురం జిల్లా సాధన సమితి కంభం 2017.చెన్నకేశవకుమారి కాపురం జిల్లా నామధేయ సాధన సమితి

## నరసయ్య ఆశయాల సాధనకు కృషి చేస్తా


**- ప్రజల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తా**



**దర్శి,డిసెంబర్ 7,ప్రభాతవార్త**
డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తన తండ్రి గొట్టిపాటి నరసయ్య వర్ధంతిని పురస్కరించుకొని స్వగ్రామమైన యద్దనపూడిలో ఆదివారం నరసయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిదర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ రాజకీయాలంటే ప్రజాసేవ ప్రజలకోసం పనిచేయాలని మా గొట్టిపాటి కుటుంబంలోని పెద్దలు మా తాతగారు హనుమంతరావు మా నాన్న నరసయ్య మాకు నేర్పారని వారి స్ఫూర్తితో నేను ముందుకు వెళుతున్నానని ఆమె వివరించారు.రాజకీయాలలో నిరంతరం ప్రజల కోసం పని చేయాలన్న మా పెద్దల ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడమే నా లక్ష్యమని అందుకే దర్శి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం ప్రజలందరికీ అందాలన్న లక్ష్యంతో ప్రతినిత్యం పనిచేస్తున్నానని ఆమె వివరించారు. ఆనాడు స్వర్గీయ నందమూరి తారక రామారావు స్ఫూర్తితో తెలుగుదేశం పార్టీలో మా కుటుంబం రాజకీయ ప్రస్థానం ప్రారంభించి ప్రకాశం జిల్లా అభివృద్ధిలో ఆనాటి నుండి ఈనాటి వరకు ఒక ప్రత్యేక స్థానం ఉందని మీ అందరికీ తెలుసు అన్నారు. ఆనాడు గౌరవ మంత్రివర్యులు హనుమంతరావు గారు, మా నాన్న శాసనసభ్యులు నరసయ్య అనేక పథకాలను ప్రజలకు అందించేదుకు కృషి చేశారని ఆమె వివరించారు. అదే స్ఫూర్తితో నేడు మా బాబాయ్ విద్యుత్‌శాఖమాత్యులు గొట్టిపాటి రవికుమార్ నేను దర్శిలో ప్రజల కోసం పనిచేస్తూ, ప్రజల అభివృద్ధి కోసం సేవకురాలు వలె పనిచేస్తున్నానని గౌరవ ప్రియతమ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు,ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ ఐటీ విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్‌బాబు చేపడుతున్న అభివృద్ధి ఫలాలు, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందించేందుకు నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజల కోసం పనిచేస్తానని ఆమె హామీ ఇచ్చారు.18 నెలల కూటమి పాలనలో ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారని వివరించారు.అదే స్ఫూర్తితో పెద్దల ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు దర్శి ప్రాంతాన్ని అభివృద్ధి ప్రాంతంగా చెయ్యటమే నా లక్ష్యం అన్నారు.

## రెడ్ల సంక్షేమం మన అందిరి బాధ్యత

**- సత్యనారాయణరెడ్డి పిలుపు**



**కనిగిరి, డిసెంబర్ 7, ప్రభాతవార్త**
బెంగుళూరులోని యలహంకా కంట్రీ క్లబ్‌లో ఆదివారం జరిగినరెడ్డి బంధువుల ఆత్మీయ సమావేశంలో పేదరికంతో బాధపడుతున్న రెడ్డి బంధువులను గుర్తించి, వారి అభివృద్ధికి ప్రతి రెడ్డి ముందుకు రావాలని రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రెడ్డిలు ఎల్లప్పుడూ పేదల సంక్షేమం కోసం పని చేసిన వర్గమని, అదే సేవా భావాన్ని కొనసాగించాల్సిన అవసరంఉందని అన్నారు. సమాజాభివృద్ధి కోసం రెడ్డి బంధువుల ఐక్యత చాలా ముఖ్యమని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరె శ్యామలరెడ్డి, తోపుదర్తి ప్రకాష్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తదితరులు రెడ్ల సామాజిక బాధ్యత, సంఘబలం సమాజంలో రెడ్డి నాయకుల ప్రాధాన్యతను వివరించారు. సమావేశానికి ఆర్థిక సహకారం అందించిన ముత్యాల రమణారెడ్డి, ముత్యాల నారాయణరెడ్డి, పాలుగుళ్ళ నాగిరెడ్డి, ముడుమాల రాజేంద్రరెడ్డి తదితర దాతలను సభ వేదికపై సన్మానించారు. వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజన వెంకటరెడ్డి, సర్పంచ్ ముత్యాల భారతి నారాయణరెడ్డి, పులి మాల్యాద్రిరెడ్డి, పెద్దిరెడ్డి నారాయణరెడ్డి సిద్దు వెంకటరెడ్డి, డబల్ రెడ్డి, గూడపు రెడ్డి రమణారెడ్డి, దుగ్గిరెడ్డి జయరెడ్డి, అడవి రెడ్డి, కందుల బ్రదర్స్‌తో పాటు పలువురు మండల రెడ్డి నాయకులు, బెంగుళూరులో నివసిస్తున్న అనేక మంది రెడ్డి బంధువులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.




## సి.ఐ.టి.యు మహాసభలను జయప్రదం చేయండి - పోస్టర్ అవిష్కరించిన నేతలు



**అద్దంకి, డిసెంబరు 7, ప్రభాతవార్త**
సి.ఐ.టి.యు అఖిలభారత 18వ సభలను జయప్రదం చేయాలని సి.ఐ.టి.యు.బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ పిలుపు నిచ్చారు.స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మహాసభల పోస్టర్‌ను సి.ఐ.టి.యు.నేతలు అవిష్కరించారు. సి.ఐ.టి.యు. అఖిల భారత 18వ మహాసభలను విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4 వరకు జరుగాయని ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మజుందార్‌తో పాటు మండల కన్వీనర్ తంగిరాల వెంకటేశ్వర్లు, టి.తిరుపతిరెడ్డి, కమిటీ మండల సభ్యులు జి.శారద, ఉసురుపాటి శామ్యూల్, రావులపల్లి కోటేశ్వరరావు,మున్నంగి కోటేశ్వరరావుపాల్గొన్నారు.

8_8.qxd 12/8/2025 1:15 AM Page 1



# ఎన్నికల హామీని నెరవేర్చిన ఎమ్మెల్యే ఉగ్ర



**కనిగిరి, డిసెంబర్7, ప్రభాతవార్త**

గత 2024 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చుతూ కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలపై కనిగిరి మున్సిపాలిటీ 5వ వార్డుల్లో డ్రైనేజీ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. వార్డులో సంవత్సరాలుగా ఎదురవుతున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఆదివారం ఈ పనులకు మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, తెలుగుదేశం పార్టీ శ్రేణులు శంకుస్థాపన చేశారు. ప్రజలకు ఇబ్బందిగా మారిన కాలువల సమస్యను తొలగించేందుకు ఈ పనులు ఎంతో దోహదం చేస్తాయని నేతలు పేర్కొన్నాడు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, వార్డు ఇన్‌చార్జి రామ సుబ్బారెడ్డి, బేరీ పుల్లారెడ్డి, హెచ్‌ఎంపాడు మండల అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, చెంచిరెడ్డి, మాజీ ఎంపీపీ నంబూల వెంకటేశ్వర్లు, ఏనుగు శ్రీనివాసులురెడ్డి, గొనుగుంట్ల పవన్ కుమార్, చీర్ల మాల్యాద్రి, ప్రతాప్, మోహన మురళి, నాగ పాతూరు, వార్డు కేఎస్ఎస్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. స్థానికులు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ప్రజాహిత నిర్ణయానికి హర్షం వ్యక్తం చేశారు.

# కనిగిరిలో ఆరోగ్య- భద్రత సందేశం

## - పోలీసుల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ విజయవంతం



**కనిగిరి, డిసెంబర్ 7, ప్రభాతవార్త**

ఆరోగ్యవంతమైన జీవనశైలి, రోడ్డు భద్రత, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కనిగిరి పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం సైక్లింగ్ ర్యాలీ నిర్వహించారు. పోలీసు సిబ్బంది, విద్యార్థులు, యువత పాల్గొనడంతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో సీఐ ఉప్పు శ్రీనివాసులు, ఎస్సైలు శ్రీరామ్, మాధవరావు, కోటయ్య పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా పోలీసు అధికారులు పాల్గొన్న వారికి ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యత, హెల్మెట్ ధరించే అలవాటు, వేగ నియంత్రణ, రోడ్డు భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సైక్లింగ్ ఆరోగ్యానికి మేలు చేయడమే కాకుండా కాలుష్యాన్ని తగ్గించడంలో కీలక పాత్ర వహిస్తుందని తెలిపారు. సమాజం ఆరోగ్యవంతంగా భద్రతాయుతంగా ఎదగాలంటే ఇలాంటి సేవా మూలక కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం అవసరమని పోలీసులు సూచించారు. పర్యావరణ పరిరక్షణ, ప్రజా ఆరోగ్యం, ట్రాఫిక్ భద్రతపై సందేశాన్ని అందించిన ఈ సైకిల్ ర్యాలీకి స్థానికంగా మంచి స్పందన లభించింది.

# వధూవరులను ఆశీర్వదించిన దద్దాల మంజు భార్గవి



**కనిగిరి, డిసెంబర్ 7, ప్రభాతవార్త**

కనిగిరి టౌన్ పవిత్ర ఫంక్షన్ హాల్‌లో 2వ వార్డు, ఎన్జీవో కాలనీకి చెందిన షేక్ గౌస్ భాషా- ఆసియా బేగం దంపతుల కుమార్తె వివాహ వేడుక ఆదివారం నిర్వహించారు. కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ తరుపున ఆయన సతీమణి దద్దాల మంజు భార్గవి ఈ కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకలో షేక్ షరీఫ్, దద్దాల రాములు, వంకదారి రాజా, వేల్పుల వెంకట సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



**కంభం, డిసెంబరు 7,ప్రభాతవార్త**

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం రాత్రి కంభం పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు కంభం మండలం చింతకుంట్ల గ్రామానికి చెందిన ఆకాష్ (23) అనే యువకుడు మార్కాపురం నుంచి ద్విచక్ర వాహనంలో కంభం వస్తుండగా పాలిటెక్నికల్ కళాశాల సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. ప్రమాదంలో గాయపడిన ఆకాష్ చింతకుంట్ల మాజీ సర్పంచ్ నాగయ్య కుమారుడిగా తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రశాంతంగా ముగిసిన నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలు

## - మార్కాపురం మండలంలో 1,662 మందిలో 1,588 మంది హాజరు - 74 మంది గైర్హాజరు




**మార్కాపురం, డిసెంబర్ 7, ప్రభాతవార్త**

మార్కాపురం కేంద్రంగా ఏర్పాటు చేసిన ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 1,662 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 1,588 మంది పరీక్ష రాయగా 74 మంది గైర్హాజరైనట్లు ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్‌లు మరియు డిపార్ట్‌మెంట్ అధికారులు వెల్లడించారు.ప్రభుత్వ మరియు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇవ్వబడే మెరిట్ స్కాలర్‌షిప్ కోసం దేశవ్యాప్తంగా నిర్వహించే ఈ పరీక్షలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు సంవత్సరానికి రూ.24వేల చొప్పున స్కాలర్‌షిప్ అందించే విషయం తెలిసిందే. మార్కాపురం ప్రాంతంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలు : జిల్లా బాలుర ఉన్నత పాఠశాల (2 సెంటర్లు), జిల్లా బాలికల ఉన్నత పాఠశాల, మున్సిపల్ పాఠశాల-పీఎస్ కాలనీ, ఎస్‌సి-బీసి కాలనీ పాఠశాల, ట్రైబల్ గురుకుల పాఠశాల, రాయవరం జెడ్‌పీ ఉన్నత పాఠశాల, సామాజిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలలో పరీక్షలు జరిగాయి. ఈ కేంద్రాల్లో వై సైమన్, యస్ బాస్కర్ రెడ్డి, యస్ నాగేశ్వరరావు, జె నాగయ్య, వి శ్రీదేవి, డి వెంకట రెడ్డి, వై.శ్రీనివాస్,ఆనంద్‌బాబు,డి రామాంజనేయ రెడ్డి, శ్యామ్ సుభాకర్, యస్ రసూల్, మునీర్‌బాషా, టి.రామకృష్ణ, కె. ప్రవీణ్ కుమార్, యం సుధాకర్, జి వెంకటేశ్వర్లు పరీక్ష నిర్వహణ బాధ్యతలుచీఫ్‌లు మరియు డిపార్ట్మెంటల్ అధికారులుగా బాధ్యతలు నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులైన కెశర్వాణి, యస్. సుబ్రహ్మణ్యం తదితరులు పరీక్షల పరిశీలకులు గా విధులు నిర్వర్తించారు.

# వై డీ పాడులో జిబిఆర్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

## - 180 మందికి పైగా రోగులకు సేవలు



**పెద్దారవీడు, డిసెంబరు 7, ప్రభాతవార్త**

ఎనుగులదిన్నెపాడు గ్రామంలో ఆంజనేయ స్వామి గుడి ఎదుట జిబిఆర్ హాస్పటల్ (గజ్జల) ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరం గ్రామస్తుల నుండి విశేష స్పందనను పొందింది. గ్రామ సర్పంచ్ బలుసుపాటి లూధియా నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి ఉదయం నుంచే స్థానికులు విస్తృతంగా హాజరయ్యారు. డాక్టర్లు గోపు కిరణ్ కుమార్ రెడ్డి, బాబ్జీ పాల్గొని వివిధ ఆరోగ్య సమస్యలపై ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.ముఖ్యంగా మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, నడుము నొప్పులు వంటి ఎముకలకీళ్ల సమస్యలపై ప్రత్యేక వైద్య పరీక్షలు జరిపారు. అలాగే బిపి, షుగర్, వైరల్ ఫీవర్ వంటి సాధారణ వ్యాధులకు కూడా పరీక్షలు చేసి తగిన శాస్త్రీయ సూచనలు అందించారు.ఈ శిబిరంలో మొత్తం 180 మందికి పైగా రోగులను పరీక్షి ంచినట్లు నిర్వాహకులు తెలిపారు. పరీక్షి ంచుకున్న ప్రతి రోగికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై ఈ సేవలను వినియోగించుకోవడం శిబిరానికి విశేష ప్రాచుర్యం కలిగించింది. జనసేవ ధ్యేయంగా ఇలాంటి ఆరోగ్య శిబిరాలను భవిష్యత్తులో కూడా కొనసాగించాలన్న సంకల్పాన్ని వైద్య బృందం వెల్లడించింది.

# మార్కాపురం జిల్లాలో దర్శి చేర్పు కోసం సంతకాల ఉద్యమం

## - 8వ తేదీ నుంచి ప్రారంభం







**మార్కాపురం, డిసెంబర్ 7,ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లాలో దర్శి నియోజకవర్గాన్ని కలపాలని కోరుతూ మార్కాపురం జిల్లా విద్యావంతుల మరియు మేధావంతుల వేదిక ఆధ్వర్యంలో సంతకాల ఉద్యమం ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభం కానుందని మేధావి వర్గం వేదిక నుంచి ఒరుగంటి మల్లిక్, డా అన్నపురెడ్డి వీరారెడ్డి, ఈద చెన్నయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. మార్కాపురం ప్రెస్ క్లబ్ ఎదుట ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రజాసంఘాల తరఫున వినతిపత్రాలు సబ్ కలెక్టర్‌కి అందజేయబడనున్నాయి. తరువాత అంబేద్కర్, మహాత్మా గాంధీ, పొట్టిశ్రీరాములు విగ్రహాల వద్ద ప్రతినిధుల ద్వారా వినపత్రాలు సమర్పించనున్నారు. దేవాలయాలు, చర్చిలు, మసీదులు వంటి ఆధ్యాత్మిక క్షేత్రాలలో కూడా వినతిపత్రాల సమర్పణ కార్యక్రమం నిర్వహించబడుతుంది. సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అలాగే సోషల్ మీడియా కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. అనంతరం ప్రెస్ క్లబ్‌లో పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేయబడుతుంది.

# పొదిలి ఫీల్డ్ పాస్టర్లకు దుస్తులు పంపిణీ



**కొనకనమిట్ల, డిసెంబర్ 7, ప్రభాతవార్త**

పొదిలి సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి కమ్యూనిటీ హాల్‌లో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముందస్తుగా 35 మంది ఫీల్డ్ పాస్టర్లకు ఏబీఎం పాఠశాల కరస్పాండెంట్ జీపీ జోసెఫ్ ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొదిలి ఫీల్డ్ కౌన్సిల్ జీసీ రెవ డాక్టర్ జి.కిషోర్ కుమార్, చర్చి అధ్యక్షుడు పేరికే జ్ఞానసుందరరావు, సీటీబీసీ సంఘ కాపరి రెవ టి.జాన్ విక్టర్, సహాయ కాపరి రెవ డాక్టర్ జి.సురేష్ కుమార్, పొదిలి ఫీల్డ్ పాస్టర్లు పాల్గొన్నారు.

# శ్రీశైలం మల్లన్న బంగారు రథోత్సవంలో పాల్గొన్న దేవకి

## - ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శివునికి విశేష పూజలు





**కనిగిరి, డిసెంబర్ 7, ప్రభాతవార్త**

శివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం రోజు ఆదివారం ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీశైలం శ్రీ భ్రమరాంబికా సమేత మల్లిఖార్జునస్వామి వారికి ఆలయ వేద పండితులు విశేష పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, అన్నాభిషేకం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ విశేష పూజల్లో శ్రీశైలం ట్రస్టు బోర్డు మెంబర్‌లు, వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు, ఏవీ రమణ, వేమిరెడ్డి కోటారెడ్డి పాల్గొన్నారు. అభిషేకం అనంతరం స్వర్ణ రథంపై శ్రీ భ్రమరాంబిక సమేత మల్లిఖార్జున స్వామి వారిని మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవకి మాట్లాడుతూ శివుని జన్మ నక్షత్రమైన ప్రతి నెల వచ్చే ఆరుద్ర నక్షత్రం రోజున మల్లిఖార్జునస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వర్ణ రథంపై ఊరేగిస్తారని అన్నాడు. మార్గశిర మాసంలో వచ్చే ఆరుద్ర నక్షత్రం శివునికి ఎంతో ప్రీతిపాత్రమైందని అందువలన ఈ రోజున నాగ సాధువులు కూడా పాల్గొన్నాని దేవకి తెలిపారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

# చింతకుంట్లలో టీడీపీ నాయకులు సంబరాలు

## - సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే కందుల ఫ్లెక్సీలకు పాలాభిషేకం



**కొనకనమిట్ల, డిసెంబర్ 7, ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లాగా ప్రకటించడం పట్ల చింతగుంట గ్రామంలో టీడీపీ నాయకులు ఆదివారం రాత్రి సంబరాలు జరుపుకున్నారు. జిల్లా ఏర్పాటు చేస్తానని హామీని నెరవేర్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ మూరబోయిన బాబురావు మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాన్ని జిల్లాగా ఏర్పాటు చేయడం, నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని అన్నారు. ఏర్పాటు చేయడం హర్షణీయమని సీఎం,ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కృషిని కొనియాడారు. గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు సీఎం,ఎమ్మెల్యే కందుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తూ హర్షధ్వానాలతో కేరింతలు కొడుతూ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలుగొండ ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కుందురు కాశిరెడ్డి,తెలుగు యువత నియోజకవర్గ నాయకులు ముప్వా కాటంరాజు,నాయకులు వి.శ్రీకాంత్‌రెడ్డి, ఏ.రోశయ్య, వేల్పుల తిరుపతయ్య, ఏడుకొండలు, శ్రీను, రాగి పాపయ్య, వై.గురవయ్య, పెద్ద నారాయణ, మహేష్, చేతరాసి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మార్కాపురం జిల్లా అభివృద్ధి మా లక్ష్యం : ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి




**మార్కాపురం, డిసెంబరు 7, ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లాను ప్రకటించినందుకు కృతజ్ఞతగా ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో 10, 11వ వార్డుల్లో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఏర్పాటు పేదల జీవితాల్లో వెలుగు నింపే నిర్ణయమని, మార్కాపురం ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గత ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని నిరక్ష ్యం చేసిందని విమర్శించారు. వెలుగొండ రెండో టన్నెల్ సాధన కోసం తాను పోరాడిన విషయాన్ని గుర్తుచేశారు.జిల్లా ఏర్పాటుతో ప్రభుత్వ కార్యాలయాలు, ఉద్యోగ అవకాశాలు, వైద్య సేవలు మరింత మెరుగవుతాయని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మార్కాపురం జిల్లాను అభివృద్ధి చేసి చూపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళలు ఎమ్మెల్యే గారికి పూలవర్షంతో స్వాగతం పలికారు. ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

# కనిగిరిలో ఆధ్యాత్మిక వేడుక

## - శ్రీషిర్డీ సాయి మహాసమాధి పుస్తకావిష్కరణ - పారాయణ మహాయజ్ఞం పూర్ణాహుతి





**కనిగిరి, డిసెంబర్ 7, ప్రభాతవార్త**

కనిగిరిలో ఆదివారం సాయి సశ్చరిత్ర పారాయణ మహాయజ్ఞం పూర్ణాహుతి ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. ముక్కు కాశిరెడ్డి స్వగృహంలో గురు మాతాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యజ్ఞంలో కాశిరెడ్డి కుటుంబ సభ్యులు హోమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులు సాయి పారాయణం చేసి హోమద్రవ్యాలు సమర్పించారు. కార్యక్రమంలో శ్రీషిర్డీ సాయి మహాసమాధి పుస్తకాన్ని గురు విశుద్దానంత భారతిమా ఆవిష్కరించారు. ఈ గ్రంధాన్ని విజయ కిషోర్ రచించగా, సద్గురు సాయి సేవా సమితి అధ్యక్షులు దేవకి సుబ్రహ్మణ్యం, ముచ్చర్ల ధర్మరావు ప్రచురించారు.పూర్ణాహుతి కార్యక్రమాని కి శుద్ద చైతన్యానంద స్వామి,మానుగుంట మహీధర్‌రెడ్డి, కేటీఆర్ విద్యాసంస్థల చైర్మన్ కుందురు తిరుపతిరెడ్డి, సాయిబాబా దేవస్థానం అధ్యక్షులుకొప్పరపు సత్యాలు,మడతల కస్తూరిరెడ్డి , గాయం బలరాంరెడ్డి దంపతులు, సింగరాజు మాలకొండేశ్వరరావు, నాగేశ్వరరెడ్డి, అంకయ్య స్వామి,బ్రహ్మయ్య స్వామి తదితరులు హాజరయ్యారు. మాతాజీ అనంతరం సత్సంగ నిర్వహించగా భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

# సేవాస్ఫూర్తికి శిరస్సు వంచిన ప్రజలు

## - వైభవంగా స్వర్గీయ మాజీ కేంద్ర మంత్రి పులి వెంకటరెడ్డి వర్ధంతి వేడుకలు





**కనిగిరి, డిసెంబర్ 7, ప్రభాతవార్త**

ప్రజాహితం కోసం జీవితాంతం శ్రమించిన మాజీ కేంద్ర మంత్రి స్వర్గీయ పులి వెంకటరెడ్డి26వ వర్ధంతి వేడుకలు ఆదివారం కనిగిరిలో వైభవంగా నిర్వహించారు. స్థానిక పులి వెంకటరెడ్డి పార్కులో ఏర్పాటు చేసిన క్యాక్రమంలో కుటుంబ సభ్యులు, శ్రేయోభి లాషులు, అభిమానులు, భారత్ గ్యాస్ సిబ్బంది పాల్గొని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. 1933 జులై 19న జన్మించిన పులి వెంకటరెడ్డి రాజకీయ రంగంలో ప్రజల కోసం అంకితంగా పని చేసిన అభ్యుదయవాది. 1959-62 వెలిగండ్ల సమితి ప్రెసిడెంట్, 1962-67 ఉదయగిరి ఎమ్మెల్యే, 1967-71 కనిగిరి ఎమ్మెల్యే, 1971-77 కావలి ఎంపీ, 1977-80, 1980-84 ఒంగోలు ఎంపీగా సేవలందించారు. ఈ ప్రయాణంలో ఆయన కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా కూడా కీలక బాధ్యతలు నిర్వహించి కార్మిక వర్గ సంక్షేమానికి పలు అభివృద్ధి చర్యలు చేపట్టారు. వర్ధంతి కార్యక్రమంలో భాగంగా పులిలక్ష్మీ, పులి శాంతి (మున్సిపల్ వైస్ చైర్మన్ అండ్ వైఎస్సార్‌సీపీ కనిగిరి మహిళా అధ్యక్షురాలు),ఎస్‌వి గోవర్ధన్‌రెడ్డి(వైఎస్సార్‌సీపీ కనిగిరి మున్సిపల్ విభాగం అధ్యక్షుడు), పులి నాగేంద్ర, షేక్ పాచ్చు, షేక్ సందాని, భారత్ గ్యాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. నాయకత్వం, నిబద్ధత, సేవా దృక్పథానికి ప్రతీకగా నిలిచిన పులి వెంకటరెడ్డి జీవితం ప్రతి తరానికి మార్గదర్శకమని పాల్గొన్న వారు పేర్కొన్నారు.

8-12Pg5FF 9_8-12Pg5FF.qxd 07/Dec/25 11:13 PM Page 1



# 'వందేమాతరా'నికి 150యేళ్లు

## నేడు లోక్‌సభలో ప్రత్యేక చర్చ, పాల్గొననున్న ప్రధాని మోడీ
## రేపు రాజ్యసభలో చర్చించనున్న సభ్యులు
## 'సర్'పై కూడా రేపు దిగువ సభలో విస్తృత చర్చ

**న్యూఢిల్లీ, డిసెంబరు 7:** 'వందేమాతరం' 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరుగనుంది. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఈ చర్చను ప్రారంభిం చనున్నారు. దేశభక్తి గీతానాకి సంబంధించిన అనేక అంశాలను మోడీ ప్రస్తావించనున్నారు.



బంకిం చంద్ర చటర్జీ రాసిన 'వందేమాతరం' గీతం 1875 నవంబరు 7న సాహిత్య పత్రిక బంగదర్శన్‌లో మొదటగా ప్రచురించబడింది.

ఇది స్వాతంత్ర్య పోరాటానికి చేసిన కృషి, దాని చారిత్రక ప్రాముఖ్యత, ప్రస్తుత ఔచిత్యాన్ని కూడా ప్రధాని మోడీ తన ప్రసంగంలో ప్రధానంగా ప్రస్తావించే అవకాశముంది. రాజ్యసభలో వందేమాతరంపై చర్చను మంగళవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించే అవకాశముంది. వందేమాతరం చర్చకు సంబంధించిన షెడ్యూల్ ప్రకారం లోక్‌సభలో మొత్తం 10 గంటల్లో ఎన్‌డిఏ సభ్యులకు మూడు గంటలు కేటాయించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు ముందుకు రాజ్యసభ సెక్రటేరియట్ పార్లమెంటు లోపల 'వందేమాతరం', జైహింద్ వంటి వ్యక్తీకరణలను ఉపయోగించకుండా ఉండాలన్న నోట్‌పై అధికార, విపక్ష సభ్యుల మధ్య రాజకీయ ఘర్షణ చోటుచేసుకుంది. అలాగే ఇటీవల ప్రధాని మోడీ, వందే మాతరం గీతానికి సంబంధించిన కాంగ్రెస్‌పై ఆరోపణలు గుప్పించారు. ప్రధానమంత్రి 1937లో ఫైజాబాద్‌లో జరిగిన పార్టీ సమావేశంలో కాంగ్రెస్ అసలు పాట నుండి ముఖ్యమైన చరణాలను తొలగించిందని మోడీ ఆరోపించారు. కాంగ్రెస్ నిర్ణయం విభజనకు బీజాలు నాటిందని, జాతీయ గీతాన్ని ముక్కలుగా చేసిందని ప్రధాని మోడీ తీవ్ర ఆరోపణలు చేశారు. అయితే, ఈ నిర్ణయం రవీంద్రనాథ్ ఠాగూర్ సలహా మేరకు జరిగిందని, ఇతర వర్గాలు, విశ్వాసాల సభ్యుల భావాలను కాంగ్రెస్ గౌరవించింది, గౌరవిస్తోందని ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోడీ ఆరోపణలు తిప్పికొట్టారు. ఈ నేపథ్యంలో 'వందేమాతరం'పై పార్లమెంట్‌లో ప్రత్యేక చర్చపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



# సరిహద్దు రహదారులు.. జాతీయ భద్రతకు జీవనాధారాలు

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**లేహ్, డిసెంబరు 7:** 'సరిహద్దు రహదారులు.. జాతీయ జీవనాధారాలు' అని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. అత్యవసర సమయాల్లో సత్వరం స్పందించేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. దేశవ్యాప్తంగా కీలక ప్రాంతాల్లో రూ. 5,000 కోట్లతో బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్ఓ) నిర్మించిన 125 ప్రాజెక్టులను ఆదివారం ఆయన జాతికి అంకితం చేశారు. సరిహద్దుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పడానికి ఈ ప్రాజెక్టులే ఉదాహరణలని అన్నారు. కేంద్ర పాలిత ప్రాంతాలైన లద్దాఖ్, జమ్మూ, కశ్మీర్‌తోపాటు సరిహద్దు రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, మిజోరంలలో వ్యూహాత్మకంగా 28 రహదారులు, 93 వంతెనలు, మరో నాలుగు ఇతర ప్రాజెక్టులను బిఆర్‌ఒ నిర్మించింది. ప్రాజెక్టుల ప్రారంభోత్సవం సందర్భంగా జమ్మూ కాశ్మీర్‌లోని లేహ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు. మన సైనికుల శౌర్యం,ధైర్యం మనందికీ స్ఫూర్తి అని, దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన వీరులకు ఈ ప్రాజెక్టులు అంకితమని అన్నారు. రోడ్డు నెట్‌వర్క్, రియల్‌టైమ్ కమ్యూనికేషన్, ఉపగ్రహ ఆధారిత నిఘా వంటి సౌకర్యాలు మన సైనికులు మరింత వేగంగా, సమర్థంగా పని చేసేందుకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌కు అనుగుణంగా నూతన సాంకేతికను వినియోగించి, సకాలంలో ప్రాజెక్టులను పూర్తి చేసినందుకు 'బీఆర్ఓ'ను రాజ్‌నాథ్‌సింగ్ అభినందించారు. సాయుధ బలగాలతోపాటు బీఆర్ఓ సిబ్బంది, సరిహద్దు ప్రాంతాల పౌరులు జాతీయ భద్రతలో భాగస్వాములవుతున్నారని కితాబిచ్చారు. ఇదే స్ఫూర్తి కొనసాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా లద్దాఖ్‌లోని దర్బుక్-శ్యోక్-దౌలత్ బేగ్ ఓల్డీ మధ్య 920మీటర్ల పొడవున నిర్మించిన సొరంగం గురించి రాజ్‌నాథ్‌సింగ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇదో ఇంజినీరింగ్ అద్భుతమని కొనియాడారు. వాతావరణపరంగా ఎలాంటి క్లిష్టపరిస్థితులు ఎదురైనా రవాణాకు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా దీనిని నిర్మించినట్లు చెప్పారు. అంతేకాకుండా హిమపాతాల సమయంలోనూ సైన్యం ఆయుధాలు రవాణా చేసేందుకు ఇదివ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందన్నారు.



# బాబ్రీ తరహా మసీదు నిర్మాణానికి బెంగాల్‌లో శంకుస్థాపన

**ముర్షిదాబాద్,డిసెంబరు 7:** టీఎంసీనుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్యే హుమయూన్ కబీర్ ముర్షీదాబాద్‌లో బాబ్రీ మసీదు తరహాలో కట్టడం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బెంగాల్‌లో బాబ్రీ మసీదు శంకుస్థాపన వ్యవహారంపై బీజేపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. పశ్చిమబెంగాల్ ప్రభుత్వం పోలరైజేషన్‌కు పాల్పడుతోందని, బాబర్ పేరుతో ఎలాంటి కట్టడాన్నయినా భారత్ వ్యతిరేకిస్తుందని అన్నారు. అయితే బీజేపీ వాదనను హుమయూన్ కబీర్ తోసిపుచ్చారు. మసీదు నిర్మాణం తన హక్కు అని, తాము రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఏమీ చేయడం లేదని చెప్పారు. ఎవరైనా మందిరం, చర్చి నిర్మించుకోవచ్చని, తాను మసీదు నిర్మిస్తున్నానని చెప్పారు. రూ.300 కోట్ల అంచనా వ్యయంతో ఈ నిర్మాణం చేపడతామని, అందులో ఒక ఆసుపత్రి, గెస్ట్ హౌస్, మీటింగ్ హాల్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అదేవిధంగా గ్రేటర్ హైదరాబాద్‌లో కూడా బాబ్రీ మసీదు రెప్లికాను నిర్మిస్తామని అందులో పలు సంక్షేమసంస్థలు కూడా ఉంటాయని ముస్లిం సంస్థ ఒకటి ప్రకటించింది. ఎప్పుడు, ఎక్కడ, ఎలా నిర్మింస్తామన్న వివరాలు త్వరలోనే ప్రకటిస్తామని సంస్థప్రతినిధి తెలిపారు.

# పనివేళలు ముగిసాక.. ఆఫీస్ కాల్స్ స్పందించకుండా ఉండేందుకు ప్రైవేటు బిల్లు

## లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఎన్సీపీ పవార్ ఎంపి సుప్రీయా సూలే

**న్యూఢిల్లీ, డిసెంబరు 7:** ఉద్యోగుల పనిభారాన్ని తగ్గించి, వారికి మెరుగైన జీవితాన్ని అందించే లక్ష్యంతో లోక్‌సభలో ఒక కొత్త ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టారు. పనివేళలు ముగిసిన తర్వాత, సెలవు రోజుల్లో వచ్చే ఆఫీస్ ఫోన్ కాల్స్, ఈమెయిల్స్‌కు స్పందించకుండా ఉండే హక్కును ఉద్యోగులకు చట్టబద్ధంగా కల్పించాలనేది ఈ బిల్లు ప్రతిపాదన. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్‌చంద్ర పవార్) ఎంపీ సుప్రియా సూలే లోక్‌సభలో రైట్ టు డిస్‌కనెక్ట్ బిల్లు, 2025ను ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం ఉద్యోగుల హక్కులను పరిరక్షించేందుకు



ప్రత్యేకంగా ఒక ఉద్యోగుల సంక్షేమ అథారిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. డిజిటల్ యుగంలో పెరిగిపోతున్న పని ఒత్తిడిని తగ్గించి, ఉద్యోగులకు మెరుగైన పనిజీవిత సమతుల్యతను కల్పించడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని సుప్రియా సూలే తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పేర్కొన్నారు. ఇదే తరహాలో కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కూడా ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి మరో ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టారు. భారతదేశంలో 51 శాతం మంది ఉద్యోగులు వారానికి 49 గంటలకు పైగా పనిచేస్తున్నారని, 78 శాతం మంది తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పని గంటలను పరిమితం చేయడం, మానసిక ఆరోగ్యానికి మద్దతు వ్యవస్థలను ఏర్పాటు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన పని వాతావరణాన్ని సృష్టించాలని ఆయన తన బిల్లు ద్వారా కోరారు. అయితే, ఈ బిల్లులు ప్రైవేట్ మెంబర్ బిల్లులు కావడం గమనార్హం. మంత్రులు కాకుండా ఇతర ఎంపీలు ప్రవేశపెట్టే బిల్లులను ప్రైవేట్ మెంబర్ బిల్లులు అంటారు. సాధారణంగా పార్లమెంటులో ఇలాంటి బిల్లులు చట్టరూపం దాల్చడం చాలా అరుదు. ప్రభుత్వం ఇచ్చే సమాధానం తర్వాత చాలావరకు వీటిని ఉపసంహరించుకుంటారు.



# మొసాద్‌కు కొత్తచీఫ్ రోమన్ గోఫ్‌మాన్

**జెరూసలెం, డిసెంబరు 7:**ప్రపంచంలోనే అత్యంత భయంకరమైన నిఘా సంస్థ ఇజ్రాయెల్ మొసాద్‌కు కొత్తచీఫ్ వచ్చారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు గతనెల 4న తన సైనిక కార్యదర్శిని ఆదేశ నిఘా సంస్థ మొసద్ తదుపరి అధిపతిగా ఎంపికచేసారు. ఈ కొత్త అధిపతి ఎప్పుడూ నిఘా విబాగంలో లేరు. ఆయనకు ఎలాంటి నిఘా నేపథ్యంకూడా లేదు. ఈ అధిపతిపేరు మేజర్‌జనరల్ రోమన్ గోఫ్‌మాన్. గూఢచారిసంస్థ మొస్సాద్ అధిపతిగా గోఫ్‌మన్‌ను నియమించాలనే నిర్ణయాన్ని ఇజ్రాయెల్ పిఎంఒ ప్రకటించింది. ప్రస్తుత మొసాద్‌చీఫ్ డేవిడ్ బార్నియా స్థానంలో ఆయనను నియమిస్తారని వెల్లడించారు. డేవిడ్ బార్నియా ఐదేళ్ల ఎదవీకాలం జూన్ 2026లో ముగుస్తుంది. మొసాద్‌చీఫ్‌గా గోఫ్‌మన్‌పేరు ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఇజ్రాయెల్‌సైన్యం దక్షిణ లెబనాన్‌లోని హిజ్బుల్లా ఆయుధనిల్వ స్థావరాలపైదాడులుచేసింది. బెలారస్‌లో 1976 లో జన్మించిన గోఫ్‌మన్ 14 ఏళ్ల వయసలో ఇజ్రాయెల్ వచ్చాడు. తర్వాత 1995లో ఇజ్రాయెల్‌సైన్యం ఆర్మర్డ్ కార్ప్సులో చేరి సుదీర్ఘకాలంగా సైనిక జీవితం కొనసాగిస్తున్నారు. 2023 అక్టోబరు ఏడున ఇజ్రాయెల్‌పై హమాస్‌దాడి షురు చేసినపుడు గోఫ్‌మన్ ఇజ్రాయెల్ జాతీయ పదాతిదళ శిక్షణాకేంద్రం కమాండర్‌గా ఉన్నారు. గాజా సరిహద్దుకు సమీపంలోని దక్షిణ ఇజ్రాయెల్‌నగరమైన స్టెరోట్‌లో హమాస్ ఉగ్రవాదులతోజరిగిన ఘర్షణలో తీవ్రగాయాలపాలయ్యారు. తర్వాత ఏప్రిల్ 2024లో నెతన్యాహు మంత్రివర్గంలో చేరారు. ఇజ్రాయెల్‌మజత జియోనిస్ట్ ఉద్యమ సభ్యుడు డేవిడ్‌ఋ దేశీయభద్రతా సంస్థకు అధిపతిగా నియమించారు. నెతన్యాహు మరో సారి జాతీయవాద అభిప్రాయాలకు దగ్గరగా ఉండే వ్యక్తినే ఇజ్రాయెల్ యొక్క అతిపెద్ద నిఘా సంస్థకు అధిపతిగా నియమించుకున్నారు.

# కోల్‌కతాలో సామూహిక గీతా పారాయణం: లక్షలాది మంది హాజరు

**కోల్‌కతా, డిసెంబరు 7:** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా ఆదివారం శ్రీకృష్ణ నామస్మరణ, శంఖ నాదాలతో మార్మోగింది. చారిత్రక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సామూహిక గీతా పారాయణానికి లక్షలాది మంది హాజరయ్యారు. 'సనాతన సంస్కృతి సంసద్' అనే సంస్థ 'ఐదు లక్షల స్వరాలతో గీతా పారాయణం' పేరిట ఈ భారీ కార్యక్రమాన్ని నిర్వహించింది. బెంగాల్‌తో పాటు పరిసర రాష్ట్రాల ప్రజలు, వివిధ మఠాలకు చెందిన సాధువులు తదితరులు పెద్దఎత్తున తరలివచ్చారు. దేశంలోనే ఇది అతిపెద్ద సామూహిక గీతా పారాయణమని భావిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్ సివి ఆనందబోస్, కేంద్రమంత్రి సుకాంత మజుందార్ తదితరులు పాల్గొని భగవద్గీత శ్లోకాలు పఠించారు. తర్వాత శాంతి, అహింసల గురించి



మాట్లాడారు. రాష్ట్ర ఆధ్యాత్మిక వారసత్వాన్ని మరోసారి గుర్తు చేసేందుకు, పవిత్ర గ్రంథాల ద్వారా సామాజిక సామరస్యాన్ని ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రద్దీ నిర్వహణ, భద్రత, అత్యవసర వైద్యసేవల కోసం విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి 6.5 లక్షల మందికిపైగా హాజరైనట్లు బిజెపి ప్రతినిధి అమిత్ మాలవీయ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

# మళ్లీ బద్దలయిన కిలవేయ అగ్నిపర్వతం



**హవాయి, డిసెంబరు 7:** అగ్రరాజ్యం అమెరికాకు చెందిన హవాయి ద్వీపంలో అత్యంత క్రియాశీల అగ్నిపర్వతాల్లో ఒకటైన కిలవేయ మరోసారి విస్ఫోటనం చెందింది. అగ్నిపర్వతం నుంచి పెద్ద ఎత్తున లావా ఉబికివస్తోంది. వెయ్యి అడుగుల ఎత్తు వరకు ఎగసిపడుతోంది. అమెరికా కాలమానం ప్రకారం శనివారం ఉదయం అగ్నిపర్వతం బద్దలైనట్లు అధికారులు తెలిపారు. హవాయి జాతీయ ఉద్యానవనం లోపల ఉన్న కాల్డెరాలోనే లావా నిలిచి పోయిందని స్పష్టం చేశారు. అయినప్పటికీ పరిస్థితిని ఎప్పటికప్పుడు వర్యవేక్షిన్నన్నామని చెప్పారు. గత ఏడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు కిలవేయ అగ్నిపర్వతం 38 సార్లు విస్ఫోటనం చెందింది.

# గోవా నైట్‌క్లబ్‌లో అగ్నిప్రమాదం

## 25కు చేరిన మృతుల సంఖ్య
## రాష్ట్రపతి, ప్రధాని మోడీ దిగ్భ్రాంతి
## ఒక్కొక్కరికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా
## ప్రమాదం కాదు మర్డర్: రాహుల్‌గాంధీ





**పనాజీ, డిసెంబరు 7:** గోవాలో ఓ నైట్‌క్లబ్‌లో చెలరేగిన అగ్నికీలల్లో నలుగురు పర్యాటకులు, 14 మంది సిబ్బందితో సహా 25 మంది మృతి చెందారు. శనివారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ అగ్నిప్రమాదంలో భారీగా ఆస్తినష్టం సంభవించింది. గోవా రాజధాని పనాజీకి 25కిలోమీటర్ల దూరంలోని అర్పోరా గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ తెలిపారు. ఉదయం ఘటనా స్థలాన్ని సందర్శించిన బాధితులను పరామర్శించారు. నైట్‌క్లబ్ మేనేజర్‌ను అరెస్టు చేశారని, యజమానిపై అరెస్ట్ వారెంట్ జారీ అయ్యిందని, ఘటనపై మెజిస్ట్రీరియల్ విచారణకు ఆదేశించినట్లు సిఎం ప్రమోద్ సావంత్ తెలిపారు. గవర్నర్ పి.అశోక్ గజపతిరాజు ఆదివారం ఉదయం ఆస్పత్రిని సందర్శించి క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం, మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులు సత్వరమే కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. సిఎం ప్రమోద్ సావంత్‌కు ప్రధాని మోడీ ఫోన్ చేసి, ఘటనపై ఆరా తీశారు.

గోవా నైట్‌క్లబ్ ప్రమాదంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్రంగా స్పందించారు. దీనిని 'భద్రతా పరంగా నేరపూరిత వైఫల్యం' అని అభివర్ణించారు. ఈ విషాద ఘటన 'ప్రమాదం కాదు, హత్య' అని నొక్కిచెప్పారు. సమగ్ర దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు.



# జనవరిలో భారత్‌కు జెలెన్‌స్కీ

## ఆయన న్యూఢిల్లీ పర్యటనపై ప్రపంచ దేశాల ఆసక్తి

**న్యూఢిల్లీ, డిసెంబరు 7:** ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ జనవరిలో భారత్ పర్యటనకు వస్తున్నారు. అయితే, తేదీలపై ఇంకా అధికారిక ప్రకటన విడుదల కావలసి ఉంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డిసెంబర్ 4-5తేదీల్లో న్యూఢిల్లీ పర్యటనను ముగించుకొని వెళ్లారు. ఈ నేపథ్యంలోనే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పర్యటనపై ప్రపంచ దేశాలు ఆసక్తి నెలకొంది. భారత విదేశాంగ అధికారుల కథనం ప్రకారం, రాబోయే జనవరిలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ భారత్ సందర్శనను షెడ్యూల్ చేయడానికి చర్యలు తీసుకుంటోంది. తాజాగా రష్యా అధ్యక్షుడు పుతిన్ వచ్చి వెళ్లినందున, ఉక్రెయిన్ అధ్యక్షుడి పర్యటనకు సంబంధించి షెడ్యూల్ ఖరారుపై భారత విదేశాంగ శాఖ జెలెన్‌స్కీ కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు అధికార వర్గాలు వివరించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శాంతి ప్రణాళిక ప్రకటించిన నేపథ్యంలో ఇరుదేశాల అధినేతలు భారత్ పర్యటనపై ప్రపంచ దేశాలు ఆసక్తి కనబరచడం విశేషం.


## సంక్షిప్తంగా..

### రూ.8వేల చిరుద్యోగికి రూ.13 కోట్ల జిఎస్టీ బకాయి నోటీసులు



**చెన్నై, డిసెంబరు 7:** నెలకు రూ.8వేల జీతానికి పనిచేసే ఓమహిళకు రూ.13 కోట్ల జీఎస్టీ బకాయిలు చెల్లించాలంటూ నోటీసులు రావడం తమిళనాడులో కలకలంరేపింది. చిరుద్యోగినైన తనకు జీఎస్టీ నోటీసులు రావడం. అది కూడా ఏకంగా 13కోట్లు కట్టాలని అందులో పేర్కొనడంతో సదరు మహిళ నివ్వెరపోయింది. జీతం డబ్బులు విత్ డ్రా చేసుకోవడానికి వెళ్లినపుడు ఈ విషయం బయటపడింది. తమిళనాడులోని వెల్లూర్‌జిల్లాలో చోటుచేసుకుంది ఘటన. వెల్లూర్ జిల్లాలోని గుడియతమ్ ఏరియాలోని నగల్ ప్రాంతానికి చెందిన మహాలింగం కార్ డ్రైవర్ ఆయన భార్య యశోద ప్రైవేట్ షూ కంపెనీలో పనిచేస్తోంది. షూ కంపెనీనుంచి నెలకు రూ.8వేలు జీతంగా అందుకుంటోంది. ఇటీవల జీతం డబ్బులు డ్రాచేసుకోవడానికి బ్యాంకుకు వెళ్లగా ఆమె ఖాతాఫ్రీజ్ అయినట్లు అధికారులు తెలిపారు. ఏం జరిగిందని ఆరా తీయగా యశోద జీఎస్టీ బకాయిపడిందని తేలింది.

### చిరుతపులి దాడిలో ఐదేళ్ల బాలుడి మృతి




**కోయంబత్తూరు, డిసెంబరు 7:** తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా వాల్పారైలోని తేయాకు తోటలో చిరుతపులి దాడిలో ఐదేళ్ల బాలుడు మృతి చెందాడు. గత ఎనిమిది నెలల్లో ఈ ప్రాంతంలో చిరుత దాడిలో చిన్నారులు మరణించడం ఇది మూడోసారి కావడంతో స్థానికంగా తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, అటవీ శాఖ అధికారుల వివరాల ప్రకారం వాల్పారైలోని అయ్యర్పాడి తేయాకు ఎస్టేట్‌లో పనిచేస్తున్న అస్సాం వలస కార్మికుడి కుమారుడైన సైఫుల్ (5) తన ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో సమీపంలోని తేయాకు పొదల నుంచి ఆకస్మాత్తుగా దూసుకొచ్చిన చిరుతపులి బాలుడిని పట్టుకుని తోటలోకి లాక్కెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న తోట కార్మికులు, అటవీ శాఖ సిబ్బంది వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. కాసేపటి తర్వాత తోట లోపలి భాగంలో సైఫుల్ మృతదేహాన్ని గుర్తించారు. చిరుత దాడి చేసిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపించాయి.

### మైనర్‌పై అత్యాచారం కేసు: న్యూజిలాండ్‌లో భారతీయుడికి ఏడేళ్ల జైలు



**వెల్లింగ్టన్, డిసెంబరు 7:** న్యూజిలాండ్‌లో భారత సంతతికి చెందిన సత్వీందర్ సింగ్ అనే క్యాబ్ డ్రైవర్‌కు ఏడేళ్ల జైలుశిక్ష పడింది. ఇతడు 2023లో ఓ మైనర్‌పై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ ఆరోపణలు రుజువు కావడంతో అధికారులు నిందితుడికి జైలుశిక్ష విధించారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం సత్వీందర్‌సింగ్ అనే క్యాబ్ డ్రైవర్ 11 సంవత్సరాలుగా న్యూజిలాండ్‌లో ఉంటూ క్యాబ్ నడుపుతున్నాడు. 2023లో ఒకరోజు రాత్రి మైనర్ ప్రయాణికురాలు క్యాబ్‌ను బుక్ చేసుకుంది. ఈ క్రమంలో సత్వీందర్‌సింగ్ జిపిఎస్‌ను ఆఫ్ చేసి.. కారును దారి మళ్లించాడు. అక్కడ మైనర్‌పై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత బాధితురాలిని ఆమె స్నేహితుల ఇంటి దగ్గరవదిలేశాడు. సిసికెమెరాల ఆధారాంగా సత్వీందర్‌సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుపై తాజాగా అక్కడి న్యాయస్థానం విచారణ జరిపి ఏడేళ్లకుపైగా జైలుశిక్ష విధించింది.

# ఇండియా భర్తపై పాకిస్థాన్ భార్య ప్రధాని మోడీకి ఫిర్యాదు



**ఇస్లామాబాద్, డిసెంబరు 7:** తన భర్త తనను పాకిస్థాన్‌లో వదిలేసి, రహస్యంగా ఢిల్లీలో మరో పెళ్లికి సిద్ధమవుతున్నాడని ఓ పాకిస్థానీ మహిళ ఆరోపించారు. తనకు న్యాయం చేయాలంటూ ఆమె ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వీడియో ద్వారా విజ్ఞప్తి చేశారు. కరాచీకి చెందిన నికితా నాగ్‌దేవ్ అనే మహిళ, తన భర్త విక్రమ్ నాగ్‌దేవ్‌పై ఈ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇండోర్‌లో దీర్ఘకాలిక వీసాపై నివసిస్తున్న పాకిస్థాన్ మూలాలున్న విక్రమ్ నాగ్‌దేవ్‌తో ఆమెకు 2020 జనవరి 26న కరాచీలో హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం జరిగింది. పెళ్లైన నెల తర్వాత, ఫిబ్రవరి 26న ఆమెను భారత్‌కు తీసుకొచ్చారు. అయితే, కొన్ని నెలలకే వీసాలో సాంకేతిక సమస్య ఉందని చెప్పి, 2020 జూలై 9న అటారీ సరిహద్దు వద్ద తనను బలవంతంగా పాకిస్థాన్‌కు పంపించేశాడని ఆమె ఆరోపించారు. అప్పటి నుంచి తనను తిరిగి భారత్‌కు పిలిపించుకోవడానికి విక్రమ్ నిరాకరిస్తున్నాడని ఆమె వాపోయారు. పెళ్లై అత్తారింటికి వచ్చిన కొద్ది రోజులకే వారి ప్రవర్తనలో మార్పు వచ్చిందని నికిత తెలిపారు. తన భర్తకు తన బంధువుల్లో ఒకరితో వివాహేతర సంబంధం ఉందని తెలిసిందని, ఈ విషయం మామగారికి చెబితే, అబ్బాయిలకు ఇలాంటివి సహజం, ఏమీ చేయలేం అని అన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ రోజు నాకు న్యాయం జరగకపోతే, న్యాయవ్యవస్థపై మహిళలకు నమ్మకం పోతుంది. దయచేసి నాకు అండగా నిలవండని ఆమె కరాచీ నుంచి విడుదల చేసిన వీడియోలో వేడుకున్నారు. తన భర్త ఢిల్లీకి చెందిన మరో మహిళను పెళ్లి చేసుకోబోతున్నాడని తెలియడంతో నికిత 2025 జనవరి 27న లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ కేసు మధ్యప్రదేశ్ హైకోర్టుచే అధికారం పొందిన సింధీ పంచ్ మధ్యవర్తిత్వ, న్యాయ సలహా కేంద్రం ముందుకు వచ్చింది. విచారణ అనంతరం మధ్యవర్తిత్వం విఫలమైంది. భార్యాభర్తలిద్దరూ భారత పౌరులు కానందున, ఈ కేసు పాకిస్థాన్ పరిధిలోకి వస్తుందని పేర్కొంటూ, విక్రమ్‌ను పాకిస్థాన్‌కు బహిష్కరించాలని ఆ కేంద్రం 2025 ఏప్రిల్ 30న సిఫార్సు చేసింది. గతంలో 2025 మే నెలలో ఇండోర్ సోషల్ పంచాయితీ కూడా విక్రమ్‌ను దేశం విడిచి పంపాలని సిఫార్సు చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో, ఇండోర్ కలెక్టర్ ఆశిష్ సింగ్ ఈ విషయంపై విచారణకు ఆదేశించినట్లు ధృవీకరించారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



# సిఎం అభ్యర్థిగా ప్రకటిస్తే క్రియాశీల రాజకీయాల్లోకి సిద్ధూ

**చండీఘడ్, డిసెంబరు 7:** మాజీ క్రికెటర్ నవ్‌జోత్ సింగ్ సిద్ధూ తిరిగి రాజకీయాల్లోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తున్నది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పంజాబ్ కాంగ్రెస్ ఆయనను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తే రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటారని సిద్ధూ సతీమణి నవ్‌జోత్ కౌర్ సిద్ధూ పేర్కొన్నారు. ఏ పార్టీకి చెల్లించేందుకు తమ వద్ద నిధులు లేవని నవ్‌జోత్ కౌర్ వెల్లడించారు. తాము అధికారంలోకి వస్తే మాత్రం పంజాబ్‌ను బంగారు రాష్ట్రంగా మారుస్తామని చెప్పారు. మేం ఎప్పుడూ పంజాబ్, పంజాబియత్ కోసం గళం విప్పుతామని, ముఖ్యమంత్రి సీట్లో కూర్చోవడానికి రూ.500 కోట్లు చెల్లించే స్థోమత లేదని వ్యాఖ్యానించారు.

### డివైడర్‌ను ఢీకొట్టి గాల్లోకి లేచిన మెర్సిడిస్



**బుచారెస్ట్, డిసెంబరు 7:** కారులో వేగంగా వెళుతుండగా డ్రైవర్ స్పృహ కోల్పోవడంతో డివైడర్ ను ఢీ కొట్టి కారు గాల్లోకి లేచింది. ఎదురుగా వస్తున్న బస్సు, కార్ల పైనుంచి వెళ్లి ఓ పోల్ ను ఢీ కొట్టింది. సినిమా సన్నివేశాన్ని తలపించే ఈ సంఘటన రొమేనియాలో చోటుచేసుకుంది. రోడ్డు పక్కనే ఉన్న సీసీటీవీ కెమెరాలో రికార్డు కాగా ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రొమేనియాలోని ఒరాడియా సిటీలో 55 ఏళ్ల వ్యక్తి తన మెర్సిడస్ కారులో వెళుతుండగా అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యాడు. మధుమేహంతో బాధపడుతుండడంతో సడెన్ గా స్పృహ కోల్పోయాడు. దీంతో కారు అదుపుతప్పి రాంగ్ రూట్ లోకి వెళ్లింది. డివైడర్ ను ఢీ కొట్టి గాల్లోకి లేచింది. ఎదురుగా వస్తున్న ఓ బస్సు, దాని వెనకే ఉన్న రెండు కార్ల పైనుంచి వెళ్లి ఓ పోల్ ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్ ను ఎమర్జెన్సీ సిబ్బంది హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

### తేజ్‌ప్రతాప్ యాదవ్ విద్యుత్ బకాయిలు రూ.3 లక్షలు



**పాట్నా, డిసెంబరు 7:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, కుటుంబ కలహాల నేపథ్యంలో ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ పేరు ప్రముఖంగా వినిపించింది. తేజ్ ప్రతాప్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఇంటికి సంబంధించిన కరెంటు బిల్లు రూ.3.6 లక్షలు దాటిందని కథనాలు వెలువడ్డాయి. ప్రస్తుతం తేజ్‌ప్రతాప్ ప్రభుత్వ నివాసంలో ఉంటున్నారు. అయితే పట్నాలో ఆయనకు చెందిన ఓ ప్రైవేటు ఇంటికి చివరిసారిగా 2022 జూలైలో కరెంటు బిల్లు చెల్లించారు. గత మూడేళ్లుగా దీనికి సంబంధించిన బకాయిలు పేరుకుపోయాయి. జరిమానాలతో కలిపి ఇప్పుడా మొత్తం కరెంటు బిల్లు రూ.3.61 లక్షలకు చేరింది.

# పూరీ జగన్నాథుడికి 60వేల ఎకరాల సొంత భూమి



**పూరి, డిసెంబరు 7:** ఒడిశా రాష్ట్రంలోని పూరి జగన్నాథ ఆలయానికి రాష్ట్రంలో 60,426 ఎకరాల భూమి ఉండగా, మరో ఆరు రాష్ట్రాల్లో దాదాపు 400 ఎకరాల భూమి ఉందని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ శనివారం శాసనసభలో వెల్లడించారు. బీజేడీ ఎమ్మెల్యే సుదర్శన్ హరిపాల్ శాసనసభలో అడిగిన ఒక లిఖితపూర్వక ప్రశ్నకు సమాధానంగా మంత్రి ఈ వివరాలు తెలియజేశారు. పూరిలోని ఈ 12వ శతాబ్దపు ఆలయాన్ని శ్రీ జగన్నాథ ఆలయ చట్టం, 1956 ప్రకారం న్యాయశాఖ నిర్వహిస్తుంది. ఒడిశాలోని 24 జిల్లాల్లో జగన్నాథుని పేరు మీద 60,426.94 ఎకరాల భూమి ఉండగా, పశ్చిమ బెంగాల్‌లో 322.93 ఎకరాలు, మహారాష్ట్ర లో28.21 ఎకరాలు, మధ్యప్రదేశ్‌లో 25.11 ఎకరాలు, ఆంధ్రప్రదేశ్ 17.02 ఎకరాలు, ఛత్తీస్‌గఢ్ 1.7 ఎకరాలు, బీహార్‌లో 0.27 ఎకరాలతో కలుపు కుని ఇతర ఆర రాష్ట్రాలలో మరో 395.25 ఎకరాల ఆలయ భూమి ఉందని ఆయన పేర్కొ న్నారు. ప్రస్తుతం 38,061.792 ఎకరాలకు సంబంధించిన సవరించిన భూమి రికార్డులు పూరిలోని శ్రీ జగన్నాథ ఆలయ అధికారుల వద్ద ఉన్నాయని మంత్రి తెలిపారు. ఆలయ భూమిని అక్రమంగా ఆక్రమించుకున్నట్లు అనేక కేసులు వెలుగులోకి వచ్చాయని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో ఆక్రమణలో ఉన్న 169 ఎకరాల భూమిని తిరిగి పొందేందుకు శ్రీ జగన్నాథ ఆలయ చట్టం కింద మొత్తం 974 కేసులు నమోదు చేసినట్లు ఆయన సభకు తెలియజేశారు.

# మానవత్వానికి ప్రతిరూపం విపిఆర్ ఫౌండేషన్

**● నెల్లూరు జిల్లాలో దివ్యాంగులకు మొత్తం 1050 ట్రై సైకిళ్లు అందజేశాం ● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**



నెల్లూరు, డిసెంబరు 7 ప్రభాతవార్త-వైద్యం: వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృతం చేసి తమ సేవలు మరింత ఎక్కువ మందికి చేరువ చేయాలన్న ఉద్దేశంతోనే తాము రాజకీయాలలోకి వచ్చామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ట్రై సైకిళ్ళు పంపిణీ కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి వీపీఆర్ ఫౌండేషన్ చైర్ పర్సన్ హోదాలో ఆమె పాల్గొన్నారు. నెల్లూరు సిటీ పరిధిలోని 90 మందికి మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి ఆమె దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ వేమిరెడ్డి దంపతులు సంపాదన కోసం రాజకీయాల్లోకి రాలేదని ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతోనే రాజకీయాలలోకి వచ్చారన్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్న వీపీఆర్ ఫౌండేషన్ సేవలను మంత్రి నారాయణ కొనియాడారు. అనంతరం జిల్లా టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ విద్య, వైద్యం, ఆధ్యాత్మిక రంగాలలో వేమిరెడ్డి దంపతులు చేస్తున్న సేవలను ప్రశంసించారు. నిస్వార్థ సేవల ద్వారా రాజకీయాలలో సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన వేమిరెడ్డి దంపతులు ఆదర్శప్రాయులన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో 1,050 మందికి ట్రైసైకిళ్ళు అందజేశామని తెలిపారు. కంటి చూపు లేక ఇబ్బందులు పడుతున్న వారికి మెరుగైన కంటి చూపు అందివ్వడం పడుతున్న వారికి మెరుగైన కంటి చూపు అందివ్వడం కోసం వీపీఆర్ నేత్ర అనే సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వెల్లడించారు. వీపీఆర్ నేత్ర ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉచిత కంటి పరీక్షలు చేసి కంటి అద్దాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# కాణిపాకానికి పోటెత్తిన అయ్యప్ప భక్తులు

**● పార్కింగ్ స్థలాల్లో వాహనాల కిటకిట**




కాణిపాకం, డిసెంబరు 7 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అలయం ఆదివారం అయ్యప్ప భక్తుల రద్దీతో శబరిమలను తలపిస్తోంది. కాణిపాకం ఆలయంతో పాటు పరసరాలన్ని అయ్యప్ప భక్తులతో కిటకిటలాడాయి. దేవస్థానం వాహన పార్కింగ్ స్థలాలన్ని అయ్యప్ప భక్తుల వాహనాలతో కిటకిటలాడాయి. కార్తీకమాసం సందర్భంగా శబరిమల ఆలయంలో స్వామివారి దర్శనాలు ప్రారంభం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన అయ్యప్ప దీక్ష భక్తులు శబరిమల దర్శనం కోసం పెద్దఎత్తున తరలివెళుతున్నారు. శబరిమల దర్శనంకు వెళ్ళే అయ్యప్పభక్తులు ముందుగా విఘ్ననాయకుడైన కాణిపాకం వినాయకునికి దర్శించుకోవడం ఆనవాయితీ. ఈమేరకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి కూడా అయ్యప్ప భక్తులు కాణిపాకం స్వామిదర్శనం కోసం భారీగా తరలివచ్చారు. అలాగే సాధారణ భక్తులు కూడా ఆదివారం సెలవు రోజు కావడం వివిధ ప్రాంతాల నుండి భారీగా తరలివచ్చారు. సాధారణ భక్తులతో పాటు అయ్యప్ప భక్తులు తరలిరావడంతో ఆలయంలో విపరీతమైన రద్దీ నెలకొంది. అలాగే దేవస్థానంలో ఆలయ పాలక మండలి ఆత్మీయ అభినందన సభ జరగడంతో పాలకమండలి సభ్యుల బంధు మిత్రులు పెద్దఎత్తున కాణిపాకం తరలివచ్చారు. అయ్యప్ప భక్తులు వేకువజామున నుండి స్వామి దర్శనంకోసం క్యూలైన్లలో బారులు తీరి నిలబడ్డారు. ఆలయ క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు పూర్తిగా నిండిపోవడంతో ఆలయం వెలుపల భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం బారులు తీరి వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో గంటల తరబడి వేచివుండడం గమనార్హం. అలాగే అయ్యప్పభక్తులు వచ్చిన వివిధ రకాల వాహనాలతో కాణిపాకం పార్కింగ్ స్థలాలు, పరిసరాలన్ని నిండిపోయాయి. అంచనాలకు మించి భక్తులు ఆలయ దర్శనార్థం తరలిరావడంతో వారికి త్వరితగతిన స్వామివారి దర్శనం కల్పించడం దేవస్థానం అధికారులకు తలకుమించిన భారంగా తయారైంది. ఆదివారం ఉదయం నుండి రాత్రి వరకు సుమారు 30 వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు తెలుస్తోంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా భక్తులందరికి త్వరితగిన స్వామి దర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

# మతమార్పిడులపై దర్యాప్తు జరిపించండి

**- ప్రభుత్వానికి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి విజ్ఞప్తి**

**- డబ్బు ఆశ చూపి పాల్పడుతున్నారని ఆరోపణ**



విజయవాడ, డిసెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: హిందు మతంపై కుట్రలు జరుగుతున్నాయని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన ఆరోపణలు చేసారు. గత రెండు దశాబ్దాల జరుగుతున్న మత మార్పిడులపై విచారణ చేయాలన్నారు. ధర్మం కోసం హిందువులంతా ఐక్యంగా ఉండాలని పిలుపును ఇచ్చారు. దేశం కోసం ధర్మం కోసం హిందువుల్లో ఉన్న అన్ని సామాజిక వర్గాలు ఒక్కటవ్వాలని విజయసాయిరెడ్డి విజ్ఞప్తి చేసారు. అదే భారతదేశానికి రక్ష .. శ్రీరామ రక్ష అని తెలిపారు. ఈ మేరకు ఆదివారం విజయసాయిరెడ్డి తన ఎక్స్ ఖాతా వేదికగా హిందూ మతంపై ఈ వ్యాఖ్యలు చేశారు. హిందూ మతంపై కుట్రలు జరుగుతున్నాయన్నారు, వాటిని సహించేది లేదని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. డబ్బు ఆశ చూపించి మతమార్పిడులకు పాల్పడే వారికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలో, రాష్ట్రం జరుగుతున్న మతమార్పిడులపై ప్రభుత్వం ఒక కమిటీ వేసి సమగ్ర విచారణ జరపాలని విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారు. ప్రలోభాలకు గురిచేసి మతాలను మార్చే ప్రయత్నాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సాయిరెడ్డి తాజా ట్వీట్‌పై రాజకీయవర్గాల్లో చర్చకు తెర తీసింది. ఏదో ఒక పార్టీలో చేరే ఉద్దేశ్యంతోనే మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఈ వ్యాఖ్యలు చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది.



# పొర్లుకట్ట వాసుల కోరిక నెరవేర్చిన పురపాలక శాఖ మంత్రి నారాయణ

నెల్లూరు, డిసెంబరు 7 ప్రభాతవార్త-వైద్యం: 48వ డివిజన్ ప్రజల చిరకాల కోరికను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నెరవేర్చారు. డివిజన్లో పర్యటించినప్పుడు స్థానిక ప్రజలు 40 ఏళ్లుగా ప్రహరిగోడ, డ్రైన్ సమస్యగా ఉందని మంత్రి నారాయణ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి నారాయణ ప్రహరి గోడతో పాటు, డ్రైన్ నిర్మాణం చేపడతామని శనివారం హామీ ఇచ్చారు. 24 గంటలు తిరక్కముందే నిధులు మంజూరు చేసి ఆదివారం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పనులను శరవేగంగా చేపట్టాలని నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు మంత్రి సూచించారు. తమ చిరకాల కోరిక నెరవేరబోతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్లు తహసీన్, రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, స్థానిక టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు పాల్గొన్నారు.

# నాలుగో తరగతి ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేయాలి

**- ఎపి ఎన్‌జిఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్**

విజయవాడ, డిసెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లోని నాలుగో తరగతి ఉద్యోగుల ఖాళీలను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని.. వారిపై పనిభారం తగ్గించాలని ఏపీ ఎన్జీజీవో అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం ఎన్నికలు జరిగాయి. ఈ సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నగరంలోని గాంధీనగర్ ఏపీ ఎన్జీవో హోమ్‌లో జరిగింది. కార్యక్రమానికి ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్జీజీవో అసోసియేషన్ ఎప్పుడూ ముందుంటూ చిత్తశుద్ధితో కృషిచేస్తోందన్నారు. వారికి న్యాయంగా దక్కాల్సిన పదోన్నతులు, వేతన సవరణలపైనా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి.ఎస్.సాయిరాం, అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్ తదితరులు ప్రసంగించారు. ఇక ఆల్ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడుగా వి.ఎస్.సాయిరాం (ఎన్‌టిఆర్), అధ్యక్షుడుగా ఎన్.చంద్రశేఖర్ (విశాఖ), సహాధ్యకుడుగా వి.శ్రీనివాసరావు (విజయనగరం), ఉపాధ్యక్షులుగా సిహెచ్.వీర వెంకయ్య (ఏలూరు), జి.శ్రీనివాసరావు (అనకాపల్లి), జి.నాగేశ్వరరావు (నెల్లూరు), కె.బాబూరావు (మన్యం), కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.బాలరాజు (కృష్ణా), ప్రచార కార్యదర్శిగా జి.గౌరి నాయుడు (పార్వతీపురం), సంయుక్త కార్యదర్సులుగా కె.శ్రీనివాసరావు (గుంటూరు), ఎం.బాలస్వామి (కర్నూలు) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి డిఎస్ఎన్ రెడ్డి ప్రకటించారు సహాయ ఎన్నికల అధికారిగా డి.రమేష్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఓ రాష్ట్ర ప్రచార కార్యదర్శి జానకి, ఎన్‌టిఆర్ జిల్లా సహాధ్యక్షులు వివి ప్రసాద్, కోశాధికారి బి.సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడు జి.రామకృష్ణ, వివిధ జిల్లాల నాల్గవతరగతి ఉద్యోగుల సంఘం కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# రామగుండం థర్మల్ మూసివేత

హైదరాబాద్, నవంబరు 7 ప్రభాతవార్త: దాదాపు ఐదు దశాబ్దాలుగా తెలంగాణకు సేవలందించిన రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ మూసివేశారు. రాష్ట్రంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రామగుండం థర్మల్ స్టేషన్‌ను అధికారులు పూర్తిగా మూసివేశారు. 1971 అక్టోబర్‌లో యుఎస్ఎఐడి సహకారంతో స్థాపించిన తొలి థర్మల్ స్టేషన్‌గా రామగుండం థర్మల్ పవర్ స్టేషన్‌గా చరిత్రలో నిలిచిపోయింది. ఈ ప్లాంట్ మొత్తం 18743.4 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసింది. రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసిన ఈ ప్లాంట్ జీవితకాలం ముగిసిందని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కరువు ప్రభావిత జిల్లాల్లోని వ్యవసాయ పంపుసెట్లకు ఈ యూనిట్ నుంచి విద్యుత్ సరఫరా చేసేవారు. నాలుగు దశాబ్దాలకు పైగా నిరంతరాయంగా సేవలు అందించిన ఈ థర్మల్ స్టేషన్ తాజాగా మూతపడటంతో చారిత్రక ఘట్టంగా నిలిచింది.

# స్క్రబ్ టైఫస్ కలకలం కృష్ణా జిల్లాలో ఒకరు మృతి

**● 6,678 మంది అనుమానిత కేసులకు పరీక్షలు... 1317మందికి పాజిటివ్**

**● అంటువ్యాధి కాదు, అప్రమత్తంగా ఉంటే చాలు: వైద్యులు**

విజయవాడ, డిసెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర వ్యాప్తంగా స్క్రబ్ టైఫస్ మహమ్మారి కలకలం రేపుతోంది. ఈ వ్యాధి శోకి ఏడుగురు మరణించినట్లు సమాచారం. ఇది అంటువ్యాధి కాదని, సకాలంలో గమనిస్తే సాధారణ వైద్యంతో నయమవుతుందని వైద్యులు అంటున్నారు. ఈ స్క్రబ్ టైఫస్ వ్యాధిని కలిగించే కీటకం ఎక్కువగా గ్రామీణ పరిసర ప్రాంతాల్లో ఉంటుంది. ఇది కుట్టిన ప్రాంతంలో చిన్న మచ్చలాగా ఏర్పడి దురద పెడుతుంది. ఆ తర్వాత జ్వరం వస్తుంది. ఈ లక్షణాలను గుర్తించి వెంటనే చికిత్స తీసుకుంటే నయం అవుతుంది. ఇది ప్రాణాంతకమైనది కాదు. మా దగ్గర ఈ వ్యాధికి సంబంధించిన పరీక్షలు అన్నీ చేసి చికిత్స అందిస్తున్నాం. ఇది నల్లిని పోలిన చిన్న కీటకమే స్క్రబ్ టైఫస్ రికెట్సియా కుటుంబానికి చెందిన ఒరియంటియా సుట్సుగముషి అనే బ్యాక్టీరియా వల్ల స్క్రబ్ టైఫస్ అనే కీటకం వస్తుంది.

గత 15 రోజుల్లో శ్రీసత్యసాయి జిల్లాలో ఆరు కేసులు బయటపడ్డాయి. దీని బారిన పడి మృత్యువు ఒడిలోకి చేరినవారు ఎంతోమంది ఉన్నారు. స్క్రబ్ టైఫస్ కీటకాల తాకిడి ఆగస్టు నుంచి ఫిబ్రవరి మధ్య ఎక్కువగా ఉంటుంది. ఈ కాలంలో ఇన్ఫెక్షన్లు సోకే అవకాశం ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మనుషుల నుంచి మనుషులకు ఈ ఇన్‌ఫెక్షన్ సోకకపోయినా, కీటకం కాటుకు గురైన వ్యక్తి అస్వస్థతకు గురవుతారు. అందుకే తగిన జాగ్రత్తలు తప్పనిసరి అని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. తడి నేలలు, పొలాలు, తోటలు, పొదలు, పశువుల పాకలు, వ్యర్థాలు పోగుచేసే ప్రాంతాల్లో పని చేసే వ్యక్తులు అప్రమత్తంగా ఉండాలి. పూర్తి చేతులు ఉన్న చొక్కా, ప్యాంట్లు, కాలికి సాక్సులు, బూట్లు తప్పనిసరిగా ధరించాలి. ఇళ్లలో పాత మంచాలు, పరుపులు, దిండ్లలోకి ఈ కీటకాలు చొరబడే అవకాశం ఉన్నందున వాటిని ఎప్పటికప్పుడూ మార్చాలి. లేదంటే శుభ్రం చేసిన తర్వాతే వాడితే మంచిది. పిల్లలపై ఎక్కువ ప్రభావం చూపే ప్రమాదం ఉన్నందున, కాళ్లు, చేతులు కప్పి ఉంచేలా దుస్తులు వేయాలి. వారి పట్ల సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరుబయట ఆటలాడే సమయంలోను కూడా అప్రమత్తంగా ఉండాలి. రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ తీవ్రత జనవరి 1 నుంచి నవంబర్ 26 వరకు 6,678 మంది అనుమానిత కేసులకు పరీక్షలు చేశారు. వీరిలో 1,317 మందిని పాజిటివ్ కేసులుగా గుర్తించారు. తాజాగా కృష్ణా జిల్లాలో ఓ వ్యక్తి మరణించాడు. రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ జ్వరాల కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇక కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం ముదునూరు గ్రామానికి చెందిన బుట్టి శివశంకర్ రాజు జ్వరం, వాంతులు రావటంతో మచిలీపట్నం, విజయవాడలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో వైద్య చికిత్సలు చేయించుకున్నారు. అప్పటికి ఆరోగ్య పరిస్థితి నిలకడగా లేకపోవడంతో అక్కడ నుంచి విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొని వెళ్లారు. ఆ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు తీసుకుంటూ ఈ నెల నాలుగో తేదీన మృతి చెందారు. అయితే హెచ్ఐపి పోర్టల్‌లో శివశంకర్ రాజు స్క్రబ్ టైపస్ వ్యాధి ఉన్నట్లు శనివారం నమోదు చేశారు. కానీ ఇతను కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతూ మృతి చెందినట్లు కృష్ణా జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారి పి.యుగంధర్ తెలిపారు.



# నేటి విజయ వీచిక... భవిష్యత్తుకు కరదీపిక

విజయవాడ, డిసెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: చరిత్ర గతానికి అద్దం.. వర్తమానానికి పాఠం! మనం ఎంత చేసినా.. మరింత అభివృద్ధికి ఎప్పుడూ చోటు ఉంటూనే ఉంటుందని.. అందుకే దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల నిర్వహణలో ఎదురైన సవాళ్లు, వాటిని వినూత్నంగా ఎదుర్కొంటూ విజయ తీరాలకు చేరిన తీరు, సూచనల సమాహారంతో విజయ వీచిక పేరుతో డాక్యుమెంటును రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థాన ఈవో వీకే శీనా నాయక్‌తో కలిసి కలెక్టరేట్‌లోని ఏపీఎస్ రెడ్డి వీసీ హాల్‌లో విజయ వీచిక.. అభ్యాస దీపిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ... శాఖల మధ్య పటిష్ట సమన్వయం, 36 ప్రత్యేక సెక్టార్లు, సాంకేతికతతో అనుసంధానం, గౌరవ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఎక్కడా ఎలాంటి ఇబ్బందీ లేకుండా దసరా ఉత్సవాలను విజయవంతం చేయగలిగామని.. ముఖ్యమంత్రి ప్రశంసలు అందుకున్నామని పేర్కొన్నారు. ఈ అనుభవం భవిష్యత్తు ఉత్సవాలకు రిఫరెన్స్‌గా ఉండాలనే ఉద్దేశంతోనే సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో విజయ వీచిక పేరుతో పుస్తకాన్ని వెలువరించినట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ.. విజయ వీచిక పుస్తకం భవిష్యత్తులో జరిగే ఉత్సవాలకు భద్రతతో పాటు వివిధ ఏర్పాట్లకు సంబంధించి సమగ్ర ప్రణాళికల రూపకల్పనకు ఉపయోగపడుతుందన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఈవో వీకే శీనా నాయక్ మాట్లాడుతూ... భవిష్యత్తు ఉత్సవాలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు ఈ విజయ వీచిక పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డీఐపీఆర్‌వో కేవీ రమణరావు, డివిజనల్ పీఆర్‌వో కె.రవి, ఏవీ సూపర్‌వైజర్ వీవీ ప్రసాద్, డా. ఎన్‌టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ డీసీ డా. జె.సుమన్, కలిమిశ్రీ గ్రాఫిక్స్ అధినేత, మల్లెతీగ కలిమిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో జాప్యం

**టెక్నికల్ ఎవిడెన్స్ ఉన్నా పట్టుకోవడంలో ఆలస్యం?**

**కాజులూరు సర్కిల్ పోలీసులపై ఆరోపణలు**



ఉమ్మడి తూర్పుగోదావరి బ్యూరో, డిసెంబరు 7 (ప్రభాతవార్త): దర్జాగా ఇంట్లోకి దొంగలు జొరబడి విలువైన వస్తువులు చోరీ చేసి వెళ్ళిపోయారు. రోజులు గడుస్తున్నా సరే పోలీసులు కేసును దర్యాప్తు చేయడంలో జాప్యం చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇంతకీ ఏం జరిగిందంటే.. కాకినాడ జిల్లా కాజులూరు మండలం గొల్లపాలెం పెద్ద వీధిలో ఉన్న నేతి భగవాన్ ఇంట్లో గత నెల 29న శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు గేటు తాళం పగలగొట్టి ఇంటి లోపలి ప్రవేశించి ల్యాప్ టాప్, హుండాయ్ వెన్యూ ఏపీ 39 కేబి 3736 నెంబర్ గల నీలి రంగు కారును దొంగిలించుకు పోయారు.

నాడు అందిన ఫిర్యాదు మేరకు దొంగిలించుకు పోయినట్లు వచ్చిన ఫిర్యాదు పై గొల్లపాలెం పోలీస్ స్టేషన్ నందు క్రైమ్ నెంబర్ 144/2025 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అందులో భాగంగా రూరల్ సీఐ చైతన్య కృష్ణ పర్యవేక్షణలో క్లూ టీం సీఐ పి.శ్రీనివాస్ బృందం నేర స్థలాన్ని సందర్శించి ఆధారాలను సేకరించి దర్యాప్తు ముమ్మరం చేస్తున్నట్లుగా ఎస్పై మోహన్ కుమార్ అప్పట్లో తెలిపారు. కాగా రోజులు గడుస్తున్నా నేటికీ ఎలాంటి చర్యలు పోలీసులు చేపట్టినట్లు లేదని ఆరోపణలు ఉన్నాయి. టెక్నికల్‌గా లాప్‌టాప్ కూడా దొంగల చేతిలో ఉన్నా... లొకేషన్ లేదా ఇతరత్రా పద్ధతుల ద్వారా చోరీ సొత్తును కనుగొనడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని అంటున్నారు. పైగా కారు కూడా చోరికి గురికాబడింది. ఇన్ని టెక్నికల్ ఎవిడెన్స్ ఉన్నా సరే... పోలీసులు కేసు దర్యాప్తు జాప్యం ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

# కురబల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**● శ్రీకనకదాస జయంతి వేడుకల్లో రాష్ట్ర బిసి సంక్షేమ మంత్రి సవిత**




వి.కోట, డిసెంబరు 7 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఉన్న కురబ కులస్తుల సంక్షేమానికి సిఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఆదివారం వి.కోటలో కురబ కులస్తుల ఆరాధ్యదైవం శ్రీ కనకదాస జయంతి కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తన త ండ్రి కాలం నుంచి నేటి వరకు సుమారు పద్నాలుగు మంత్రి పదవులను తెదేపా ప్రభుత్వం కురబలకు అంది ంచడం గర్వకారణమన్నారు. ప్రతి కురబ కులస్తులు విద్య, రాజకీయ, ఆర్థిక రంగాల్లో మెరుగైన స్థానాలకు చేరుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కురబ కులస్తులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బిసిల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కురబకులస్తులు నమ్మకానికి ప్రతీక అని కురబలు తెదేపా అభ్యున్నతికి దోహదపడుతున్నారన్నారు. కురబలకు రాష్ట్రస్థాయి డైరెక్టర పదవి సైతం నియోజకవర్గంలో కేటాయించామన్నారు. కర్ణాటక మాజీ మంత్రి వర్తూర్ ప్రకాష్ మాట్లాడుతూ కురబలు ఐకమత్యంతో ముందుకుసాగాలని సూచించారు. అనంతరం కురబకులస్తులు సంప్రదాయ రీతిలో తలలపైటెంకాయలు పగలగొట్టుకునే కార్యక్రమం చేపట్టారు. మహిళలు ఈసందర్భంగా వి.కోటలో పెద్ద ఎత్తున పాల కలశాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కురబ సంఘ అధ్యక్షుడు ఎంసి కృష్ణప్ప, ప్రధాన కార్యదర్శి అమర్ గౌడ్, నేతలు రామచంద్రనాయుడు, రంగనాథ్, రాంబాబు, ఈశ్వర్‌గౌడ్, ధీరజ్, పెద్ద ఎత్తున కురబ సంఘ నేతలు, కూటమి నేతలు పాల్గొన్నారు.

# భగవద్గీత కంఠస్థ పోటీలు

తిరుపతి, డిసెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో భగవద్గీత కంఠస్థ పోటీలు ఆదివారం ఉదయం నుండి జరిగాయి. టిటిడి విద్యాసంస్థలతోపాటు తిరుపతిలోని విద్యాసంస్థల విద్యార్థినీవిద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భగవద్గీత 14వ అధ్యాయం 6నుండి 9వ తరగతి విద్యార్థులకు, 10వ తరగతి విద్యార్థులకు 16వ అధ్యాయం దైవాసురసంపద్విభాగయోగంపై పోటీలు చేపట్టారు. 18-45 ఏళ్ల వారికి నిత్యజీవితంలో భగవద్గీత భావ విశ్లేషణ అంశంపై పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సనాతన హిందూ ధర్మంపై మరింతగా చైతన్యం కలిగించుకునేలా దోహదపడింది.



## ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడుకు తాపీ ధర్మారావు పురస్కారం



విజయవాడ, డిసెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడుకు తాపీ ధర్మారావు నాయుడు పురస్కారం లభించింది. బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్ 9వ వార్షికోత్సవం గుంటూరు బ్రాడీపేటలోని కొరటాల సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. ప్రముఖ కవి పుప్పాల శ్రీరామ్ సభకు అధ్యక్షత వహించారు. ఫౌండేషన్ అధ్యక్షులు బండికల్లు జమదగ్ని, ప్రముఖ రచయిత తాపీ ధర్మారావు నాయుడు పేరిట ఏర్పాటు చేసిన స్మారక పురస్కారాన్ని ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడుకు అందజేశారు. తాపీ ధర్మారావు సాహిత్య ప్రతిభను సాహితీవేత్త భూసురపల్లి వెంకటేశ్వర్లు వివరించారు. పురస్కార గ్రహీత గంటేడ గౌరునాయుడు సాహిత్య ప్రస్థానాన్ని సాహితీ వేత్త ఎస్.ఎమ్. సుభానీ సభకు తెలియజేశారు. ఇటీవల నిర్వహించిన కథల పోటీల్లో బహుమతి పొందిన కథలను విశిష్ట అతిథి శిరంశెట్టి కాంతారావు విశ్లేషించారు. ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన మల్లెతీగ పత్రిక సంపాదకులు కలిమిశ్రీ, విశాఖ సంస్కృతి పత్రిక సంపాదకులు శిరేల సన్యాసి రావు ఫౌండేషన్ సేవలను కొనియాడారు. అనంతరం కథల పోటీ విజేతలు నందిరాజు పద్మలతా జయరాం, వాడపల్లి పూర్ణ కామేశ్వరి, కైకాల సుమలతలను నగదు పురస్కారాలతో జమదగ్ని కుటుంబ సభ్యులు సత్కరించారు. వివిధ రంగాలలో సేవలందించిన వడ్రాణం హరిబాబు, డాక్టర్ గాజుల రామకృష్ణ, డాక్టర్ నెల్లూరి బ్రహ్మయ్య, నారదాసు శ్రీహరిరావు, బండ్లమూడి గాంధీ, బిళ్ళా అశోక్, మిరియాల గోపీ కుమార్, రామరాజు లక్ష్మీ శ్రీనివాస్, మేడిశెట్టి సుభద్రా కృష్ణ, ఉప్పు వెంకట రత్తయ్యలను స్ఫూర్తి పురస్కారాలతో సత్కరించారు. సభా ప్రారంభంలో నిర్వహించిన సంగీత విభావరి ఆహూతులను అలరించింది. నగరానికి చెందిన కవులూ, రచయితలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## భగవద్గీత ప్రతి ఒక్కరి జీవితానికి మార్గదర్శి, ధర్మ స్థాపనకు దిక్సూచి

- ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్
- ఉడిపి పుట్టిగే మఠంలో పవన్ కల్యాణ్‌కు 'అభినవ కృష్ణ దేవరాయ' బిరుదు
- పీఠాధిపతి సుగుణేంద్ర స్వామీజీ చేతుల మీదుగా సత్కారం
- ఐన్‌స్టీన్ నుంచి ఓపెన్‌హైమర్ వరకు ఎందరో ప్రపంచ మేధావుల ఆలోచనలను గీత శతాబ్దాలుగా ప్రభావితం చేస్తోంది
- రాష్ట్ర ప్రయోజనాల కోసమే 21 స్థానాల్లో పోటీ చేశానన్న పవన్ వ్యాఖ్య

విజయవాడ, డిసెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: భగవద్గీత సందేశం మన చర్యలకు మార్గనిర్దేశం చేసి, సమాజాన్ని బలోపేతం చేసి, జాతీయ స్ఫూర్తిని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. కన్నడ నాట ఆయనకు అరుదైన గౌరవం లభించింది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉడిపిలో ఆయనకు అభినవ కృష్ణ దేవరాయ అనే బిరుదును ప్రదానం చేశారు. కర్ణాటకలోని ఉడిపి పర్యాయ పుట్టిగే శ్రీకృష్ణ మఠం ఆధ్వర్యంలో నిర్వహించిన బృహత్ గీతోత్సవ కార్యక్రమంలో మఠాధిపతి సుగుణేంద్ర తీర్థ స్వామీజీ ఈ బిరుదును పవన్ కల్యాణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, భగవద్గీత ప్రాముఖ్యత, ధర్మం, తన రాజకీయ ప్రయాణం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమానికి తాను ఉప ముఖ్యమంత్రిగానో, ప్రజాసేవకుడిగానో రాలేదని, ధర్మాన్ని అన్వేషించే ఒక వినయపూర్వక సాధకుడిగా మాత్రమే వచ్చానని పవన్ స్పష్టం చేశారు. సరైన పాలన, సేవ, బాధ్యతలతో కూడిన ప్రతి చర్యే నిజమైన నాయకత్వానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ముందు తాను కూడా అర్జునుడిలాంటి సందిగ్ధతను ఎదుర్కొన్నానని గుర్తుచేసుకున్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే రాష్ట్ర సమగ్ర శ్రేయస్సే ముఖ్యమని, ధర్మాన్ని అనుసరించే కేవలం 21 స్థానాలకే పరిమితమయ్యానని వివరించారు. భగవద్గీత అనేది కేవలం ఒకసారి చదివి, ఎర్ర వస్త్రంలో చుట్టి పూజాగదిలో పెట్టే గ్రంథం కాదని పవన్ అన్నారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి నిర్ణయంలో, ప్రతి గందరగోళంలో, ప్రతి అంతర్గత పోరాటంలో గీత మనతోనే నడుస్తుందని, మన కురుక్షేత్రాల్లో స్థిరమైన తోడుగా నిలుస్తుందని తెలిపారు. నేటి తరం యువత నిరంతరం సమాచార వెల్లువ, కెరీర్ ఒత్తిడి, గుర్తింపు సంక్షోభం, వైఫల్య భయాలు వంటి ఆధునిక కురుక్షేత్రాలను ఎదుర్కొంటోందని, వారికి అత్యంత అవసరమైన మానసిక బలం, భావోద్వేగ నిలకడను గీత అందిస్తుందని అభిప్రాయపడ్డారు. మన కర్మభూమి ఎన్నో దండయాత్రలను తట్టుకుని నిలబడింది ఆయుధాలు లేదా సంపదతో కాదని, ధర్మాన్ని సజీవంగా ఉంచిన గ్రంథాలు, సంప్రదాయాలు, సాధువులు, పవిత్ర సంస్థల వల్లేనని పవన్ ఉద్ఘాటించారు.

ఐన్‌స్టీన్ నుంచి ఓపెన్‌హైమర్ వరకు ఎందరో ప్రపంచ మేధావుల ఆలోచనలను గీత శతాబ్దాలుగా ప్రభావితం చేస్తోందని గుర్తు చేశారు. ఉడిపి వంటి పుణ్యక్షేత్రాల్లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు సమావేశమైనప్పుడు వసుధైక కుటుంబం అనే ప్రాచీన భారతీయ దార్శనికతకు జీవం పోస్తారని, ఇదే నేడు ప్రపంచానికి భారత్ అందిస్తున్న సందేశమని వివరించారు. జగద్గురు మధ్వాచార్యుల శాశ్వత వారసత్వం ద్వారా మన ఆధ్యాత్మిక సంపదను కాపాడిన వారిని స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.

శ్రీకృష్ణుడు కొలువైన, ముఖ్యప్రాణ హనుమంతుడు శాశ్వత సంరక్షకుడిగా నిలిచిన, జగద్గురు మధ్వాచార్యులు తన జ్ఞానంతో ఎందరినో చైతన్యపరిచిన పవిత్ర భూమి ఉడిపి. మన నాగరికతకు ఆత్మలాంటి భగవద్గీత సందేశాన్ని జరుపుకునేందుకు భక్తులతో కలవడం ఆనందంగా ఉంది" అని తెలిపారు.

సుగుణేంద్ర తీర్థ స్వామీజీ దార్శనిక మార్గదర్శకత్వంలో ఈ పవిత్ర భూమి చారిత్రక ఆధ్యాత్మిక ఉద్యమాలకు సాక్షి గా నిలుస్తోందని పవన్ ప్రశంసించారు. కోటి భగవద్గీత చేతిరాత ప్రాజెక్టు నుంచి లక్ష కంఠ పారాయణం వరకు చేపట్టిన కార్యక్రమాలు ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తినిస్తున్నాయని కొనియాడారు. ఈ పవిత్ర భూమి భారతదేశపు ఆధ్యాత్మిక శక్తి కేంద్రమని ఆయన అభివర్ణించారు. శ్రీకృష్ణుడు నిత్యం కొలువై ఉండే ఈ నేలపై అడుగుపెట్టడం తన అదృష్టమని పేర్కొన్నారు. బృహత్ గీతోత్సవం శుభ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు కోరుకోవడానికి ఇక్కడికి వచ్చానని తెలిపారు.



భవానీ దీక్ష విరమణల ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఇఓ

## త్వరితంగా భవానీ దీక్షల ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 7 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 11 నుండి 15 వరకు జరగబోయే శ్రీ భవానీ దీక్షల విరమణల కోసం త్వరితంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఇఓ వికె శీనానాయక్ ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఇఓ ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇరుముడి పాయింట్లు, క్యూలయిను ,, కేశఖండన శాల, తదితర ఏర్పాట్లను పరిశీలించిన తరువాత పలు సూచనలు చేశారు.

## అర్బన్ ప్రాంతాల సదుపాయాలతో 359 రూర్బన్ పంచాయతీలు!

### రాష్ట్ర ప్రభుత్వం తాజా నిర్ణయం

- క్లస్టర్ విధానం రద్దు... మూడు కేటగిరీలుగా పంచాయతీల విభజన
- రూర్బన్ పంచాయతీల కార్యదర్శులుగా ఎంపిడిఓలు




విజయవాడ, డిసెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీలో అర్బన్(పట్టణ) ప్రాంతాల తరహా సదుపాయాలతో 359 రూర్బన్ పంచాయతీలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. పది వేలకు పైగా జనాభా, రూ.కోటి కంటే ఎక్కువ వార్షికాదాయం కలిగిన పంచాయతీలను రూర్బన్‌లుగా మార్చాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. వచ్చే నెలలో దీనికి మార్గదర్శకాలు వెలువడనున్నాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల నిర్వహించిన సమీక్షలో రూర్బన్ పంచాయతీల ఏర్పాటుకు ఆదేశాలిచ్చారు. ఇందులో భాగంగా క్లస్టర్ విధానం రద్దు చేసి ఒక స్పెషల్‌తోపాటు మరో మూడు కేటగిరీలుగా పంచాయతీలను విభజించారు. దీని ప్రకారం స్పెషల్ పంచాయతీలే రూర్బన్‌గా మారనున్నాయి. డిప్యూటీ ఎంపీడీవోలు పలువురిని రూర్బన్ పంచాయతీల్లో కార్యదర్శులుగా నియమించనున్నారు. నిబద్ధత, నిజాయతీ గల 359 మందిని ఎంపిక చేయనున్నారు. పంచాయతీలు అంటే అక్రమ వసూళ్లకు, అడ్డగోలు పనులకు అడ్డాగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యేకించి వార్షిక ఆదాయం ఎక్కువ ఉన్న పంచా యతీల్లో ఇలాంటివి ఎక్కువగా చోటుచేసుకుంటు న్నాయి. దాంతో డిప్యూటీ ఎంపీడీవోలుగా పనిచేస్తున్న అదేవిధంగా పదోన్నతులను పొందిన వారిలో నుంచి రూర్బన్ పంచాయతీలకు కార్యదర్శులుగా ఎంపిక చేయనున్నారు. రూర్బన్ పంచాయతీలపై పర్యవేక్షణకు ప్రాంతీయ అధికారులను నియమించే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. మూడు, నాలుగు ఉమ్మడి జిల్లాలకు ఒక అధికారిని నియమించనున్నారు. జెడ్పీ సీఈవో క్యాడర్ స్థాయి అధికారులను ప్రాంతీయ పర్యవేక్షణాధికారులుగా నియమించే అవకాశం ఉంది. విశాఖ, రాజమహేంద్రవరం, గుంటూరు, అనంతపురంలో ప్రాంతీయ కార్యాలయాలు ఉంటాయి. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌కు ప్రాంతీయ అధికారులు జవాబుదారీగా సైతం ఉంటారు. ప్రజల సేవలకు రూర్బన్ పంచాయతీల్లో పురపాలికల తరహాలో కొత్తగా నాలుగు విభాగాలు అందుబాటులోకి రానున్నాయి. ఇందులో ప్రజారోగ్య విభాగం ద్వారా శానిటేషన్ పనులకుగాను దాదాపు 1025 మంది కార్మికుల సేవలను వినియోగించనున్నారు. ఇందులో భాగంగా వీరితో ఇళ్ల నుంచి చెత్త సేకరణతో పాటు మురుగు కాలువలను శుభ్రం చేయించనున్నారు. దోమల నియంత్రణకు ఫాగింగ్ నుంచి సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ వరకు ప్రజారోగ్య విభాగానిదే బాధ్యతగా ఉంటుంది ఇంజినీరింగ్ విభాగం ద్వారా ఆర్థిక సంఘం, ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ నిధులతో అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. పాడైన రహదారులకు మరమ్మతులు, కొత్తవి నిర్మాణం ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో పనులను నిర్వహిస్తారు. మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ బాధ్యత కూడా ఇంజినీరింగ్ విభాగానికే ఉంటుంది. గ్రామీణ ప్రణాళికా విభాగం ద్వారా కొత్త నిర్మాణాలకు అనుమతులు, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే నిర్మాణాల నియంత్రణ వంటివి ప్లానింగ్ కార్యదర్శి ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. రూర్బన్ పంచాయతీలకు ప్రత్యేకంగా బృహత్తర ప్రణాళికలు (మాస్టర్ ప్లాన్) రూపొందించనున్నారు. ప్రణాళికా బద్ధంగా పంచాయతీలను అభివృద్ధి చేయాలన్నది ప్రధాన ఉద్దేశం. రెవెన్యూ విభాగం ద్వారా ప్రజల నుంచి ఆస్తి పన్నుల వసూలు, అదే విధంగా కొత్త నిర్మాణాలకు విధిగా పన్నును విధించనున్నారు. పన్నేతర ఆదాయపు వసూళ్ల సక్రమంగా చేపట్టడం, దీంతో పాటు ఆదాయం పెరిగేలా చూడటం ఈ విభాగ ప్రధాన ఉద్దేశం. పన్నుల వసూళ్లలోనూ పారదర్శకత కోసం ఆన్‌లైన్ చెల్లింపులు చేయనున్నారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా జనన, మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్లను కూడా జారీ చేయనున్నారు.



## మా పెళ్లి రద్దు చేసుకున్నాం!

### స్మృతిమంథాన, పలాశ్‌మచ్చల్ ఇన్‌స్టాలో వెల్లడి

ముంబయి, డిసెంబరు 7: భారత స్టార్ మహిళాక్రికెటర్ స్మృతి మంధాన వివాహం రద్దయింది. ఆమే ఈ సమాచారం స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్‌స్టోరీలోప్రకటించారు. వివాహ సందర్భంగా జరిగిన ముందస్తు వేడుకల్లో స్మృతి తండి అస్వస్థతకు గురికావడం ఆపై రకరకాల పుకార్లు వ్యాపించడంతో పెళ్లిని తాత్కాలిక వాయిదా వేస్తున్నట్లుప్రకటించారు. మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్‌ముచ్చల్‌తో నవంబరు 23న జరగాల్సిన పెళ్లి అనుకోని కారణాలవల్ల వాయిదాపడింది. అయితే పెళ్లిపూర్తిగా రద్దయిందని తాజాగా ఆదివారం ఆమె తెలిపారు. మరోవైపు ఆమెను వివాహమాడాల్సిన పలాశ్ మచ్చల్‌కూడా తన పెళ్లిరద్దుగురించి ఇన్‌స్టా స్టోరీలో వెల్లడించారు. గత కొన్ని వారాలుగా నా జీవితంచుట్టూ చాలా ఊహాగానాలుసాగాయని, ఇలాంటి సమయంలో మాట్లాడటం ఎంతో అవసరమని, నాగురించి అన్న గోప్యంగా ఉండాలని భావించే వ్యక్తినని కానీ వివాహం రద్దయిందని స్పష్టంచేయాలనుకుంటున్నట్లు ఆమె తెలిపారరు. రెండు కుటుంబాల గోప్యతను గౌరవించి ముందుకు సాగేందుకు స్పేస్ ఇవ్వాలని అభ్యర్థించారు. దేశాన్ని అత్యున్నతస్థాయిలో ఉంచేందుకు ముందుకు సాగు తానన్నారు. భారత్ తరపున మరిన్ని మ్యాచ్‌లు ఆడిట్రోఫీలు గెలుస్తానని తనకు మద్దతిచ్చిన అందరికీ ధన్యవాదాలని స్మృతి తన ఇన్‌స్టా స్టోరీలో చెప్పారు. అలాగే పలాశ్‌కూడా తన జీవితంలో ముందుకువెళ్లాలని నిశ్చయించుకున్నానని, వ్యక్తిగత సంబంధంనుంచి బయటకు వచ్చినట్లు తెలిపారు. ఆధారాలేన్ని వదంతులు సులువుగా నమ్మేవాళ్లనిచూసి తట్టుకోవడంకష్టంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తంచేసారు. నాప్రతిష్టకు భంగం కలిగించే తప్పుడు సమాచారం వ్యాప్తిచేసినవారిపై మా లీగల్‌టీమ్ చట్టపరమైన చర్యలు తీసుకుంటుంది. ఈ కష్టసమయంలో నాపక్షాన నిలిచినవారికి ధన్యవాదాలని పలాశ్ తన స్టోరీలో చెప్పుకొచ్చారు.



## ఫార్మా, ఐటీకి హబ్‌గా ఎపి

### రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పివిఎన్ మాధవ్

విజయవాడ, డిసెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: ఫార్మా, ఐటీకి.. హబ్‌గా ఏపీ మారబోతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. దివంగత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయీ శత జయంతి కార్యక్రమాల కోఆర్డినేషన్‌కు ఒక వార్ రూమ్‌ను ప్రారంభించామని పేర్కొన్నారు. ఆదివారం విజయవాడలో మాధవ్ పర్యటించారు. అనంతరం మీడియాతో పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ వాజ్‌పేయీ శతజయంతి కార్యక్రమాలకు మొదటి రోజున మధ్యప్రదేశ్ సీఎం మోహన్ సింగ్, శివరాజ్‌సింగ్ చౌహాన్‌లను ఆహ్వానించామని తెలిపారు. వాజ్‌పేయీ స్మృతివనం నిర్మిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని తెలిపారు. కూటమి పాలనకు వాజ్‌పేయీ ఒక నిదర్శనంగా ఉంటారని చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధికి వాజ్‌పేయీ ఆద్యుడని వ్యాఖ్యానించారు. ఏపీ పురోగతి చెందడానికి, దేశంలోనే ప్రథమ స్థానానికి రావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని వివరించారు. రాయల సీమను ఒక పవర్ హౌస్‌గా అభివృద్ధి చేయనున్నారని చెప్పుకొచ్చారు. టెలికాం అత్యంత చౌకగా ఉండటానికి కారణం వాజ్‌పేయీ అని తెలిపారు. ఈ నెల 11వ తేదీన ధర్మవరంలో ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

## డివైడర్ ఢీకొని ఇద్దరు మృతి

**హైదరాబాద్ (తార్నాక), డిసెంబరు 7 ప్రభాతవార్త:** ఆదివారం స్నేహితులతో కలిసి సరదాగా క్రికెట్ ఆడుకునేందుకు కారులో బయలుదేరిన నలుగురు యువకులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన శ్రీపతి వెంకటరెడ్డి కుమారుడు అక్షిత్‌రెడ్డి (22), చెంగిచెర్లకు చెందిన సురేష్ కుమారుడు బాలాజీ మణికంఠ శివసాయిపటేల్ (22), శ్రీకాంత్, రాహుల్ స్నేహితులు. నలుగురు కలిసి కారులో మల్కాజ్‌గిరి నుంచి ఉప్పల్ వైపు క్రికెట్ ఆడేందుకు క్రికెట్ కిట్లతో కలిసి తెల్లవారుజామున వెళుతున్నారు. ఈ క్రమంలో లాలాపేట్ మౌలాలి ఫ్లైఓవర్ వద్దకు చేరుకోగానే పొగమంచు కారణంగా కారు నడుపుతున్న యువకుడికి ఏమి కనిపించలేదు. దీంతో డివైడర్‌ను వేగంగా ఢీకొట్టాడు. కారు నుజ్జునుజ్జు కాగా అక్షిత్‌రెడ్డి, శివసాయిపటేల్ మృతి చెందారు.



## యధేచ్ఛగా కారం కల్తీ

## 200 మిల్లుల్లో తయారీ

### ప్రజల ఆరోగ్యంతో కల్తీరాయుళ్ల చెలగాటం



- నిఘా వర్గాలకు కనిపించని మిల్లుల నిర్వాకం
- కన్నెత్తి చూడని ఆహార నియంత్రణ శాఖ
- తొడిమలు, నాసిరకం కాయలు వినియోగం
- ఆపై హానికరం రంగులు పులిమి వాడకం
- రూ.కోట్లలో పన్నుల ఎగవేస్తున్న వైనం

గుంటూరు మిర్చియార్డు, డిసెంబరు 7 ప్రభాతవార్త: కల్తీకారం తయారీదారులు గుంటూరు బ్రాండ్ ను దెబ్బతీస్తున్నారు. కల్తీకారానికి కేరాఫ్‌గా గుంటూరు మారడం దురదృష్టకరం. మిర్చి యార్డు పరిసరాల్లో నిత్యము 200 మిల్లుల్లో కల్తీకారం తయారవుతున్న నిఘవర్గాలు నిద్రపోవడం వెనుక మామూళ్ల బాగోతం నడుస్తున్నట్లు వినికిడి. ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన గుంటూరు మిర్చి యార్డుకు నిత్యము వేలాది టిక్కీలు, సీజన్లో అయితే లక్షల్లో యార్డుకు దిగుమతి అవుతుంటాయి. అయితే నాణ్యమైన సరుకును వ్యాపారులు కొనుగోలు చేసిన తర్వాత మిగిలిపోయిన తొడిమెలు తాలూకాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి హానికరమైన రంగులను కలిపి కల్తీకారం తయారు చేస్తున్నారు.

ఈ కల్తీకారాన్ని అనేక బ్రాండ్ల పేరు పెట్టి వినియోగదారులకు విక్రయిస్తున్నారు. కల్తీకారం గుంటూరు తో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు రవాణా అవుతుంది. కోట్ల రూపాయల కల్తీకారం లావాదేవీలు జరుగుతున్న విజిలెన్స్, ఆహార నియంత్రణ శాఖ, రెవెన్యూ శాఖ తదితర నిఘా వర్గాలు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం వెనుక ఆమ్యాలు నడుస్తున్నట్లు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. వినియోగదారులు ప్రజల ఆరోగ్యముతో చెలగాటమాడుతున్న కల్తీకారం నిర్వాకం పై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. యార్డు పరిసరాల్లో నిత్యం 150 నుంచి 200 మిల్లులలో కల్తీకారం వ్యాపారం జరుగుతుందని ఈ వ్యాపారంలో ఆరు తేరిన ఒక వ్యాపారి మరొకరితో చర్చించటం విశేషం. మేమంతా అధికారులకు నెలవారి మామూళ్ళు సమర్పించుకుంటాం.. మమ్మల్ని ఎవరు ఆపేది.. అంటూ ధీమా వ్యక్తం చేయడం వెనుక ఏ స్థాయిలో కల్తీకారం వ్యాపారం జరుగుతుందో ఊహించవచ్చు. కల్తీకారం మిల్లుల వైపు కన్నెత్తి చూడడానికి కూడా భయపడే విధంగా మాఫియా నడుపుతున్న కల్తీకారం మిల్లుల వ్యవహారంపై ఇంతవరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

కల్తీకారం అడ్డగా గుంటూరులో 95శాతం కల్తీకారం జరుగుతున్న ఫుడ్ సేఫ్టీ విభాగం, విజిలెన్స్ నెల వారి మామూళ్ళతో కల్తీ కారాన్ని అరికట్టలేకపోతున్నారు. తడిచిన మిరపకాయలు, తాలు మిరపకాయలు, ఫంగస్ కాయలు మిర్చి యార్డుకు కర్నూలు, గద్వాల్ నుంచి కొత్త మిరపకాయలు వస్తున్నాయి. వీటిని కొత్త కారం అని చెడిపోయిన ( గర్బాలు పోయిన) మిరపకాయలు, తొడిములు, వరిపొట్టు మిక్సింగ్ చేసి కారం ఆడిస్తున్నారు. ప్రతి కారం మిల్లు యజమానులు ఏజెంట్లు మిల్లులకు తాళాలు వేసి కల్తీకారం అక్రమంగా తయారు చేస్తున్నారు. మిల్లులో ఉన్న గుమస్తాలు హమాలీలు మా యజమాని ఎవరు వచ్చినా తాళం తీయవద్దు అని చెబుతున్నారు. తాలు మిరపకాయలు కారం ఆడిస్తున్నాము అని బహిరంగంగానే పేర్కొంటున్నారు. కొందరు యజమానులపై 2016-17లో కల్తీ కారానికి పాల్పడ్డ యజమానులపై కేసులు నమోదు చేశారు, గుంటూరు, ఖమ్మం, ఎమ్మిగనూరు ప్రాంతాలలో కేసులు నమోదు చేశారు.

### డబ్బుతో అవినీతిని కేసులను మాఫీ చేసుకుంటున్నారు

ఒక యజమాని తినడానికి తిండి లేక వేరే ప్రాంతం నుంచి గుంటూరు నగరానికి వలస వచ్చి ఇక్కడ వెహికల్స్ రిపేర్ (మోటారు సైకిల్స్‌కి గాలి పెట్టడం,పంచర్లు) వేయడం స్టేజి నుంచి కల్తీ కారం కుంభకోణంలో భాగమై ఈరోజు కల్తీకారం అగ్రస్థానంలో ఉన్నాడు. మరికొందరు వేరే వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి వంట మనిషిగా క్లీనింగ్ గా వచ్చి కల్తీకారం కుంభకోణంలో పాత్రులై తమ వంతు వచ్చిన ఆదాయాన్ని ఆస్తులు రూపంలో పన్నులు కట్టకుండా భారీగా ఆస్తులు చేకూర్చుకున్నారు. ఇది ఐటీరంగ విభాగం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఒక ప్రభుత్వ ఉద్యోగి (డాక్టర్)గా ఉండి కొందరు కారం మిల్లులను లీజుగా తీసుకొని కల్తీ కారం వ్యాపారం నిర్వహిస్తున్నారు. కానీ అధికారులు ఈ కల్తీకారాన్ని నియంత్రించలేకపోతున్నారు. కనీసం రాష్ట్రస్థాయి ఫుడ్ కార్పొరేషన్ అధికారులు దీనిపై దృష్టి సాధించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రభుత్వం దీనిపైన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. 2015 2016 ఒక కేజీ రంపం పొడిని మూడు రూపాయలకు కొని దానిని కల్తీ కారంలో వాడి కేజీ 200కి విక్రయించిన బడా బాబులు. గతంలో కల్తీకారానికి పాల్పడ్డ కొందరు ఇప్పుడు విచ్చలవిడిగా కల్తీకారం తయారుకు పాల్పడుతున్నారు.

అధికార యంత్రాంగానికి నెల మామూలు అవసరమైనంత కోట్లల్లో ఇవ్వడానికైనా సిద్ధం అంటున్న కల్తీ కారం కేటుగాళ్ల 2016 -2017 నుంచి ఇప్పటివరకు, విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ విభాగం వారు ఇంత దారుణంగా కల్తీకారం జరుగుతున్న చూసిచూస్తున్నట్టు పోతున్నారు. కల్తీ కాలం వల్ల క్యాన్సర్ పేగు పూత అరుదుగా వస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఫుడ్ సేఫ్టీ విభాగంకల్తీ కారం పై వారు తగు చర్యలు వెంటనే తీసుకోవాలని ప్రజల వాపోతున్నారు. కల్తీ కారం మిల్లులయజమానులపై ఐటి దాడులు తక్షణమే జరిపించాలని మరి కొందరు అభిప్రాయ పడుతున్నారు. ఇంత దారుణం చేస్తున్నా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడంపై ప్రజల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి.

# టైటిల్ పోరుకు హైదరాబాద్



**న్యూఢిల్లీ:** క్వాలిఫయర్ 1లో చెన్నై సూపర్ వారియర్స్‌ను 4-2 తేడాతో ఓడించి హైదరాబాద్ రాయల్స్ అద్భుతమైన పునరాగమనం చేసింది. ముంబై స్మాషర్స్ ఎలిమినేటర్‌లో లక్నో లియోపార్డ్స్‌ను ఓడించి, క్వాలిఫయర్ చెన్నైని ఓడించి 2025 ఇండియన్ పికిల్‌బాల్ లీగ్‌లో తమ స్థానాన్ని బుక్ చేసుకుంది. గ్రాండ్ ర్యాలీలు 25 వరకు ఆడగా, ముంబై స్మాషర్స్ తొలి మ్యాచ్‌లో 25-24 తేడాతో క్యాపిటల్ వారియర్స్ గుర్గావ్‌ను ఓడించింది. ఆపై బెంగళూరు బ్లాస్టర్స్‌పై 25-22 తేడాతో సునాయాసంగా విజయం సాధించి ప్లేఆఫ్స్‌లో తమ స్థానాన్ని పదిలం చేసుకుంది. ప్లేస్‌మెంట్ ర్యాలీలో బెంగళూరు 25-21 తేడాతో గుర్గావ్‌ను ఓడించి ఐదవ స్థానంలో నిలిచింది. క్వాలిఫైయర్ 1లో, గ్రాండ్ ఫినాలేకు నేరుగా టికెట్ కోసం చెన్నై సూపర్ వారియర్స్ హైదరాబాద్ రాయల్స్‌తో తలపడింది. పురుషుల సింగిల్స్‌ను 15-11తో గెలుచుకుని, ఆపై హర్ష్ మెహతాతో జతకట్టి 2-0 ఆధిక్యంలో నిలిచి, అదే స్కోరును పునరావృతం చేస్తూ, మిచ్ హార్గ్రీవ్స్ చెన్నైకి ఆదర్శవంతమైన ఆరంభాన్ని అందించాడు. ఇక మహిళల సింగిల్స్‌లో రూస్ వాన్ రీక్ vs మేగాన్ ఫడ్జ్ అజేయంగా నిలిచింది. కిచెన్ లైన్‌ను ఆధిపత్యం చేసి 15-13 తేడాతో ఓటమిని అందించింది. వాన్ రీక్ లీగ్‌లో ఏకైక సింగిల్స్ ఓటమి. హైదరాబాద్ ఆ జోరును మహిళల డబుల్స్‌లోకి తీసుకెళ్లింది. అక్కడ ఫడ్జ్, శ్రేయ చక్రవర్తి చెన్నై జోడీ చివరి ప్రయత్నంగా 15-13తో గెలిచి టైను సమం చేశారు. గ్రాండ్ ర్యాలీలో హైదరాబాద్ జట్టు 21-17 తేడాతో చెన్నై ఆధిక్యాన్ని తారుమారు చేసి ఫైనల్‌కు చేరుకుంది.

## బహ్రెయిన్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో..
# రివాన్ టాప్ 10 ప్రదర్శన



**న్యూఢిల్లీ:** బహ్రెయిన్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో ముగిసిన అత్యంత పోటీతత్వ రోటాక్స్ మాక్స్ ఛాలెంజ్ గ్రాండ్ ఫైనల్స్‌లో భారతదేశానికి చెందిన రివాన్ దేవ్ ప్రీతమ్ రెండు టాప్10 ప్రదర్శనలను అందించాడు. ఇటీవలే హ్యాట్రిక్ జాతీయ ఛాంపియన్‌షిప్ టైటిళ్లను పూర్తి చేసిన చెన్నైకి చెందిన 12 ఏళ్ల రివాన్, ప్రీఫైనల్‌లో ఘనమైన డ్రైవ్‌తో ముందుకు వచ్చి పి12 నుండి ప్రారంభించిన తర్వాత ఆరవ స్థానంలో నిలిచాడు. ఫైనల్‌లో, 72 మంది డ్రైవర్లతో కూడిన రేసులో రివాన్ తొమ్మిదవ స్థానంలో నిలిచాడు. ఈ ప్రక్రియలో, రివాన్ తన ప్రతిభను మాత్రమే కాకుండా, మిడ్‌గ్రిడ్ స్థానాల నుండి ప్రారంభించిన తర్వాత మైదానంలో పోరాడాలనే తన దృఢ సంకల్పాన్ని కూడా ప్రదర్శించాడు. మరో రెండు భారతీయ ఎంట్రీలు, సీనియర్ విభాగంలో బెంగళూరుకు చెందిన ఇషాన్ మాదేష్, జూనియర్ విభాగంలో చెన్నైకి చెందిన ఎషాంత్ వెంగటేసన్ ముందుకు వచ్చినప్పటికీ ఇద్దరూ ఫైనల్స్‌కు అర్హత సాధించలేదు. కాగా రోటాక్స్ మాక్స్ ఛాలెంజ్ గ్రాండ్ ఫైనల్స్ ప్రపంచ కార్టింగ్ పోటీలో అత్యంత ఉత్తమమైనదిగా గుర్తింపు పొందింది. బహ్రెయిన్ ఈవెంట్ కోసం, 60 దేశాల నుండి 394 మంది డ్రైవర్లు అర్హత సాధించారు. గత నెలలో ముగిసిన నేషనల్ కార్టింగ్ ఛాంపియన్‌షిప్ 2025లో తమ తమ విభాగాలలో ఛాంపియన్‌షిప్ గెలుచుకున్న తర్వాత మూడు భారతీయ ఎంట్రీలు ఇషాన్ మాదేష్, ఎషాంత్ వెంగటేశన్, రివాన్ దేవ్ ప్రీతం గ్రాండ్ ఫైనల్స్‌కు అర్హత సాధించారు.

# గౌహతి మాస్టర్స్.. ఛాంపియన్‌గా సంస్కర్

**న్యూఢిల్లీ:** గౌహతి మాస్టర్స్ 2025, పురుషుల సింగిల్స్ ఛాంపియన్‌గా సంస్కర్ సరస్వత్ నిలిచాడు. ఇదే సమయంలో మహిళల విభాగంలో తన్వీ శర్మ ఓడిపోయింది. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్‌ను గెలుచుకుని సంస్కార్ తన తొలి వరల్డ్ టూర్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. ఈ టోర్నమెంట్‌లో ప్రపంచ ర్యాంక్‌లో 384వ స్థానంలో ఉన్న సరస్వత్ 21-11, 17-21, 21-13తో కఠినమైన మూడు గేమ్‌ల ఫైనల్‌లో అనుభవజ్ఞుడైన మిథున్ మజునాథ్‌ను ఓడించాడు. ఆట అంతటా తన ఆధిక్యాన్ని కోల్పోకుండా తన సీనియర్ స్వదేశీయుడిపై ఆధిపత్యం చెలాయించి మొదటి గేమ్‌ను కైవసం చేసుకున్నాడు. రెండో గేమ్‌లో 8-2 ఆధిక్యంలో ఉన్న తర్వాత వరుస గేమ్ విజయం సాధించాడు. కాగా టీనేజర్ తన్వి శర్మ, మరోసారి టైటిల్‌కు ఒక విజయం దూరంలో నిలిచింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో ఆమె తన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయింది. చైనీస్ తైపీకి చెందిన తుంగ్ సియోటాంగ్ చేతిలో రెండు గేమ్‌లను కోల్పోయి, రన్నరప్‌గా నిలిచింది. 2024 ఒడిశా మాస్టర్స్ సూపర్ 100, 2025 యుఎస్ ఓపెన్ సూపర్ 300 తర్వాత ప్రస్తుత జూనియర్ ప్రపంచ ఫైనలిస్ట్‌కు ఇది మూడవ రన్నరప్ స్థానం. మరోవైపు యువ పురుషుల డబుల్స్ జోడీ పృథ్వీ రాయ్-సాయి ప్రతీక్ కూడా మలేషియా జంట తాయ్ / కాంగ్ చేతిలో 13-21, 18-21 తేడాతో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచారు.




ఆట







# మినీ వేలంలో ముగ్గురు స్టార్స్‌పైనే ఫోకస్

## భారీ బిడ్లకు ఫ్రాంచైజీలు సిద్ధం

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 మినీ వేలం డిసెంబర్ 16న అబుదాబిలో జరగనుంది. ఇది మినీ వేలం కావడంతో ఒకే రోజులో ముగుస్తుంది. అయితే ఈసారి ముగ్గురు స్టార్ ఆటగాళ్ల కోసం ఐపీఎల్ ఫ్రాంచైజీలు భారీ బిడ్లకు సిద్ధమవుతున్నాయి. మినీ వేలం కోసం 1,355 మంది ఆటగాళ్లు నమోదు చేసుకోగా, మొత్తం 77 స్లాట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 31 విదేశీ ఆటగాళ్లకు అందుబాటులో ఉన్నాయి. ఐపీఎల్ మినీ వేలంలో అత్యధిక బేస్ ధర రూ. 2 కోట్లు కాగా ఈ విభాగంలో 45 మంది ప్లేయర్లు నమోదు చేసుకున్నారు. అయితే వీరిలో ఇద్దరు భారతీయ ఆటగాళ్లు, ఒక విదేశీ ప్లేయర్ ఉన్నారు. ఆ ఆటగాళ్లు ఎవరంటే ఆల్ రౌండర్ వెంకటేష్ అయ్యర్, స్పిన్నర్ రవి బిష్ణోయ్ మరియు ఆస్ట్రేలియా ప్లేయర్ కామెరాన్ గ్రీన్. గత సీజన్‌లో వెంకటేష్ అయ్యర్ అత్యంత ఖరీదైన ప్లేయర్లలో మూడవ స్థానంలో ఉన్నాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు అతన్ని రూ.24 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే ఐపీఎల్ 2025లో అయ్యర్ ప్రదర్శన సాధారణంగా ఉండటంతో ఈసారి వేలానికి ముందే అతన్ని రిలీజ్ చేసింది. దీంతో ఇప్పుడు చాలా జట్లు వెంకటేష్‌ను దక్కించుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయి. ముఖ్యంగా కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య అయ్యర్ కోసం పోటీ తీవ్రంగా ఉండబోతుంది. రవి బిష్ణోయ్ ఐపీఎల్ 2022 నుంచి లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడుతూ వచ్చాడు. కానీ 2025 ఐపీఎల్‌లో అతని ప్రదర్శన అంచనాలను అందుకోకపోవడంతో రిలీజ్ చేసింది. ఇప్పటివరకు అతను మొత్తం 77 మ్యాచ్‌లు ఆడి 72 వికెట్లు తీసిన యంగ్ లెగ్ స్పిన్నర్. ఇప్పుడు వేలంలో అన్ని జట్లలోనూ రవిపై ఆసక్తి ఉంది. కానీ ముఖ్యంగా చెన్నై సూపర్ కింగ్స్ అతన్ని తప్పకుండా దక్కించుకోవాలని చూస్తోంది. చెన్నైకి మంచి భారత స్పెషలిస్ట్ లెగ్ స్పిన్నర్ అవసరం ఉంది. కాబట్టి రవి బిష్ణోయ్‌ను తమ జట్టులో చేర్చుకోవాలని సీఎస్‌కే బలంగా ప్రయత్నం చేస్తుందని తెలుస్తోంది. ఆస్ట్రేలియాకు చెందిన విధ్వంసక ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ కూడా మినీ వేలంలోకి రానున్నాడు. ఐపీఎల్ 2024లో ఈ ఆటగాడిని ఆర్సీబీ ముంబై ఇండియన్స్ నుండి రూ.17.5 కోట్లకు ట్రేడ్ చేసుకుంది. గత సీజన్‌లో అతను గాయం కారణంగా ఆడలేకపోయాడు, కానీ ఈసారి తిరిగి వస్తున్నాడు. గ్రీన్ ఆస్ట్రేలియా ఫ్రంట్‌లైన్ ఆటగాడు, అతని ప్రస్తుత ఫామ్ అద్భుతంగా ఉంది. ఈ క్రమంలో ఇతడిపై రూ.25 కోట్ల వరకు బిడ్ పడే అవకాశం ఉంది. ముఖ్యంగా చెన్నై, కోల్‌కతా మధ్య ఈ ఆటగాడి కోసం గట్టి పోటీ కనిపించవచ్చు.

## రెండో టెస్టులో..
# ఇంగ్లండ్ ఓటమి

## 2-0తో ఆధిక్యంలో ఆస్ట్రేలియా

**న్యూఢిల్లీ:** టెస్టులో ఇంగ్లాండ్‌ను ఓడించి, ఆస్ట్రేలియా సిరీస్ ఆధిక్యంలో ఉంది. ఆదివారం జరిగిన రెండో టెస్టులో ఆస్ట్రేలియా ఎనిమిది వికెట్ల తేడాతో ఇంగ్లాండ్‌ను ఓడించి 2025-26 యాషెస్ సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో నిలిచింది. బ్రిస్బేన్‌లో జరిగిన మ్యాచ్‌లో మైఖేల్ నేసర్ తొలి టెస్ట్‌లో ఐదు వికెట్లు పడగొట్టడంతో ఇంగ్లాండ్ ఓడిపోయింది. దీంతో ఆస్ట్రేలియా 65 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని మాత్రమే నిర్దేశించింది. ట్రావిస్ హెడ్ మరియు జేక్ వెదర్‌ల్యాండ్ తొలి వికెట్‌కు 37 పరుగులు జోడించే ప్రయత్నం చేసినా కానీ




డిన్నర్ తర్వాత గస్ అట్కిన్సన్ ట్రావిస్ హెడ్‌ను అవుట్ చేశాడు. అట్కిన్సన్ తన తదుపరి ఓవర్లో మార్నస్ లాబుస్చాగ్నేను అవుట్ చేశాడు, కానీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ తన జట్టును లైన్ దాటించేలా చేశాడు, బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ ఓవర్‌లో సిక్స్ కొట్టాడు. 4వ రోజు ప్రారంభంలో, బెన్ స్టోక్స్ మరియు విల్ జాక్స్ విరిగిన ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను స్థిరీకరించారు. ఏడవ వికెట్‌కు 96 పరుగులు జోడించారు. కానీ 35 ఏళ్ల నేజర్, తన మూడవ టెస్ట్ మాత్రమే ఆడుతూ, వరుస ఓవర్లలో రెండు సెట బ్యాటర్లను వెనక్కి పంపి, ఊపును తిరిగి పొందాడు. ఇంగ్లాండ్ చివరి నాలుగు వికెట్లను 17 పరుగులకే కోల్పోయింది, మరియు ఆస్ట్రేలియా వెంటనే విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.

## టాప్ ఐదు కార్పొరేట్లలో రూ.72,285 కోట్ల
# ఎంక్యాప్ పెరుగుదల




**న్యూఢిల్లీ, డిసెంబరు 7:** దేశంలో టాప్ పది బిజినెస్ దిగ్గజ కంపెనీల్లో ఐదుసంస్థల మార్కెట్ విలువలు అంటే టర్నోవర్ రూ.72,285 కోట్లు పెరిగాయి. టిసిఎస్, ఇన్ఫోసిస్ కంపెనీలు అతిపెద్ద లాభపడిన సంస్థలుగా నిలిచాయి. భారతి ఎయిర్‌టెల్, టిసిఎస్, ఐసిఐసిఐబ్యాంకు, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్ సంస్థలులాభాల్లో ఉన్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డి ఎఫ్‌సి బ్యాంకు, ఎస్‌బిఐ, ఎల్‌అండ్‌టి, ఎల్‌ఐసిలు కొంత కోతకు గురయ్యాయి. గతవారంలో బిఎస్‌ఇ బెంచ్‌మార్క్ స్వల్పంగా 5.7పాయింట్లు లాభపడితే ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 16.5 పాయింట్లు దిగజారింది. టిసిఎస్ 35,909.52 పాయింట్లు లాభపడి మార్కెట్ విలువలు రూ.11,71,862.37కోట్లకు చేరింది. ఇన్ఫోసిస్ మార్కెట్‌విలువలు 23,404.55కోట్లుపెరిగి మొత్తం రూ.6,71, 366.53 కోట్లకు చేరింది. ఇక బజాజ్‌ఫైనాన్స్‌పరంగా రూ.6720.28 కోట్లు పెరిగి రూ.6,52,396.39 కోట్లకు చేరింది. భారతి ఎయిర్‌టెల్ రూ.37891.9 కోట్లు పెరిగి రూ.12,01, 832.74 కోట్లకు చేరింది. ఇక ఐసిఐసిఐ బ్యాంకు పరంగా రూ.2458.49 కోట్లు పెరిగి రూ.9,95,184.46 కోట్లకు చేరుకుంది. రిలయన్స్ విలువలు మాత్రం రూ.35,116. 76 కోట్లు క్షీణించి రూ.20,85, 218.71 కోట్లకు చేరింది. ఎల్‌ఐసి విలువలు కూడా రూ.15,559. 49 కోట్లు క్షీణించి 5,50,021. 80 కోట్లకు చేరినట్లు తేలింది. ఇక ఎస్‌బిఐ విలువలు కూడా ఈ వారంలో రూ.7522.96 కోట్లు క్షీణించి రూ,8.96,662.19 కోట్లకు చేరితే హెచ్‌డిఎఫ్‌ఎసి బ్యాంకు రూ.5724.03 కోట్లు క్షీణించి రూ.15,43,019.64 కోట్లకు చేరింది.ఇక ఎల్‌అండ్‌టి మార్కెట్‌విలువలుకూడా రూ.4185.39కోట్లు క్షీణించి రూ.55,55, 459.56 కోట్లకు చేరింది. మార్కెట్ విలువలు క్షీణించినా రిలయన్స్ టాప్‌వన్‌గానే నిలిచింది. తర్వాత వరుసగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, టిసిఎస్, ఐసిఐసిఐబ్యాంకు, ఎస్‌బిఐ, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, ఎల్‌అండ్‌టి, ఎల్‌ఐసిలు నిలిచాయి.

# ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లపైనే ఇన్వెస్టర్ల ఫోకస్!




**ముంబయి, డిసెంబరు7:** అమెరికా ఫెడ్‌రిజర్వు నిర్ణయాలు ఈ వారం మార్కెట్లను ప్రభావితంచేస్తాయని అంచనా. ఫెడ్‌రిజర్వు పాలకవర్గ కమిటీ ఫెడరల్ ఓపెన్‌మార్కెట్ కమిటీసమావేశం నిర్ణయాలపై ట్రేడర్లు ఎంతో ఆసక్తితో ఉన్నారు. ఈ ప్రభావం దేశీయ ఈక్విటీ మార్కెట్లను ప్రభావితంచేయగలదు. అలాగే గ్లోబల్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ ఇన్వెస్టర్ల కార్యకలాపాలు వంటివి సెంటిమెంట్‌పై ప్రభావం చూపిస్తాయని మార్కెట్ నిపుణులు చెపుతున్నారు. గత వారంలో స్టాక్ మార్కెట్లు అంత ఆశాజనకంగా కొనసాగలేదు. సెన్సెక్స్,నిఫ్టీలు దాదాపుగా ఫ్లాట్‌గానే ముగిసాయి. ఈ వారం మార్కెట్లు ఈనెల 12న విడుదలచేసే సిపిఐ గణాంకాలను చూస్తారు. ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లనిర్ణయం కూడా కీలకం అవుతుందని రెలిగేర్‌బ్రోకింగ్ ఎస్‌విపి అజిత్‌మిశ్రా వెల్లడించారు. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 90 దాటిన క్రమంలో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు విత్‌డ్రాచేసే ఛాన్స్‌లు కూడా ఎక్కువగానే ఉంటాయి.

ఈనెల 9,10 తేదీల్లో జరిగే ఎఫ్‌ఒఎంసి సమావేశాలే ఇన్వెస్టర్లు ఎక్కువ ఆసక్తితో గమనిస్తారని స్వస్తికా ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ సీనియర్ టెక్నికల్ అనలిస్టు ప్రవేశ్ గౌర్ తెలిపారు. అలాగే అమెరికా ఆర్థిక గణాంకాలు కూడా ట్రేడర్ల రాడార్‌లో ఉంటుంది. 9వ తేదీ అమెరికా ఉపాధి గణాంకాలు విడుదలచేస్తుంది. అలాగే అమెరికా డాలర్ ట్రెజరీ బాండ్ల రాబడులు కూడా కీలకం అవుతాయి.వీటితోపాటు భారత్ ఆర్థికవృద్ధిగణాంకాలు రిజర్వుబ్యాంకు చేపట్టిన కార్యాచరణలను పరిగణనలోనికి తీసుకుని ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

## మూడు కంపెనీల నుంచి వేక్‌ఫిట్ రూ.186 కోట్లు సమీకరణ



**ముంబయి, డిసెంబరు 7:** హోమ్ అండ్ ఫర్నిషింగ్స్ కంపెనీ వేక్‌ఫిట్ ఇన్నొవేషన్స్ రూ.186 కోట్లను ముగ్గురు ఇన్వెస్టర్లనుంచి సమీకరించింది. సీడ్‌వ్యూ క్యాపిటల్, వైట్‌ఓక్ క్యాపిటల్, ఇన్ఫోఎడ్జ్, టీమ్‌సెక్ అధీనంలోని క్యాపిటల్2బిలనుంచి నిధులుసేకరించింది. పబ్లిక్ ఆఫర్‌కు ముందుగానే కొంత మొత్తం సేకరించుకోగలిగింది. స్టీడ్‌వ్యూ క్యాపిటల్ మారిషస్, వైట్‌ఓక్‌క్యాపిటల్, క్యాపిటల్ 2బిలు సమిష్టిగా 95.57 లక్షల ఈక్విటీ వాటా లను రూ.195 ధర చొప్పున కొనుగోలు చేసాయి. స్టీడ్ వ్యూక్యాపిటల్ రూ.101 కోట్ల విలువైలన షేర్లు కొంటే వైట్‌ఓక్ రూ.72 కోట్లు పెట్టుబడులు పెట్టింది. అలాగే క్యాపిటల్2బి కూడా రూ.13కోట్లు వేక్‌ఫిట్‌లో పెట్టుబడులుపెట్టాయి. కంపెనీలో ఉన్న పీక్ ఫిఫ్టీన్ పార్టనర్స్, రెడ్‌వుడ్‌ట్రస్ట్, వెర్లిన్‌వెస్ట్ ఎస్‌ఎ కంపెనీలనుంచి వీరు కొనుగోలుచేస్తున్నారు. సెకండరీ షేర్ బాలాయింపులు ఈనెల 3,4 తేదీల్లో బదలాయించారు. వేక్‌ఫిట్ ఈనెల ఐదో తేదీనే రూ.580 కోట్లు యాంకర్ ఇన్వెస్టర్లనుంచి సేకరించింది. హెచ్‌డిఎఫ్‌సి లైఫ్‌ఇన్సూరెన్స్, బజాజ్ లైఫ్, ప్రుడెన్షియల్ హాంకాంగ్, 360వన్, స్టీవ్యూ క్యాపి టల్, అముంది ఫండ్స్ న్యూసిల్క్‌రోడ్, హెచ్‌డి ఎఫ్‌సి మ్యూచువల్‌ఫండ్; యాక్సిస్ మూచువల్ ఫండ్స్ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి.




## దేశ ఆర్థికవ్యవస్థకు
# ఈ ఐదు రాష్ట్రాలే కీలకం
## జిడిపిలో వీటి వాటా 48శాతం!

**న్యూఢిల్లీ, డిసెంబరు 7:** భారత్ ఆర్థికవ్యవస్థ ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారుతోంది. దేశ స్థూల జిడిపి సుమారు 4.125 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. అంటే రూ.343 లక్షలకోట్లు అని అర్థం. దీనికితోడు ఆర్‌బిఐనుంచి ఆర్థికరంగ నిపుణులు కూడా 6.6శాతం వృద్ధితో ఉన్నారు. జిడిపి 2025-26లో 8.2శాతానికి విస్తరిస్తుందన్న అంచనాలు కూడా లేకపోలేదు. కేవలం ఐదు రాష్ట్రాలు మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్; ఉత్తరప్రదేశ్‌లనుంచి మాత్రమే ఎక్కువ వాటా అందుతోంది. ఈ ఐదు రాష్ట్రాలనుంచే 48శాతం దేశ జిడిపికి అందుతున్నట్లు అంచనా.ఆర్థికవృద్ధికి ఊతంగా ఎక్కువగా ఐటి, ఉత్పత్తిరంగం, సేవలరంగాలే కీలకం. జాతీయ సగటు 6.5శాతం కంటే మరింతగా వృద్ధినమోదుచేసాయి. ఉత్తరప్రదేశ్ పారిశ్రామిక వృద్ధి, మహారాష్ట్ర ఆర్థిక ఆధిపత్యం వంటివి భారత్ వృద్ధి స్టోరీకి కీలకంగా ఉన్నాయి. 2028-29 నాటికి దేశం ఐదులక్షలకోట్లడాలర్ల ఆర్థిక వ్యవస్థ ఉన్న దేశంగా మారుతోందని కేంద్ర అర్థగణాంకశాఖ వెల్లడించింది. మహారాష్ట్ర జిఎస్‌డిపి రూ.49.39 లక్షలకోట్లుగా ఉంది. భారత జిడిపిలో 13.5శాతం వాటాతో ఉంది. 2028కల్లా ఈరాష్ట్ర జిడిపి 55 లక్షలకోట్లకు చేరుతుందని అంచనా. అలాగే తమిళనాడు జిఎస్‌డిపి కూడా 35.68 లక్షలకోట్లుగా ఉంది. దేశ జిడిపికి 9శాతం వాటాతో ఉంది. సేవలరంగంనుంచే అత్యధికంగా వెళుతోంది. కర్ణాటక సిలికాన్ వ్యాలీగా ఉన్న కర్ణాటక కూడా దేశ జిడిపిలో 8.2శాతం వాటాతో ఉంది. ఉత్తరప్రదేశ్‌పరంగాచూస్తే రూ.30.70లక్షలకోట్లతో దేశ జిడిపికి 8.2శాతం వాటాను అందిస్తున్నట్లు తేలింది. ఈ ఐదు రాష్ట్రాలే దేశ ఆర్థికవృద్ధికి గ్రోత్ ఇంజిన్లు, పవర్‌హౌస్‌లుగా ఉన్నట్లు ఆర్థిక నిపుణుల అంచనా.

## స్విస్‌బ్యాంకులో 10వేల
# ఉద్యోగాలకోత!



**బెర్న్, డిసెంబరు 7:** స్విట్జర్లాండ్‌లో అతిపెద్ద బ్యాంకు అయిన యుబిఎస్ రానున్న మూడేళ్లలో పదివేల ఉద్యోగాలను తొలగించే ప్రణాళికనున పరిశీలిస్తోందని స్విస్‌పత్రిక సోన్‌టాగ్స్ బ్లిక్ వెల్లడించింది. 2023లో క్రెడిట్ స్యూసీ విలీనం తర్వాత ఈభారీ పునర్నిర్మాణప్రక్రియ జరుగుతున్నదని వెల్లడించింది. పాలనావ్యవహారాలను క్రమబద్ధీకరించడంకోసం ఈ కొలువుల కోతలు, విలీనప్రక్రియకు ఎంతో మేలుచేస్తాయని అధికారులు చెపుతు న్నారు. యుబిఎస్ ప్రతినిధులు ఈ పదివేల సంఖ్యను మాత్రం ధృవీకరించడంలేదు. క్రెడిట్‌స్యూయిస్ కొనుగోలు తర్వాత యుబిఎస్ తన కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం సామర్థ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రక్రియలోభాగంగా వీలైనంత తక్కువగా ఉద్యోగ కోతలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు యుబిఎస్ అధికారులు తెలిపారు. 2024 చివరినాటికి యుబిఎస్‌లో సుమారు 1.10 లక్షలమంది ఉద్యోగులు ఉండగా 10వేలమందిని కుదించిన తర్వాత సుమారు 9శాతం తగ్గించింది. ఇప్పటికే సెప్టెంబరు చివరినాటికి ఉద్యోగుల సంఖ్యను బ్యాంకు 1,04,427కి తగ్గించింది. ఈ విలీనం ప్రభావంతో ఇదివరకే సుమారు 15వేల ఉద్యోగాలు తొలగించినట్లు తెలుస్తోంది.

## ఒక్క వారంలోనే
# రూ.11,820కోట్లు విత్‌డ్రా!




**ముంబయి, డిసెంబరు 7:** విదేశీ ఇన్వెస్టర్లు ఈనెల మొదటివారంలో మార్కెట్ల నుంచి రూ.11,820 కోట్లు విత్‌డ్రాచేసినట్లు గణాంకాలు చెపుతున్నాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు క్షీణించినకారణంగా భారీ ఎత్తున ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపించారు. నవంబరులో కూడా 3765 కోట్లు విత్‌డ్రాచేసారు. అయితే అక్టోబరులో మాత్రం ఎఫ్‌పిఐలు 14,610 కోట్లు పెట్టుబడులుపెట్టారు. మూడునెలలు నిరంతరాయంగా విత్‌డ్రాచేసిన తర్వాత అక్టోబరులో పెట్టుబడులు పెంచారు. సెప్టెంబరులో 23,885కోట్లు, ఆగస్టులో 34,990 కోట్లు, జులైలో 17,700 కోట్లు విత్‌డ్రాచేసినట్లు డిపాజిటరీ డేటా చెపుతోంది. విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు ఈ నెలలోని మొదటివారంలోనే రూ.11,820 కోట్లు విత్‌డ్రాచేసినట్లు ఎన్‌ఎస్‌డిఎల్ వెల్లడించింది.

దీనితో మొత్తం పెట్టుబడులు విత్‌డ్రా ఈ ఏడాదిలో రూ.17.7 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.1.55 లక్షలకోట్లుగా ఉంది. కేవలం కరెన్సీ క్షీణత కారణంగానే ఇన్వెస్టర్లు ఎక్కువ విత్‌డ్రాచేస్తున్నట్లు నిపుణులు అంచనా. రూపాయి ఈ ఏడాది ఐదుశాతంవరకూ క్షీణించింది. ఈకాలంలోనే ఇన్వెస్టర్లు ఎక్కువ విత్‌డ్రాచేస్తున్నట్లు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ ముఖ్య వ్యూహకర్త వికె విజయ్‌కుమార్ తెలిపారు. ఎఫ్‌పిఐలు విత్‌డ్రాచేసినా దేశీయ ఇన్వెస్టర్లు మార్కెట్లకు ఊతం ఇస్తున్నారు. దీనికితోడు యుఎస్ భారత్‌ట్రేడ్‌డీల్ ఖరారులో జాప్యంకూడా గ్లోబల్ సెంటిమెంట్‌పై భారం పడుతోంది. దేశీయ ఇన్వెస్టర్లు ఈక్విటీల్లో రూ.19,783కోట్లు పెట్టుబడులుపెట్టారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps